# దేవుడంటే ఇదన్నమాట


రచన

**క్రిస్టోఫర్ హిచిన్స్**

అనువాదం

**నరిసెట్టి ఇన్నయ్య**



హోల్ సేల్ డిస్ట్రిబ్యూటర్స్

**నవోదయ బుక్ హౌస్**

కాచిగూడా క్రాస్ రోడ్స్, ఆర్యసమాజ్ మందిరం ఎదురుగా,   హైదరాబాద్ – 500 027. ఇండియా.

**GOD IS NOT GREAT**
*(DEVUDANTE IDANNAMAATA)*
First Telugu Version

**Author :** CHRISTOPHER HITCHENS
**Telugu :** NARISETTI INNAIAH

2009 First Publication
Center for Inquiry India
@ N. INNAIAH
A 60, Journalist Colony
Hyderabad – 500 033
INDIA.
innaiahn@yahoo.com

Price : Rs. 30 $ 10

***Printed at :***
PADMAJA GRAPHICS
Printers & Designers
6-3-850/14, Flat No.102
Cauvery Towers, Ameerpet
Near MCH Market, HYD – 16.
Cell : 9247179066, 9246526788

***Wholesale distributor,***
Navodaya Bookhouse,
Kachiguda X Roads,
Opp. Aryasamaj Mandir
Hyderabad-500 027. India.
P.No. 040 - 24652387.

***Also available***
2, Hawlings Ct. Brookville, MD 20833, USA

Thanks to Danny Baror,
Baror International Inc.
831 Mt. Kisco Road
P.B. No. 868, U S A
For permitting translation and Publication in Telugu.

# పరిచయం

దేవుడు గొప్పేమీ కాదు అనే పేరిట వెలువడిన గ్రంథం పాశ్చాత్య దేశాలలో విపరీతంగా అమ్ముడుబోతున్నది. క్రిష్టఫర్ హిచెన్స్ రచనలలో యింతగా బహుళ వ్యాప్తి చెందిన రచన యిదే. హిచిన్స్ చాలా శక్తివంతమైన విమర్శకుడు. పత్రికా రచయితగా, టెలివిజన్ కార్యక్రమాల నిర్వాహకుడుగా పేరొందాడు. హిచిన్స్ ఏ రచన చేసినా, దానివెనుక తీవ్రపరిశోధన వుంటుంది. అనేక మూలగ్రంథాల ప్రస్తావన వుంటుంది. సులభంగా ఎదుర్కోవడానికి వీల్లేని వాదనా పటిమ కనిపిస్తుంది. ప్రపంచ పర్యటనలో సేకరించి పరిశోధించిన విషయం ఈ గ్రంథంలో చూడొచ్చు.

ప్రస్తుత గ్రంథం మతాల అవినీతిపై విరుచుకపడిన విమర్శ. అన్ని మతాలనూ సమానంగా పరిగణించిన నిశిత రచన.

మార్గాంతరాలు సూచించినప్పుడు మానవ విలువలు, నీతి స్పష్టంగా సూచించాడు. మనం ఆశ్చర్యపడే అనేక సంఘటనలు చూసి, విశ్లేషించి, సమన్వయీకరణ కనబరిచాడు. హిచిన్స్ భారతదేశం, శ్రీలంక పర్యటించాడు.

వ్యక్తిగతంగా క్రిష్టఫర్ అనేక అనుభవాలు సంతరించు కున్నాడు. సనాతన మతాలను, విప్లవ పార్టీలను లోతుగా అనుభవించాడు. ఇప్పుడు మానవ విలువలలో మునిగి తేలుతున్నాడు.

క్రిష్టఫర్ హిచెన్స్ ను వాషింగ్టన్ లో సెప్టెంబరు 30, 2007న ఒక మహాసభలో కలిశాను. ఆయన రచన అనువదించి తెలుగులో ప్రచురించడానికి, శాస్త్రీయ పరిశీలనా కేంద్రం పక్షాన అనుమతి కోరాను. ఆయన అంగీకరించి వివరాలకు తన ప్రచురణకర్తకు రాయమన్నాడు. అలా రాయగా ఎలాంటి డబ్బు డిమాండ్ లేకుండా యిచ్చారు. న్యూయార్క్ టైమ్స్ బెస్ట్ సెల్లర్ పుస్తకానికి అలా అనుమతి యివ్వడం అరుదైన అవకాశం.

క్రిష్టఫర్ హిచిన్స్ రచన చాలా వేగంగా పరుగెడుతుంది. అంత వేగంగా ఆలోచింపచేస్తుంది. గూడుకట్టుకపోయిన మూఢనమ్మకాలను వదిలించడానికి, మనుషుల్ని ఉత్తమ విలువలతో నడుచుకునేటట్లు చేయడానికి తోడ్పడుతుంది. అందుకే యీ అనువాదం తలపెట్టాను.

వెనిగళ్ళ కోమల (నా భార్య) ప్రూఫులు చూచి సలహాలిచ్చారు.

శాస్త్రీయ పరిశీలనా కేంద్రం చేస్తున్న కృషిలో భాగంగా యీ పుస్తకాన్ని సమర్పిస్తున్నాం.

-- ఎన్. ఇన్నయ్య.

## విషయసూచిక

**అధ్యాయం – 1**
స్వేచ్ఛగా బ్రతకగలగాలి 1
**అధ్యాయం – 2**
మతమన్నది మారణహోమం అయితే 7
**అధ్యాయం – 3**
దైవసృష్టిలో పందిలేదా ? 16
**అధ్యాయం – 4**
ఆరోగ్యంగా బతకనివ్వని మతం 18
**అధ్యాయం – 5**
మతతత్వంలో నిలిచేది ఏదీ లేదు 24
**అధ్యాయం – 6**
ప్రకృతి వెనక ఏ పథకం ఉందో! 27
**అధ్యాయం – 7**
బైబిల్ ఘోరాలు వినుడీ! 34
**అధ్యాయం – 8**
పాత బైబుల్ పాపాలకు మించిన కొత్త నిబంధన 40
**అధ్యాయం – 9**
బైబుల్ నుండి కొరాన్ కు 47
**అధ్యాయం – 10**
అద్భుతాల ముసుగులో 51
**అధ్యాయం – 11**
కొత్త దేవుడండీ 56
**అధ్యాయం – 12**
ఏరీ ఆ దేవుళ్ళు ? ఎక్కడ ఆ మతాలు ? 61
**అధ్యాయం – 13**
మతంలో నీతి వుంటుందా ? 64
**అధ్యాయం – 14**
కామిగానివాడు మోక్షగామి కాడయా 69
**అధ్యాయం – 15**
పాపాలకు జన్మ యిచ్చిందెవరు ? 75
**అధ్యాయం – 16**
పిల్లల్ని చెడగొడుతున్న మతాలు 78
**అధ్యాయం – 17**
ఫాసిజం, నాజీలకు మద్దతుదారులుగా మతాలు 81
**అధ్యాయం – 18**
అణచివేతకు గురయిన స్వేచ్ఛాలోచన 85
**అధ్యాయం – 19**
కొత్త వికాసం నేటి అవసరం 88

# అధ్యాయం – 1

# స్వేచ్ఛగా బ్రతకగలగాలి

నాకు 9ఏళ్ళ వయస్సు. కేరింతలు కొడుతూ బడికి వెళ్ళేవాడిని. మా టీచర్ ఆదరంగా పలకరించేది. క్లాస్ లో పాఠాలు ఆకర్షణీయంగా చెప్పేది. బోర్ కొట్టేది కాదు. అప్పుడప్పుడూ బయటకు తీసుకెళ్ళేది. పొలం గట్లు, చెరువులు, కంచెలు, పొదలు, తోటలు తిప్పి, ఎన్నో సంగతులు చెప్పేది. నిక్కర్లు వేసుకుని పొదల్లో తిరుగుతుంటే, ఒక్కోసారి ముళ్ళు గీరుకుపోయి, రక్తం కారేది. వెంటనే మా టీచరు ఏవో ఆకులు కోసి పసరు పిండి వైద్యం చేసేది. పక్షుల గూళ్ళు చూపి వాటిని గురించి వివరించి చెప్పేది. తూనీగలు పట్టుకోవడం గమ్మత్తుగా ఉండేది.

అందుకే మా టీచర్ అంటే మాకు ఇష్టం. ఆమె కోప్పడడం, కొట్టడం నేను చూడలేదు. కొందరు టీచర్లు బాదేవారనుకోండి.

ఇంగ్లండ్ లో ఒక గ్రామంలో స్కూలు మాది. డార్ట్ మూర్ దీనిపేరు. మా టీచర్ కు పిల్లలు లేరు. పెంపుడు కుక్క ఉండేది. మమ్మల్ని ఇంటికి పిలిచి చాక్లెట్లు పెట్టేది. ఆమె పేరు జీన్ వాట్స్.

ప్రకృతి దృశ్యాలను చూపి వర్ణిస్తున్నప్పుడు మా టీచర్ సున్నితంగా దేవుడిని ప్రవేశపెట్టేది.  పచ్చని పైర్లకు చెట్లకు దేవుడు కారణం అనేది. పిల్లల మనస్సుపై దైవ భక్తి అలా జొప్పించేది. ౯ ఏళ్ళ వయస్సులో టీచర్ చెప్పిందే వేదం. సూర్యకిరణాల ప్రయోజనం, క్లోరోఫిల్, ఫోటో సింథసిస్ విషయం తెలియదు కదా. పచ్చదనానికి అవి కారణాలని టీచర్ చెప్పలేదు.

ప్రతి రోజూ క్లాస్ లో చిన్న పరీక్ష పెట్టేవారు. అది బైబిల్ గురించి. ఒక్కొక్క ప్రకరణ నుండి ఏదో ఒక విషయాన్ని యిచ్చి చదవమనేవారు. అందులో ప్రశ్నలిచ్చి, రాయమనేవారు. బైబిల్ క్రైస్తవులకు పవిత్ర గ్రంథం. దానిని చదివించడానికి క్లాసులో ఆకర్షణీయ పద్ధతులు ప్రయోగించేవారు.  నేను ఆవిధంగా బైబిల్ క్షుణ్ణంగా చదివాను. పరీక్షల్లో ఎప్పుడూ ఫస్టు వచ్చేవాడిని. క్రమేణా సహజ సందేహాలు రావడం మొదలైంది. ప్రకృతిలో పురుగులను, క్రిమి కీటకాలను యితర పక్షులు తినేటట్లు ఎందుకు దేవుడు సృష్టించాడు?  మన కళ్ళకు అనుకూలంగా ప్రకృతి ఏర్పడిందా? ప్రకృతికి అనుకూలంగా కళ్ళు ఏర్పడడమే సరైనది. నేను పెరిగేకొద్దీ విద్యార్థికి వచ్చే సందేహాలు వచ్చాయి. పిల్లవాడిని కాబట్టి అరమరికలు లేకుండా అడిగేవాడిని. అన్నిటినీ దేవుడే సృష్టించాడన్నారుకదా. అయితే ఆయన్ను స్తుతించడం దేనికి ? ప్రార్థన చేస్తే ఫలితాలు రావడం లేదు కదా? అంటే ప్రార్థన నిరర్థకమే కదా ?

జీసస్ క్రీస్తు ఒక వ్యక్తి గుడ్డితనం పోగొట్టాడనీ, అందువలన ఆయన మహిమ తెలుస్తుందంటారు. అసలు గుడ్డితనమే లేకుండా చేయొచ్చుకదా. ఎందుకు చేయలేదు. సెక్స్ దైవ దృష్టిలో భాగమే కదా. అటువంటప్పుడు దానిపట్ల జగుప్స దేనికి ?

ఇలా సందేహాలు పెరిగిపోయాయి.

మా స్కూలు హెడ్ మాస్టరు అందరిచేతా రోజూ ప్రార్థనలు చేయించేవాడు. కానీ ఆయన పురుషాయితం – మరో పురుషుడితో సంపర్కం చేసేవాడు. అది బైబిల్ ప్రకారం తప్పు కదా.

మా బడిలో మమ్మల్ని కొట్టి, తిట్టి బైబిల్ నూరిపోయలేదు. ఆకర్షణీయంగా చెప్పారు. ఆ వయస్సులో చెబితే మనస్సుకు హత్తుకుపోతాయి కదా. కానీ చాలా చోట్ల అలా జరగడం  లేదు. నిర్బంధంగా మత బడులలో చిత్రహింసలు పెట్టి నేర్పిస్తున్నారు.

ఎవరైనా సందేహం వెలిబుచ్చితే, ప్రశ్నిస్తే మా హెడ్మాస్టర్ జాగ్రత్తగా సమాధానం చెప్పేవాడు. ఏమని ? మీకిప్పుడు తెలియదు. మీకు దగ్గరవాళ్ళు చనిపోతే మతం వూరట కలిగిస్తుంది. అది చాలా జుగుప్సాకరమైన సంఘటన అనిపించింది. ఆయన దగ్గర అనలేకపోయాను.

క్రైస్తవ మతంలో కేథలిక్ శాఖ శక్తివంతమైనది. అందులో పూజారులు పెండ్లి చేసుకోకూడదు. గుడిలో ప్రార్థనా సమయంలో తోడ్పడడానికి చిన్నపిల్లల్ని పెట్టేవారు. పూజారులు వారిని తమ సెక్స్ కోరికలు తీర్చుకోవడానికి వాడుకునే వారు. ఈ విషయం తెలిసినా వారి శాఖాధిపతి పోప్ ఏమీ చేయడం లేదు. మతం పేరిట జరిగే ఈ పురుషాయితాన్ని

తల్లిదండ్రులు దిగమింగు కుంటున్నారు. మతానికి నేను చెప్పే ఆక్షేపణలలో సెక్స్ పట్ల వారి ధోరణి ఒకటి. మానవుడిని గురించి మతం చెప్పేది కేవలం గుడ్డి నమ్మకాల మయమని అలాగే ప్రకృతి గురించి కూడా. ఇలా అభ్యంతరాలు తెలిపేవారు చాలామంది ఉంటున్నారు.

పుస్తకాలను మనుషులే రాస్తారు. వాటిలో కొన్నిటిని చక్కగా అలంకరించి, బైండ్ చేసి, దైవం ఇచ్చిన పవిత్ర మూలగ్రంథం అని నమ్మిస్తారు. పైగా మనుషులందరూ పాపాత్ములనీ, వారిని క్షమించడానికి ప్రార్థనలు చేయాలంటారు. ఇది దేవుని సృష్టికి అవమానకరం. అంతా దేవుడే సృష్టిస్తే, పాపం ఎక్కడనుండి వచ్చింది ? కావాలని దేవుడే పాపాత్ములను సృష్టించాడా ? ఇది విడ్డూరంగా తోస్తుంది.

ఒక స్థలాన్ని పవిత్రం అనడం ఎంత సబబు ? ప్రపంచంలో అన్ని స్థలాలు దైవ సృష్టి అయితే, అందులో ఒక్కొక్క స్థలాన్నీ కేటాయించి పవిత్రం అని ముద్ర వేయడం ఏమి ఆలోచన ?

మనుషులే మందిరాలు కడతారు. గుహల్లో చెక్కుతారు. విగ్రహాలు చేస్తారు. వాటి కోసం కొట్లాడటం, చంపుకోవడం ఎంత దారుణం ?

మరొక కొత్త ధోరణి ప్రబలుతున్నది. పవిత్ర గ్రంథాలు, మత విశ్వాసాలు, నమ్మకాలు, క్రతువులు, ఆచారాలు, శాస్త్రీయం అనిచెప్పి సమర్థించుకోడానికి సెక్స్ ను చూపుతున్నారు. ఇది అపహాస్యానికి పరాకాష్ట.

వివిధ ప్రాంతాలలో మనుషులు ఎక్కడికక్కడ ప్రాచీన కాలం నుండే దేవుళ్ళను ఊహించి, సృష్టించారు. వాటికి రకరకాల రూపకల్పన చేశారు. మానవుడు సృష్టికర్త. అది మరచిపోయి, తనను తాను తాకట్టు పెట్టుకోవడం, కేవలం మూఢనమ్మకం వలననే.

మతం ఊరట కలిగిస్తుందని బాధలో వున్నప్పుడు, చనిపోయినప్పుడు అది ఉపకరిస్తుందని చెబుతారు. అసలు చికిత్స బదులు, ప్లాసిబో చికిత్స చేయడం వంటిదే ఇది. చక్కెర మాత్రలు ఇచ్చి ఇదే మందు అనుకోమంటే, తాత్కాలికంగా కాసేపు భ్రమపడొచ్చు. కాని తరువాత దాని ప్రయోజనం లేదని తెలిసిపోతుంది. మతం కూడా అంతే.

మతం చెప్పేది సత్యం కాదని తెలుస్తూనే ఉంటుంది. మూలగ్రంథాలు సరికాదని అర్థం అవుతూనే ఉంటుంది. అనేక అసంబద్ధ విషయాలు, పరస్పర విరుద్ధ విషయాలూ బయటపడుతూనే వుంటాయి. ఒక మతాన్ని మరొక మతం ఖండిస్తూనే ఉంటుంది. మూలగ్రంథం ప్రమాణం కాదని మరో మూల గ్రంథం వస్తుంది. అయినా మూర్ఖంగా అట్టిపెట్టు కుంటారు.

ఒకరి మందిరాలు మరొకరు ధ్వంసం చేయడం చూస్తున్నాం కదా. ఇది మూఢనమ్మకాల కార్యకలాపం.

మనుషుల్ని మనుషులుగా బ్రతకనీయకుండా మతాలు చీల్చి విషపూరితం చేస్తున్నాయి. ఆట స్థలాల దగ్గర కొట్లాటలు పెడుతున్నాయి. మతం పేరిట జరగని దారుణం లేదు. మతానికి మనిషిని తాకట్టు పెడుతున్నారు.

మనం కలలు కంటాం. ఊహల్లో తేలియాడతాం. మతాలు సృష్టించిన భ్రమల్లో మనని బతకమంటున్నాయి. అలాంటి

భ్రమల్లో స్వర్గం, నరకం ఉన్నాయి.

మార్క్స్ మతాన్ని విమర్శించాడు. మతం కల్పించిన భ్రమల్ని మరచి పొమ్మన్నాడు. దానికి బదులు వాస్తవ ప్రపంచంలో మార్పులు, చేర్పులు చేసుకుంటూ పోవాలన్నాడు.

మూఢ నమ్మకాలు మనిషిని ఏస్థాయికైనా దిగజార్చగలవు. పూర్వం నుండీ యిదే పరిస్థితి. అజోటెక్ జాతివారు మనిషి ఛాతీ కోసి చూస్తేకాని సూర్యోదయం జరగదని అనుకునేవారు. దేవుడు ఒక్కడే అనే వారు ఆరాధించి, మొర వినిపించకపోతే దేవుడు పట్టించుకోడను కుంటున్నారు. ఈ నమ్మకం చుట్టూ ఎన్నో ఆచారాలూ, మొక్కుబడులు వచ్చాయి.

ప్రకృతి సౌందర్యాన్ని ఆనందించడానికి మతం అక్కరలేదు. కళలు, సంగీతం, చిత్రాలు, ఆస్వాదించడానికి దైవంతో నిమిత్తం లేదు. పాడు కోడానికి ఆడుకోడానికి సహకారం కావాలి. మతం కాదు.

మతంలో, దైవంలో, స్వర్గ, నరకాలలో నమ్మకం ఉన్నవారు తప్పులు చేస్తున్నారు. అవినీతికి పాల్పడుతున్నారు. ఘోరంగా చంపుకుంటున్నారు. మతం లేనివారు, దైవంలో నమ్మకం లేనివారు ఎక్కువ నేరాలు, పాపాలు చేస్తున్నారనడానికి ఎలాంటి ఆధారాలూ లేవు. మానవత, సహకారం ముఖ్యం.

షేక్స్పియర్ టాల్ స్టాయ్, షిల్లర్, డాస్టోవిస్కీ, జార్జి ఇలియట్ వంటి వారిరచనలలో నైతిక విషయాలు ఎంతో విడమరచి చెప్పారు. వారి సాహిత్యం మానవుల్ని ఆకట్టు కుంటున్నది.

విజ్ఞాన శాస్త్రం ప్రకృతి పొరల్ని విప్పుతూ వెలుగు ప్రసరింపజేస్తున్నది. హబుల్ టెలిస్కోపు ద్వారా అద్భుత దృశ్యాల్ని చూపుతున్నది. మూలగ్రంథాల స్వర్గ, నరక తప్పుడు వర్ణనలకు సైన్స్ లో ఆస్కారం లేదు.

అభిప్రాయ భేదాలు వచ్చినప్పుడు సైంటిస్టులు చంపుకోరు. ద్వేషించుకోరు. చర్చించుకుంటారు. తెలియక పోతే, ఆగి అన్వేషించి, తెలుసుకునే ప్రయత్నం చేస్తారు.

డార్విన్ పరిణామ తీరు తెన్నుల్ని విప్పి చూపాడు. జీవాణువుల రహస్య సంకేతాలను సైంటిస్ట్ క్రిక్ కనుగొని ప్రపంచానికి చూపాడు. అంతరిక్ష రహస్యాలను ఛేదించడంలో హాకిన్స్ తీవ్ర కృషిచేశాడు. తెలుసుకుంటూ పోవడం నిత్యకృత్యం. ఇది అనంతం. మతాలు చెప్పే అంతం అర్థలేనిది.

మత విశ్వాసాలు హఠాత్తుగా అదృశ్యం కావు. తెలుసుకుంటూ పోతూంటే అవి సడలిపోతాయి. ఎన్నో ఏళ్ళకుగానీ తొలగవు. ఈలోగా మతాల్ని, మత గ్రంథాల్ని తుడిచిపెట్టాలని గానీ మానవ హేతువాదులు కోరరు.

మనుషుల్ని స్వేచ్ఛగా వుండనివ్వాలి. ఎవరి మానాన వారు మనుగడ సాగించాలి. అందరూ నా మతమే స్వీకరించాలంటేనే చిక్కులు, అనర్థాలు, అశాంతి, హింస వస్తున్నది. వీటన్నిటికీ మతం మూలం. ప్రతి రంగాన్ని మతం విషపూరితం చేస్తున్నది.

-----

## అధ్యాయం – 2

# మతమన్నది మారణహోమం అయితే

తూర్పు దేశాలలో బొంబాయి నగరం ఆణిముత్యం వంటిది. బ్రిటిష్ వారి కట్టడాలు, బీచ్ ఒడ్డున దీపాల కాంతిలో చూడముచ్చటగా వుంటుంది. ఎంతో వైవిధ్యంగల పట్టణం. దీని సోయగాలు సాల్మన్ రష్దీ చక్కగా విప్పి చూపాడు. (ది మూర్స్ లాస్ట్ సై, మీరానాయర్ సినిమాలలోనూ యీ నగర సౌభాగ్యం గమనించవచ్చు. భారతదేశం విడిపోయినప్పుడు ఎందరో శరణార్థులకు బొంబాయి ఆశ్రయమిచ్చింది. సాంస్కృతిక సహజీవనం కనిపించే నగరమది. ఇరాన్ నుండి వచ్చిన పార్శీలు అక్కడ స్థిరపడ్డారు.

అలాంటి బొంబాయి నగరానికి పేరు మార్చి ముంబాయి అన్నారు. మత ఛాందస బాల్ థాకరే కేవలం మహారాష్ట్రుల గుత్తాధిపత్యం ఉండాలంటూ, గూండాలతో స్వైర విహారం చేయిస్తున్నాడు.

సాల్మన్ రష్దీ అక్కడివాడే. ముస్లింగానే పెరిగి కొరాన్ చదివాడు. శటానిక్ వర్సెస్ పేరిట పుస్తకం రాశాడు. అందులో దేవుడు చెప్పినవేగాక, సైతాన్ చెప్పినవి కూడా ప్రవక్త తలవని తలంపుగా స్వీకరించినట్లు ప్రస్తావించాడు. ముస్లిం అలా రాయడం ద్రోహం అనీ, మరణ శిక్ష విధించాలనీ అన్నారు. అయొతుల్లా ఖొమినీ రష్దీని చంపిన వారికి పారితోషికం ఇస్తానన్నాడు. శటానిక్ వర్సెస్ అనువాదకులను సైతం హింసించి, ఒకర్ని చంపేశారు. నార్వేలో పుస్తకం ప్రచురణకర్తను కాల్చి, మంచులో పడేసి పోయారు. అతడు బ్రతికాడు. నిరాయుధుడైన ఒక రచయితను దేశాధినేత చంపమని ఆదేశాలివ్వడం ఇస్లాం మతం వల్లనే. కేథలిక్ మతాధిపతులు, యూదు పురోహితులు సైతం సాల్మన్ రష్దీ కష్టాలు కొని తెచ్చు కున్నాడనడం విడ్డూరం. దేవుడొక్కడే అని నమ్మేవారి సిద్ధాంతాన్ని రష్దీ దెబ్బ తీశాడు.

సాల్మన్ రష్దీని అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆహ్వానించారు. అప్పుడు వాషింగ్టన్ లో నా ఇంట్లో రష్దీ ఉన్నాడు. ఇంటి చుట్టూ కాపలా పెట్టారు. బాగానే వుంది. కాని ఆయన వెళ్ళిపోయిన తరువాత కాపలా ఖర్చులు నన్ను పెట్టుకోమన్నారు. నా యింట్లో ఉన్నందుకు నాకు ఉత్తరోత్తరా బెదిరింపు ఫోన్లు వచ్చాయి.

చివరకు బ్రిటిష్ ప్రభుత్వం సాల్మన్ రష్దీకి రక్షణ యిచ్చింది. అది కూడా మూర్ఖత్వమని తప్పుపట్టారు. ఇదంతా దేవుడి పేరిట మతం పేరిట జరుగుతున్న తంతు.

## మదర్ థెరెసా

1996లో ఐర్లండ్ లో విడాకుల వివాదం తలెత్తింది. రోమన్ కాథలిక్కులు ససేమిరా విడాకులు అంగీకరించరాదన్నారు. సంస్కరణ కావాలి, విడాకులు ఒప్పుకోవాలని ప్రొటెస్టెంట్లు అన్నారు. ఉభయులూ క్రైస్తవులే కాని చిరకాలం పరస్పరం చంపుకున్నారు. ఎత్తుకెళ్ళి దాచి పెట్టారు. ఐర్లండ్ లో విడాకుల చట్టాన్ని సవరించడానికి రాజ్యాంగ సవరణ చేయాలి. అందుకుగాను ఓటుకు పెట్టారు.

అప్పుడు కలకత్తా నుండి కేథలిక్ మతస్థురాలు హుటాహుటిన ఐర్లండు చేరుకున్నది. విడాకులకు వ్యతిరేకంగా ఓటు వేయమని ప్రచారం చేసింది. భర్త తన్నినా, తాగొచ్చి చావమోదినా, ఎన్ని చిత్ర హింసలు పెట్టినా భార్య పడి ఉండాలన్నమాట. విమోచన కోరగూడదు. విడాకులు అడగకూడదు. ఇదీ కేథలిక్కుల ధోరణి.

ఎట్టకేలకు స్వల్ప సంఖ్యతో రాజ్యాంగ సవరణ నెగ్గింది. ప్రొటెస్టెంట్లు కోరినట్లు రాజ్యాంగ సవరణ జరిగింది. మతం పేరిట మదర్ థెరెసా పాత్ర అలాంటిది.

ఐర్లండ్ లో ప్రొటెస్టెంట్, కాథలిక్కుల మధ్య విద్వేషాలు ఎంతగా పెరిగాయో చూడండి. ఒకసారి బెల్ ఫాస్ట్ నగర వీధిలో ఎదురైన వ్యక్తిని ఒకతను నీవు కాథలిక్ వా, ప్రొటెస్టెంట్ వా అని అడిగడట. అతడు నేను నాస్తికుడిని అన్నాడట. అందుకు, అది సరే ప్రొటస్టంట్ నాస్తికుడవా? కేథలిక్ నాస్తికుడవా? అని అతను రెట్టించారట.

మానవుల మధ్య ద్వేషాల్ని పెంచి పోషించడంలో మతం పాత్ర అలాంటిది.

విడాకులు కోరడం పాపం అన్న మదర్ థెరెసా, ఇంగ్లండ్ యువరాణి డయానా విషయం వచ్చేసరికి రెండు నాల్కల ధోరణి ప్రదర్శించింది. భర్త నుండి విడిపోతే ఆమె జీవితం బాగుపడు తుందన్నది.

ఐర్లండ్ లో కేథలిక్కులు, ప్రొటస్టెంట్ లు ఒకరిని ఒకరు అంటరానివారుగా వెలివేసుకున్నారు. స్కూళ్ళు, గుడులు, వీధులు వేరు పరిచి అక్కడ కూడా అంటరానితనాన్ని పాటించారు. బడుల్లో పిల్లలకు విషపూరిత పాఠాలు చెప్పి, అవతలి వారిపై ద్వేషాన్ని నూరిపోశారు.

## సద్దాంహుస్సేన్

ఇరాక్ రాజధాని బాగ్దాద్ సంస్కృతికీ, చరిత్రకూ పేరొందిన పట్టణం. గ్రీకుల, రోమనుల రచనలలోని విజ్ఞానం అనువదించి యూరోప్ కు అందజేసిన ఖ్యాతి అక్కడి వారికే దక్కుతుంది. క్రైస్తవమతం అజ్ఞాన మతాంధకారంలో కొట్టుమిట్టాడు తున్నప్పుడు, ముస్లింలు ఎంతో సాహిత్యాన్ని, కళా సంపదను గ్రీకుల నుండి తెచ్చి అందించారు. బాగ్దాద్ గ్రంథాలయాలు సుప్రసిద్ధమైనవి. అక్కడి శిల్పులు నిపుణులు. ఖలీఫా పోషణలో అలాంటి కృషి చేయగలిగారు. అయితే మధ్య మధ్యలో కొందరు పాలకులు విధ్వంసక చర్యలకు పాల్పడుతూనే పోయారు. క్రైస్తవులు తొలుత తెలివి తక్కువగా గ్రీకుల నుండి ముస్లింలు అందించిన వాటిని నాశనం చేశారు. తరువాత గాని వాటి విలువ తెలిసి రాలేదు. బాగ్దాద్ లో వివిధ సంస్కృతులు విలసిల్లగా బాల్డియన్, సిస్టోరియన్ క్రైస్తవ విషయాలు గమనార్హం. యూదుల సంపద సైతం బాగ్దాద్ నగరం అట్టిపెట్టింది. జెరూసలేంలో వున్నంతమంది యూదులు బాగ్దాద్ లోనూ ఉండేవారు.

అలాంటి చోట సద్దాం హుస్సేన్ పాలకుడుగా రాజ్యానికి వచ్చాడు. కొందరు భ్రాంతివంతంగా అతడి పాలనను సెక్యులర్ అన్నారు. బాత్ పార్టీ నాయకుడుగా సద్దాం పెత్తనం చేపట్టాడు. ఆ పార్టీని మైఖల్ అనే క్రైస్తవుడు స్థాపించాడు. తొలుత అందరికీ పార్టీలో స్థానం వుండేది. కొద్దిమంది యూదులు సైతం లేకపోలేదు.

సద్దాం సున్నీ ముస్లిం, ఇరాక్ లో సున్నీలు, షియాలు, ఖర్దులు వున్నారు. సద్దాం రాజ్యాన్ని చేపట్టి, అల్ప సంఖ్యాక సున్నీలపై పెత్తనం చేశాడు. తన జెండాపై అల్లాహెూ అక్బర్ అని వేశాడు.

ఇరాన్ లో షియాల రాజ్యం వుంది. వారు సద్దాంను ద్రోహి అన్నారు. సద్దాం ఒకపక్కన ముల్లాల సమావేశం ఏర్పరచి పవిత్ర యుద్ధాల గురించి చర్చించాడు. ఆఫ్రికాలోని సుడాన్ లోని దారుణ హత్యాకాండ జరిపిన ప్రభుత్వంతో సంబంధాలు పెట్టుకొన్నాడు. ఖుర్దులను నిరంతరం వూచకోత కోశాడు. వారిపై రసాయనిక మారణాయుధాలు ప్రయోగించాడు. కొందరు ముస్లింలు చెడిపోయారని ముద్రవేసి బలవంతంగా ప్రవాసం పంపించాడు. ఇస్లాంపై నమ్మకాలు లేనివారిని చంపించాడు. అన్ని యుద్ధాల కూడలి అంటూ ఒక పెద్ద మసీదు నిర్మించాడు. తన రక్తంతో కొరాన్ రాయించానన్నాడు. పొరుగు రాజ్యమైన ఇరాన్ పై దాడి చేశాడు.

35 సంవత్సరాలపాటు సద్దాం పాలనలో ఇరాన్ ఖుర్దులు, షియాలు నరకం అనుభవించారు. సద్దాంను కూల దోసినప్పుడు బాధిత ముస్లింలు వూపిరి పీల్చుకున్నారు.

అందరూ ముస్లింలే. కొరాన్ ను పవిత్రంగా భావించేవారే. అల్లాను దేవుడనే వారే. అయినా మతం పేరిట సద్దాం యిదంతా చేశాడు. ఆ తర్వాత ముస్లింలలో తీవ్రవాదులు ఆల్ ఖైదాల పేరిట మారణకాండ జరిపారు. ఇరాక్ లో ముసుగులు ధరించని స్త్రీలని చంపారు. జర్నలిస్టులను, టీచర్లను హతమార్చారు. 2 శాతం క్రైస్తవులుండగా వారి చర్చీలలో బాంబులు పేల్చారు. సారాయి అమ్మేవారిని చంపారు. నేపాలీ హిందువుల్ని చంపి, వీడియోలలో చూపారు. పైగా ఈ చర్యలకు ముస్లిం సోదరత్వం అని పేరుపెట్టారు. సద్దాం కాలంలో షియాల ఊరేగింపులు అనుమతించ లేదు. అతని అనంతరం షియాలు ఊరేగింపులు జరుపుకుంటే బాంబులు పేల్చారు. షియాల మసీదుల్ని పేల్చారు. కర్బలా, నజఫ్ స్థలాలకు వచ్చే యాత్రీకులపై దాడి జరిపారు.

షియాలు పవిత్ర మార్గాన పయనించడం లేదని, కనుక వారిని హతమార్చడం సబబే అన్నారు. షియాలు బిన్ లాడెన్ ను శరణుజొచ్చాలనే ఎత్తుగడతో ఇలా చేశారు. కాని షియాలు ఎదురు తిరిగారు. వారి నాయకుడు అయోతుల్లా సిస్తానీ పిలుపునిచ్చినా పెడచెవిన పెట్టారు. ఆత్మాహుతి దళాలు ఏర్పరచి సున్నీలను హతమార్చారు. ముసుగు లేని వారిని వీరూ చంపారు. పొరుగు రాజ్యం ఇరాన్ వీరికి మద్దతు పలికింది. వర్ణాంతర వివాహాలు లేకుండా పోయాయి. ఇస్లాం పేరిట సంకుచిత ధోరణి ప్రబలింపజేశారు.

ఇరాక్ లో యిదంతా మతం పేరిట జరిగిన, జరుగుతున్న మారణకాండ. మతం అన్ని రంగాలను అక్కడ విషపూరితం చేసింది. పురోహిత వర్గాలు మానవత్వం కోసం నినదించారు. అది పేలవమైన పిలుపుగానే నిలిచిపోయింది.

## యూదులు - ముస్లింలు

బీరుట్ నగరం తూర్పు దేశాలలో పారిస్ వంటిది. అలాంటి సుందర ఉద్యానవనంలో మతాలు విషం చల్లాయి. చట్ట ప్రకారం బీరుట్ అధ్యక్షుడు క్రైస్తవుడు. పార్లమెంట్ స్పీకర్ ముస్లిం. షియాలు, ఖుర్దులకు ప్రాధాన్యత లేదు. క్రైస్తవ పార్టీ కేథలిక్ తీవ్రవాదుల చేతుల్లో వుండేది. హిట్లర్ నాయకత్వాన 1936లో ఒలింపిక్స్ ఆటలు జరిగాయి. అందులో పాల్గొన్న కేథలిక్ తీవ్రవాది పెరోగమాల్ హిట్లర్ ను మెచ్చుకున్నాడు. 1982లో ప్రవాస శిబిరాలలోవున్న పాలస్తీనా వారిని మూకుమ్మడిగా మట్టుపెట్టారు. అలా చేయమని జనరల్ షెరాన్ ఆర్డరిచ్చాడు. ముస్లింలకు వ్యతిరేకంగా ఫాసిస్టులు, క్రైస్తవులు కుమ్మక్కయ్యారు. లెబనాన్ లోకి ఇజ్రాయిల్ చొచ్చుక పోయినప్పుడు, హజ్ బుల్లా పార్టీ పుట్టుకొచ్చింది. దేవుడి పార్టీ అంటూ, షియాలను కూడగట్టుకున్నారు. ఇరాన్ నాయకత్వంలో పని చేశారు. ఒక క్రమపద్ధతిలో లెబనాన్ లో మనుషుల్ని ఎత్తుకపోయారు. ఆత్మాహుతి దళాలు తలెత్తాయి.

ప్రార్థనా సమావేశాల అనంతరం, ప్రత్యర్థులను తల నరికి పడేస్తుండేవారు. ఇదంతా మతం పేరిట జరిగింది.

క్రీస్తు పుట్టాడన్న బెత్లహాంను ముస్లింల నుండి స్వీకరించారు.

క్రైస్తవులు అప్పుడు యూదు ముఠాలను, బైజాంటైన్ క్రైస్తవులను చంపారు. జెరూసలేం వీధుల్లో మారణకాండ జరిపారు. బెత్లహాంలో ఇజ్రాయల్ సైనికాధికారులు కర్ఫ్యూ విధిస్తూ, హింస సాగించారు.

బైబిల్ పాత నిబంధనలో చెప్పారంటూ, వెస్ట్ బాంక్ లో వుండే హక్కు తమదేనని యూదులు వాదిస్తున్నారు. మరోవైపు హమాస్ ముస్లింలు వచ్చి, యావత్తు పాలస్తీన్ తమదేనని అంటున్నారు. బెత్లహాంలో క్రైస్తవులు యిబ్బందులకు గురయ్యారు. వారిపై జుట్టు పన్ను విధిస్తామన్నారు. ఇస్లాం చట్టానికి లోబడి బ్రతకాలన్నారు. ఉద్యోగం చేసే స్త్రీలు ఎవరూ పురుషులతో కరచాలనం చేయరాదన్నారు. పాలస్తీనాలో కార్లు వెతికి, ముసుగు లేని స్త్రీలను పట్టుకున్నారు.

ఇజ్రాయల్–పాలస్తీనా ప్రాంతమంతా మతాలు భీభత్సం కొనసాగిస్తు న్నాయి. అణు యుద్ధం చేసే స్థాయిలో పోతున్నారు. ఇదంతా మతాల పుణ్యమే.

## బెల్ గ్రేడ్

యుగస్లావియా రాజధానిగా బెల్ గ్రేడ్ బహుళ జాతుల మిశ్రితం. అక్కడ సనాతన క్రైస్తవులు, కేథలిక్కులు ఉన్నారు. ఒకప్పుడు నాజీలు ఆధిపత్యం వహించిన ప్రాంతం. వాటికన్ పోప్ పెత్తనం సాగింది. నాటి హిట్లర్ పాలసీ ప్రకారం అక్కడి యూదుల్ని మట్టుపెట్టారు. బలవంతంగా మత మార్పిడులు చేయించారు. సనాతన క్రైస్తవుల్ని చంపేశారు. కొందరిని తరిమేశారు. వారు పునరావాస శిబిరాలలో తల దాచుకోవలసి వచ్చింది.

1992 నుండీ అటు కేథలిక్కులు, యిటు సనాతన క్రైస్తవులు కలసి ముస్లింలను తుడిచి పెట్టసాగారు. మాజీ కమ్యూనిస్టు నాయకుడు మిలోవిక్ కనుసన్నలలో యీ మతపరమైన తుడిచిపేత కార్యక్రమం నడిచింది.

సారియోగా నగరం ముస్లింల ఆధిక్యతలో ఉండగా దానిని చుట్టుముట్టి బాంబుల వర్షం కురిపించారు. బోస్నియా హెర్జ్ గోవినా ప్రాంతాలలో యీ తుడిచిపేత సాగించారు. గ్రీక్, రష్యాల నుండి వచ్చిన మత ముఠాలు ఈ హత్యాకాండలో పాల్గొన్నాయి. దీనికి పురోహితుల దీవెనలు వున్నాయి. ఎలాగైనా, సెర్బియాలో బోస్నియాను కలపాలనే ఉద్దేశంతో యిలా చేశారు. చారిత్రక ప్రదేశాలు ధ్వంసం చేశారు. ఆటోమన్ నాగరికత కనిపించరాదన్నారు. కాల్పుల విరమణ తరువాత యీ పనులు చేశారు.

యునెస్కో గుర్తించిన ప్రపంచ  సంపద అయిన వంతెనలు కూలగొట్టారు. ఇదంతా మతం పేరిట క్రైస్తవులు చేసిన పనే. బయట ప్రపంచానికి చెప్పడానికి ఇదంతా మత యుద్ధం అన్నారు. ముస్లింలతో పోరాటం జరిగిన హత్యాకాండకు ఆ మాట వాడేవారు కాదు. ఈ విషయం కావాలని దాచిపెట్టారు. సనాతన క్రైస్తవులు బ్యాడ్జీలు ధరించి విధ్వంసకాండ జరిపారు. ఎంతసేపూ క్రొయేషియా సర్బియా అనే జాతుల సలహాలు అని ముసుగు కప్పారు తప్ప, క్రైస్తవుల మధ్య, మత కలహం అని రాయనే లేదు. ఇది కావాలని చేసిన పనే.

## తాలిబన్లు

ఆఫ్ఘనిస్తాన్ లో కొన్నాళ్ళు రాజ్యం చేసిన తాలిబన్లు షియాలను వూచకోత కోసారు. ఇది సహించలేక ఇరాన్ యుద్ధానికి తలపడింది. తాలిబన్లు బౌద్ధ ఖండాలను ధ్వంసం చేశారు. ఆఫ్ఘనిస్తాన్ లో భిన్న సంస్కృతి తమకు అవమానకరంగా తాలిబన్లు, అల్ ఖయిదాలు తలపోశాయి.

అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జంట భవనాలపై ముస్లిం తీవ్ర మత ఛాందసులు బాంబుల దాడి చేశారు. అదొక సాహస చర్యగా ఇస్లాం లోకం ఆహ్వానించింది. మత విశ్వాసం ముదిరితే ఏ స్థాయికైనా పోతారు. వారు ఆ విషయంలో చిత్త శుద్ధి గలవారే!

జంట భవనాలపై ముస్లింల దాడిపై అమెరికాలో క్రైస్తవ ఛాందస నాయకులు  స్పందించిన తీరు గమనార్హం. పాట్ రాబర్ట్ సన్, జెరీ పాల్ వెల్ అనే క్రైస్తవ నాయకులు అమెరికాలో గర్భస్రావం అంగీకరించడం, పురుషులతో పురుషులు సంభోగించడం వలన పాపం పెరిగిందన్నారు. దీనికి శిక్ష పడిందన్నారు. బిల్ గ్రాహం అనే మరో క్రైస్తవ ఛాందసుడు అలాగే మాట్లాడాడు.

అమెరికా రాజ్యాంగంలో ప్రథమ సవరణ చేసిన అధ్యక్షుడు జేమ్స్ మాడిసన్, మతాన్ని గౌరవించే చట్టాన్ని తృణీకరించాడు. ప్రభుత్వ ఉద్యోగాలకు మతపరమైన పరీక్ష కూడదన్నాడు. పురోహితుల్ని ప్రభుత్వం నియమించ రాదన్నాడు. పార్లమెంటులో, సైన్యంలో కూడా మత నియామకాలుండ రాదన్నాడు. చట్ట సభలకు పురోహితుల్ని పెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నాడు. ఇప్పుడు అమెరికా అలా నడవడం లేదు. చర్చి నాయకులు ముస్లిం ఇమామ్ ల వలె మాట్లాడుతున్నారు.

జన్నాన్ని మతాలు రెచ్చగొడుతున్నాయి. ఇది ప్రపంచ వ్యాప్తంగా సాగుతున్నది. శ్రీలంకలో క్రైస్తవులు సారాయి తాగడాన్ని ముస్లింలు, బౌద్ధులు  తప్పపడుతున్నారు. యూదుల సంస్కృతిని ముస్లింలు వెక్కిరిస్తారు. క్రైస్తవ పిల్లల రక్తాన్ని యూదులు కోరుకుంటారు.

పరస్పరం మత విద్వేషాలు తారస్థాయికి చేరుకొని మానవుల్ని నలచి వేస్తున్నాయి. నమ్మకం లేని వారి జీవితాల్లోనూ మతాలు జోక్యం చేసుకుంటున్నాయి. మత సహజీవనం వారికి ఇష్టం లేదు. మతాలన్నీ పరలోక విషయాలు చెప్పి, స్వర్గ నరకాలు వర్ణించి, మానవుల్ని ఆకట్టు కుంటున్నాయి. అక్కడే చిక్కు వస్తుంది. మతం యిచ్చే హామీలు, ప్రగల్భాలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి.  మానవులు సృష్టించిన మతాలు వారిపై ఎక్కి స్వారీ చేస్తున్నాయి. సైన్స్ ను వ్యతిరేకిస్తున్నాయి.

-----

## అధ్యాయం – 3

# దైవసృష్టిలో పందిలేదా ?

అన్ని మతాలు తమ వారిపై ఆంక్షలు విధిస్తున్నాయి. ఏది తినరాదో శాసిస్తున్నాయి.

శుక్రవారంనాడు తప్పనిసరిగా చేపలు తినాలని కేథలిక్కులు లోగడ అనేవారు. ఒకప్పుడు గోమాంసం తిని గోహత్య చేసిన హిందువులు, ఇప్పుడు ఆవులను పూజిస్తున్నారు. గోమాంసం నిషేధించమంటున్నారు. యూరోప్ లో ఆవులకు జబ్బుచేసి చనిపోతుంటే, వాటి మాంసం తినరాదన్నారు. అలాంటి దశలో భారత ప్రభుత్వం గోవులను తన దేశం నుండి యూరోప్ కు ఎగుమతి చేస్తానన్నది. ఇండియాలో గోవుల్ని చంపడాన్ని ఆ విధంగా అరికట్టవచ్చు ననుకున్నారు. ఎలుకల్ని, క్రిమికీటకాలను సైతం చంపరాదని వేద అహింసా వాదులైన జైనులు తదితరులు అంటున్నారు. (దశావతారాలలో పంది కూడా ఉన్నది సరే)

ప్రాచీన కాలం నుండీ యూదులు పందిని అసహ్యించుకున్నారు. తప్పనిసరిగా సున్తీ చేయించుకోవా లన్నట్లే పంది మాంసాన్ని నిషేధించారు. యూదుల పట్ల అన్నిటావ్యతిరేకత కనబరిచే ముస్లింలు యీ విషయంలో మాత్రం వారిని అనుకరించారు. నమ్మకం లేనివారు, యూదులను పందులు, కోతులుగా వర్ణిస్తూ ముస్లిం (ముఖ్యంగా సలాఫిస్ట్ లో) ప్రచారకులు చెబుతున్నారు. యూదులకు వ్యతిరేకంగా కొరాన్ లో (5.60 సురా) రాశారు. పంది మాంసం అశుభ్రమైనదనీ, త్యజించాలనీ రాశారు. ఇస్లాంలోకం యావత్తు పంది పట్ల యిదే ధోరణి అవలంబిస్తున్నది.

సుప్రసిద్ధ రచయిత జార్జి ఆర్వెల్ రాసిన యానిమల్ ఫాంను ఇస్లాం దేశాలు దగ్గరకు చేరనివ్వడం లేదు. దీని వలన వారి విద్యార్థులు ఎంతో కోల్పోతున్నారు. ఆ పుస్తకంలో పంది పాత్ర ఎంత నియంతృత్వమైనదో ఆర్వెల్ చూపాడు. ఈ పుస్తకాన్ని నిషేధించిన అరబ్ దేశాల విద్యామంత్రులు అందులో చక్కటి విషయాలను గ్రహించలేకపోయారు.

జార్జి ఆర్వెల్ కు పంది అంటే ఇష్టం లేదు. రైతుగా అతడు పంది చేత పని చేయించుకోలేకపోయాడు. అంతటితో కోపం పెంచుకున్నాడు. పందులు తమలో తాము తీవ్రంగా పోట్లాడుకుంటాయి. కొన్నిసార్లు తమ పిల్లల్నే తింటాయి. స్వేచ్ఛగా ఆడుకోనిస్తే పిల్లలు పంది పిల్లలతో ఆడుకోడానికి ముచ్చట పడతారు. కాని ముస్లిం ఇమాంలు, యూదు రాబై పురోహితులు అడ్డొస్తున్నారు కదా.

మనిషిమాంసం పందిమాంసం వలె ఉంటుందట. అందుకే కాబోలు న్యూగినీలో కాల్చిన మనిషిని నిటారైన పందిగా వర్ణించారు.

వేడి వాతావరణంలో పంది మాంసం జబ్బు చేస్తుందనీ సూక్ష్మజీవులు వస్తాయనీ యూదులు అంటారు. ఇదే వాదన చేపలకు కూడా చెప్పవచ్చు. కాని వాస్తవానికి వారు చెప్పే సూక్ష్మజీవులు వేడి దేశాలకంటే చలి దేశాలలోనే ఎక్కువ.

పందిమాంసం తినడం, జబ్బు పడడం, చనిపోవడం యూదులు కాని వారిలో కనిపించదు.

మొత్తం మీద పంది అంటే ఒకరకమైన భయం కొందరిలో వ్యాపించింది.

క్రైస్తవులు తమ ప్రార్థనలో క్రీస్తు మాంసాన్ని, క్రీస్తురక్తాన్ని సేవిస్తున్నట్లు భావించి, సేవిస్తారు. ఆ పేరిట నామమాత్రంగా వైన్ తాగడం, గోధుమ రొట్టె తినడం, అదే క్రీస్తు మాంసం అనుకోవడం ఉంది.

-----

# అధ్యాయం – 4

# ఆరోగ్యంగా బతకనివ్వని మతం

పోలియో చుక్కలు స్వీకరిస్తే నపుంసకులవుతారా? విరోచనాలు పుడతాయా? కలకత్తాలో ముస్లింలు పోలియోకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. అది పాశ్చాత్యుల కుట్ర అని వదంతులు వ్యాపింప చేశారు.

పోలియో చుక్కలు రెండు పర్యాయాలు వేయాలి. రెండో పర్యాయం వేయబోతే అలాంటి సమస్యలు ఎదురయ్యాయి.

2001లో నేను కలకత్తాలో యీ విషయాలు స్వయంగా గమనించాను. పశ్చిమ బెంగాల్ లో అనుకున్న ప్రకారం పోలియో చుక్కలు వేశారు. కాని కొన్ని చోట్ల యిలాంటి చిక్కులు అడ్డు వచ్చాయి. ప్రపంచంలో ఆఫ్ఘనిస్తాన్, మరికొన్ని కొండ ప్రదేశాల్లో పోలియో సమస్య యింకా వుంది. అక్కడ మత మూర్ఖత్వమే అడ్డొస్తున్నది. ఉత్తర నైజీరియాలో పోలియో యించుమించు అరికట్టగలిగారు.

అలాంటి చోట కూడా మరికొన్ని ప్రాంతాలలో పోలియో మిగిలి వుండటానికి ఛాందసులే కారణం. పోలియోకు వ్యతిరేకంగా ఏకంగా ఫత్వానే జారీ చేశారు.

అమెరికా, ఐక్యరాజ్య సమితి చేతులు కలిపి, ముస్లిం మత విశ్వాలకు వ్యతిరేకంగా కుట్రపన్నాయన్నారు. మత విశ్వాసుల్ని నిర్వీర్యం చేయాలను కున్నారని ప్రచారం చేశారు. పిల్లలకు పోలియో చుక్కలు వెయ్యనియ్య రాదన్నారు. అంతే, పోలియో తిరగబెట్టింది. అది నైజీరియాకే పరిమితం కాలేదు. అక్కడ నుండి మక్కా వెళ్లిన యాత్రికులు పోలియోను బాగా వ్యాపింపచేశారు. లోగడ పోలియో నిర్మూలన జరిగిన ప్రాంతాలకు, చివరకు ఎమెన్ దాకా తీసుకు వెళ్ళారు. ఇదేదో ముస్లింల ఛాందసానికే పరిమితం అనుకుంటే పొరపాటే.

కేథలిక్ క్లెరిక్స్ వాటికన్ పీఠాధిపతులుగా గర్భనిరోధక కండోమ్స్ కు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. కండోమ్స్ ను రహస్యంగా తయారు చేశారని, వాటి రంధ్రాలద్వారా ఎయిడ్స్ వైరస్ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. క్రైస్తవ పీఠాధిపతి కేంద్రం అలాంటి ప్రకటన జారీచేయడం దారుణం. పేద దేశాలలో అట్టడుగు వర్గాలపై దీని ఫలితాలు దారుణంగా వుంటాయి. బ్రెజిల్ మతాధిపతులు కండోమ్స్ కు వ్యతిరేకంగా బోధించారు. స్త్రీ, పురుష లైంగిక సంబంధం సహజంగా ఉండాలని అన్నారు. అంతటితో ఆగక, కుక్కలు సంభోగంలో కండోమ్స్ వాడతాయా అని అడిగారు.

ఆఫ్రికాలోని కెన్యా, ఉగాండా క్రైస్తవ బిషప్పులు కండోమ్ లకు విరుద్ధంగా విషపూరిత ప్రచారం చేశారు. పెళ్ళి అయిన స్త్రీలు ఎయిడ్స్ వ్యాధితో చనిపోతే, అమర జీవులుగా భావించాలన్నారు.

ఇండొనేషియాలో ముస్లిం ఉలేమాలు కండోమ్స్ ను వివాహితులకే పరివమితం చేయాలనీ, అదీ డాక్టర్ సూచించాలన్నారు. 1995లో ఉలేమా కౌన్సిల్ అలాంటి ఉత్తరువులిచ్చింది.

ఇరాన్ లో హెచ్.ఐ.వి. పాజిటివ్ తో ఉంటే ఉద్యోగులకు ఉద్వాసన చెపుతారు. ఎయిడ్స్ రోగులకు చికిత్స చేయ నిరాకరించే హక్కు డాక్టర్లకు ఉంది.

ఇస్లాం విలువలు పాటిస్తున్నందున ఎయిడ్స సమస్య పాకిస్తాన్ లో స్వల్పంగా ఉందని ఎయిడ్స్ కార్యక్రమ నిర్వాహకులు అన్నారు. ఒక స్త్రీ వ్యభిచారం బయటపడితే, శిక్షవేస్తూ, మూకమ్మడిగా ఆమెను సంభోగించవచ్చని తీర్పు చెప్పిన దేశం పాకిస్తాన్. ఇస్లాంలో కొరాన్ ప్రకారం పెళ్ళికి ముందు సంభోగం కూడదు. మాదక ద్రవ్యాలు వాడకూడదు. వ్యభిచారం దోషం. కనుక ఎయిడ్స్ వంటి వాటి పేరెత్తడానికి పాకిస్తాన్ లో వీల్లేదన్నారు.

కాని, ఇరాక్ లో యిందుకు వ్యతిరేక పద్ధతి వుంది. ముల్లాలు తాత్కాలిక వివాహాలను అనుమతిస్తారు. కొన్నిగంటలపాటు పెళ్ళిపేరిట లైసెన్స్ జారీ చేస్తారు. పెళ్ళి సర్టిఫికెట్ ఇస్తారు. దీన్ని వ్యభిచారం అనవచ్చు. టెహ్రాన్ శివార్లలో అయోతుల్లా ఖోమినీ మందిరం సమీపాన యిలాంటి అనుమతి పత్రాన్ని నాకు అందజేయ బోయారు. భర్తల ద్వారా ఎయిడ్స్

వైరస్ స్వీకరించిన స్త్రీలు, ముసుగుల్లో కుమిలి చావాల్సిందే. ఇలాంటి మత ఫులుముడు వాదం వలన ఎంతోమంది స్త్రీలు ప్రపంచ వ్యాప్తంగా చచ్చిపోతున్నారు.

సైన్స్ ను, ఆధునిక శాస్త్రీయ వైద్యాన్ని మతాలు వ్యతిరేకిస్తున్నాయి. తమ ఉనికికి వాటివలన ముప్పు ఉన్నదని భయపడుతున్నాయి. పేదవారు నేడు చికిత్స ఫలితాలను, మందుల ప్రయోజనాన్ని తెలుసుకుంటున్నారు. క్రమేణా మంత్రగాళ్ళు, భూతవైద్యుల ప్రభావం పోతున్నది. వర్షాలు కురిపిస్తాయని ప్రార్ధనలు చేస్తే నమ్మేదశ దాటింది.

ప్లేగ్ వచ్చి జనం తుడిచిపెట్టుక పోతే, దేవుడి శాపంగా శిక్షగా నమ్మారు. నేడు ఆధునిక వైద్యం వచ్చి ప్లేగ్ నామరూపాలు లేకుండా చేసింది. స్కూళ్ళలో టెలిస్కోపులలో చూస్తున్న పిల్లలకు ఆకాశం గురించి తెలుస్తున్నది. కాకమ్మ కథలు నమ్మే స్థితిలో వారు లేరు. పురోహిత వర్గాల పట్టు సడలుతున్నది. అందుకే వారు సైన్స్ ను, వైద్యాన్ని అడ్డుకొంటున్నారు.

బైబిల్ కొత్త నిబంధనలలో అద్భుతాలన్నీ నయం చేయడానికి ప్రయోగించినవే. ఈ అద్భుతాలే క్రైస్తవానికి పట్టు అని సెయింట్ అగస్టిన్ అన్నారు. అమ్మ వారు (అమ్మతల్లి) వంటివి ఆధునిక వైద్యంతో రూపుమాపారు. టీకాలు వచ్చి, స్మాల్ పాక్స్ ను పోగొట్టింది. దేవుడి సృష్టిలో జోక్యం చేసుకున్నట్టు అవుతుంది గనక, టీకాల వైద్యాన్ని క్రైస్తవులు అమెరికాలో సైతం అడ్డుకోవడం విడ్డూరం.

పురుషుల మధ్య సెక్స్ సంభోగం అసహజమని క్రైస్తవ సంఘాలంటున్నవి. ఆ పురుషులు కూడా దైవసృష్టి కాదా. పక్షులు, జంతువులు, ఎన్నో సంకరజాతి సంపర్కం చేస్తాయి. అలాగే కొందరు పురుషులు చేస్తున్నారు. ప్రకృతి సహజత్వాన్ని వ్యాఖ్యానించే హక్కు పురోహిత వర్గాలకు లేదు. ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా కండోమ్స్ పనికొస్తాయి. పురుషాయతం అన్ని సమాజాలలోనూ వుంది.

ప్రార్ధన చేసిన వారికీ, చేయని వారికీ వ్యాధులు వస్తున్నాయి. కొన్ని రకాల కేన్సర్ కు నేడు టీకాల వైద్యం వచ్చింది. ఎయిడ్స్ వ్యాధి వ్యాపించకుండా వైరస్ ను కండోమ్స్ ఆపుతాయి. ఆఫ్రికాలో యివి వాడనందువలన ఎందరు చనిపోతున్నారో, లెక్క లేదు. అయినా వాడొద్దని మత పురోహితులు అమానుషంగా వదంతులు వ్యాపింపచేస్తున్నారు.

ఆఫ్రికా దేశాలలో అమ్మాయిలకు సుంతీ చేస్తున్నారు. ఇది మతాచారంగా పాటిస్తున్నారు. దీనివలన చాలా బాధకు గురికావడం, కొందరు చనిపోవడం జరుగుతున్నది.

అన్ని మతాలు పిల్లల్ని బాగా వాడుకుంటున్నాయి. పిల్లలుగా వుండగానే, వదలకుండా మత బోధ చేసి మూఢనమ్మకాలు నూరి పోస్తున్నారు. పిల్లలకు సుంతీచేయడం మతాచారంగా జరుపుతున్నారు. అదే పెద్ద వాళ్ళకు చేసి చూపితే., అందులో బాధ ఏమిటో తెలిసివస్తుంది.

ప్రతి మతం సెక్స్ ను శాసిస్తున్నది. లేనిపోని నియమాలు పెడుతున్నది. సెక్స్ ను గురించి శాస్త్రీయంగా తెలియకపోయినా సరే, పవిత్ర గ్రంథాల పేరిట అలా చేస్తున్నారు. కొరాన్ నిండా సెక్స్ ఆంక్షలు కనిపిస్తాయి. కాని, చనిపోయిన తరువాత స్వర్గంలో కన్యలతో అనుభవించడం పేర్కొన్నారు. అప్పుడు సెక్స్ పనికొస్తుందన్నమాట. ఉగ్రవాదులు. ఆత్మాహుతి దళం వారు యిలాంటి ప్రేరేపణలు నమ్మి, బలి అవుతున్నారు.

మతాలన్నిటినీ మానవులే సృష్టించారు. అందులోనూ పురుషా ధిక్యత వుంది. కనుక స్త్రీని జుగుప్సాకరంగా చిత్రించారు. పురుషుడి పక్క ఎముక నుండి స్త్రీ పుట్టిందని క్రైస్తవులు నమ్ముతారు. తమను స్త్రీలుగా పుట్టించనందుకు భగవంతుడిని యూదులు శ్లాఘిస్తారు.

చిన్న పిల్లల్ని తీసుకెళ్ళి సన్యాసులుగా, ఫాదరీలుగా తయారు చేసి స్త్రీ ద్వేషం పెంచుతున్నారు. జనాభాలో సగం మంది పై యిలాంటి ధోరణి దారుణమైంది.

ప్రపంచం అంతమౌతుందని మతాలన్నీ యీ విషయంలో తేదీలు కూడా నిర్ధారించి చెప్పాయి. ఆ తేదీకి ఏమీ జరగనప్పుడు వారేమీ బాధ్యత వహించరు.

జెరూసలేం నగరంలో ఒక సుప్రసిద్ధ పిచ్చాసుపత్రి వుంది. ప్రపంచం అంతమౌతుందని నమ్మేవారు అక్కడ వున్నారు. వారు ఇతరులకు హాని చేస్తారు. అందువలన తప్పనిసరిగా ఆస్పత్రిలో అట్టిపెడుతున్నారు. దేవుడు స్వయంగా తమతో చెప్పాడనీ, ప్రపంచం అంతం అవబోతున్నదనీ వీరి గట్టి నమ్మకం. మతం వలననే వీరీస్థితికి దిగజారారు.

ఆధునిక సైన్స్ ప్రకృతి పొరలు విప్పుతూ, విజ్ఞానాన్ని వెదజల్లుతున్నది. సూర్యుడు, గ్రహాల గురించి ఎన్నో సత్యాలు కనుగొన్నది. నక్షత్రమండలం గురించి నిరంతర అధ్యయనం చేస్తున్నది.

ఏమత ప్రవక్త కూడా యీ విషయాలు ఏ ఒక్కటీ చెప్పలేదు.

సైన్స్ ను ఖండించే మతాలు, మరో వైపున సైన్స్ సాధించి నటువంటివి అనుభవిస్తున్నాయి. సైన్స్ సాధించిన వాటిని దుర్వినియోగం కూడా చేస్తున్నాయి.

ఉప్పెనలు, సునామీలు, భూకంపాలు సంభవించినప్పుడు. మతస్తులు ముందుకొచ్చి, ***చూచారా మేం చెప్పినట్లు వినకపోతే అలాగే జరుగు తుంద***న్నారు.

అమెరికాలో మసాచుసెట్స్ రాష్ట్ర శాసనసభ జరుగుతుండగా ఒకరోజు హఠాత్తుగా ఆకాశమంతా నల్లబడి బాగా అంధకారమనిపించింది. ఇంకేముంది చావబోతున్నామని బెంబేలెత్తిన శాసన సభ్యులు సభను వాయిదా వేయమన్నారు. అప్పుడు స్పీకర్ ***తుదిరోజు వస్తే మీరు చేయగలిగిందేమీ లేదు. రాలేదనుకోండి. మీరు బాగానే వుంటారు. కనుక కొవ్వొత్తులు వెలిగించండి. సభ కొనసాగిద్దాం*** అన్నాడు. మూఢ నమ్మకాలు ముసురుకున్న రోజులలో స్పీకర్ వివేచనతో ఆలోచించాడు. అతడే సరైన వాడనిపించాడు

-----

## అధ్యాయం – 5

# మతతత్వంలో నిలిచేది ఏదీ లేదు

హేతువుకు ఎదురు నిలిచే మతం లేదు. అన్ని వేళల్లో అజ్ఞానం, భయం మధ్యేగడిపింది. థామస్ అక్వినాస్ వంటి క్రైస్తవ పండితుడు మిడి మిడి జ్ఞానంతో జ్యోతిష్యాన్ని నమ్మాడు. వ్యక్తి రేతస్సులో జీవముందన్నాడు. సెక్స్ పై మతాలు చెప్పేవన్నీ అర్థంపర్థం లేనివే. సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నట్లు అగస్టిన్ నమ్మాడు. క్రైస్తవ మతం చిన్నప్పుడే పుచ్చుకొని పిల్లల ఆత్మలు త్రిశంకులో వేలాడుతున్నాయన్నాడు. కేథలిక్ తల్లిదండ్రులు యీ భావనతో తమ పిల్లల గురించి సతమత మయ్యారు. దయ్యాలంటే మార్టిన్ లూథర్ కు తగని భయం ఉండేది. మానసికంగా బాగాలేక పోవడం దయ్యపు పనే అని చెప్పాడు. ఎడారిలో సైతానులుంటారని మహమ్మద్ భావించాడు.

ప్రాచీన కాలం నుండీ మతం వచ్చింది. ఆతరువాతగాని డెమోక్రటిస్ వచ్చి పదార్థమంతా అణువుల సముదాయం అని చెప్పాడు. పిల్లతనపు ఆలోచనల వలన పూర్వీకులు చాలా విషయాలు గ్రహించలేదు. మామూలుగా చదువుకున్న పిల్లలు సైతం, మత స్థాపకులుగా చదువుకున్న వారికంటే ఎక్కువ జ్ఞానంతో వుంటున్నారు.

సైన్స్ ను విశ్వాసాన్ని పొందికగా కూర్చుదామనే ప్రయత్నాలన్నీ దారుణంగా విఫలమయ్యాయి. కొందరు క్రైస్తవులు తమ విశాల దృక్పథం ప్రదర్శించడానికి సైంటిస్టులను ఆహ్వానించక పోలేదు. ఆనాడు వాతావరణం, చీకటి, ప్లేగు వ్యాధి, గ్రహణం వంటివి లేకుంటే మతం ఉండేది కాదు. మతం పేరిట గుడికట్టడానికి దారుణంగా జనం దగ్గర డబ్బు వసూలు చేశారు.

కొందరు సైంటిస్టులు మత వాసనలతో లేకపోలేదు. సర్ ఐజాక్ న్యూటన్ కొన్ని విషయాలలో ఆధ్యాత్మిక వాది, బంగారం చేసే పనులు తలపెట్టాడు. విశ్వంలో ఒక పథకం ఉందని ఫ్రెడ్ హొయిల్ నమ్మాడు. అతడే బిగ్ బాంగ్ అనే మాటల్ని ప్రచారంలో పెట్టాడు. అది నేడు అపఖ్యాతి పాలయింది.

స్టీవెన్ హాకింగ్ నమ్మకాలున్న సైంటిస్ట్ కాదు. పోప్ జాన్ రెండవ పాల్ అతడిని వాటికన్ ఆహ్వానించాడు. గెలీలియోను శిక్షించిన రికార్డులు చూపమని అడిగాడు. దేవుడి మనస్తత్వం తెలుసుకునే సైన్స్ గురించి హాకిన్స్ మాట్లాడాడు. మాటవరసకి దేవుడికి తెలుసు అంటామే, హాకింగ్స్ దేవుడి ప్రస్తావన కూడా అలాంటిదే.

ఛార్లెస్ డార్విన్, ఐన్ స్టీన్ విశ్వం గురించి విప్లవాత్మక విషయాలు బయట పెట్టకముందు చాలామంది సైంటిస్ట్ లు ప్రకృతిలో దైవాన్ని చూశారు. మానవుడి విషయాలలో దేవుడి పాత్ర వుందనుకున్నారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్, థామస్ జఫర్సన్ వంటివారు సంక్షోభాలను ఎదుర్కనడానికి వికాసం విప్పార జేయడానికి దైవ భావాన్ని అడ్డం పెట్టుకున్నారు.

చిన్నప్పుడు పిల్లతనంగా ఆలోచిస్తాం. పెరిగే కొద్దీ అవన్నీ మారిపోతా యన్నాడు సెయింట్ పాల్. అలాగే ప్రకృతి గురించి కూడా పూర్వీకుల నుండి మన ఆలోచనలు పరిణమించాయి. ఫ్రెంచి సైంటిస్ట్ లాప్లా (1749-1827) గొప్ప మేధావి. న్యూటన్ వదిలేసిన దశనుండీ అతడు ఎంతో ముందుకు సాగాడు. సూర్యమండలం ఎలా పనిచేస్తుంది, నక్షత్రాలు, పాలపుంత గురించీ రాసాడు. 5 సంపుటాలు ప్రచురించాడు. ఫ్రెంచి చక్రవర్తి అది తెలిసి, లాప్లాను కబురు పెట్టి రప్పించాడు. తన గణితంలో దేవుడి ప్రస్తావన లేదేమిటి అని అడిగితే, అవసరం లేక పోయిందని లాప్లా సైంటిస్టు అన్నాడు.

మరోవైపు తత్వవేత్త నీషే వచ్చి దేవుడు అస్తమించాడన్నాడు. దేవుడిని గురించి పురోహితుడికి ఎంత తెలుసో నీషేకూ అంతే తెలుసు. కాని ఆనాటికే దైవారాధన క్షీణిస్తూ వచ్చింది. మతాల పరిణామం సోక్రటీస్ కాలం నుండీ గమనిస్తే, బలంగా ఉన్న మతాలు ఎంత పాశవికంగా ప్రవర్తించాయో చరిత్ర చెబుతుంది. ఒక దానికి మరొకటి పోటీపడి, మానవులకు ఉపశమనం కల్పిస్తామని, శాంతి సమకూరుస్తామని ముందుకొచ్చాయి. పురోహిత వర్గం బలంగా ఉన్నచోట యీ కర్కోటక ప్రవర్తన స్పష్టం. విద్యపై పట్టు సాధించాలని మతం ప్రయత్నిస్తున్నది. పన్నుల నుండి మినహాయింపులు తెచ్చుకుంటున్నది. తమ ప్రవక్తల్ని అవమానించకుండా, దేవుళ్ళ జోలికి పోకుండా చట్టాల ఉచ్చు బిగిసేటట్టు చేస్తున్నది.

క్రైస్తవుల మూర్తి త్రయం, ముస్లింల హదీత్, దైవదూత రాక విషయంలో వాదనలు, చిత్రహింసలు ఎన్ని జరిగినా, మరోపక్క తర్కం, గతి తార్కికత పెంపొందుతూ వచ్చాయి. అరిస్టాటిల్ రచనలు చెదురుమదురుగా లభించగా, పీటర్ ఎబలార్డ్ యథాశక్తి కృషి సాగించాడు. ఆనాడు ఏమి ఆలోచించారని గాక, ఎలా ఆలోచించారనేదాని నుండి నేర్చుకోవాలి.

మధ్యకాలాల్లో తలెత్తిన తాత్వికుడు విలియం ఒకం పేర్కొనదగిన వాదనలు పెంపొందించాడు. 1324లో మత శక్తులతో తలపడ్డాడు. పోప్ దాడినుండి అతడు రక్షణ కోరవలసి వచ్చింది. పోప్ సైతం దారితప్పాడని ఒకం విమర్శించాడు. అతడి సాహసోపేత ఆలోచనను క్రైస్తవ సమాజం అభినందించింది. ఆకాశంలో నక్షత్రాలపట్ల అతడు ఆసక్తి కనబరిచాడు. ఖగోళ శాస్త్రజ్ఞులు ఎలాంటి నమ్మకాలైనా పుంజుకోవచ్చు. అవి వ్యక్తిగతమైనవి. కానీ ఆలోచనలో పొదుపు అవసరం అని ఒకం నొక్కి చెప్పాడు. అనవసర ప్రతిపాదనలు తొలగించాలన్నాడు. తర్కం ఎక్కడకు తీసుకు వెడితే అక్కడకు సాగిపోయాడు. దేవుడు యీ విశ్వానికి తొలి కారణం అనుకుంటే, ఆకారణానికి మూలం ఏది అనే ప్రశ్న కూడా వస్తుందన్నాడు. దేవుడు పథకం ప్రకారం విశ్వం సృష్టిస్తే, పథకానికి మూలం ఏది అనే ప్రశ్న కూడా సహజమే అన్నాడు. దేవుడి ఉనికిని కేవలం విశ్వాసంతోనే తప్ప, మరోవిధంగా రుజువు చేయలేనన్నాడు. మతం ఋజువుకు నిలబడజాలక, పేలవమైన కారణాలు, పథకాలు చూపుతుంది. శిక్షలు విధిస్తుంది. అదీ సంగతి.

---

## అధ్యాయం – 6

# ప్రకృతి వెనక ఏ పథకం ఉందో!

మద్రాసు సముద్ర తీరంలో వచ్చిన సునామీ ఫలితంగా కొందరు బాధితులకు పునరావాసం అవసరమైంది. వారికి సహాయపడే నిమిత్తం నేను శ్రీలంకలో వసూళ్ళకు బయలు దేరాను. నాతోపాటుగా పుట్టపర్తి సాయిబాబా భక్తులు కొందరున్నారు. వారు బయలుదేరే ముందు కొబ్బరికాయ కొట్టి ప్రయాణం సుఖప్రదంగా జరగాలని మొక్కుకున్నారు. సాయిబాబా భక్తులకు ఆయనపట్ల బాగా విశ్వాసం వుంది. చనిపోయిన వారిని బ్రతికించాడని నమ్ముతారు. బాబా విభూది గాలిలో నుండి తెప్పించి పంచడం కూడా విశేషంగా చెబుతారు.

కాని భక్తులు మొక్కు చెల్లలేదు. ఒక గ్రామాన్ని సమీపిస్తుండగా దురుసుగా నడుపుతున్న మా డ్రైవర్ ఒక వ్యక్తిని గుద్దేశాడు. అతడికి తీవ్రగాయాలయ్యాయి. అది సింహళ గ్రామం. తమిళులంటే వారికి గిట్టదు. గుమికూడిన జనం ఆగ్రహావేశాలతో వున్నారు. నేను ఇంగ్లీషు వ్యక్తిని గావడం, లండన్ పోలీస్ యిచ్చిన ప్రెస్ పాస్ ఉండడంతో పరిస్థితి చేయిజారకుండా పోయింది. మమ్మల్ని వదిలేశారు. నేను మాట్లాడలేదు. నాతోటి వారికి నచ్చింది. సాయిబాబా ఆశ్రమానికి ఫోను చేసి బాబా స్వయంగా నా అవతారంలా వచ్చి కాపాడాడన్నారు. అప్పటినుండీ పర్యటనలో నాకు గౌరవం పెరిగింది. కాని దెబ్బతగిలిన వ్యక్తి ఆస్పత్రిలో చనిపోయాడు.

మంచి ఉపయోగం జరిగితే దైవానుగ్రహం అంటారు. చనిపోతే దేవుడే తీసుకెళ్ళా డంటారు. ఇలా ఎటుబడితే అటు అనుకూలంగా మలచుకోవడం మతాలకు ఎత్తుగడగా ఉంది.

ఏకేశ్వరారాధన మతాలన్నీ మానవుడిని కించపరిచాయి. మానవుడు పాపాత్ముడన్నాయి కనుక ఆగ్రహావేశపరుడై దైవానికి మోకరిల్లి, భక్తితో వేడుకోవాలన్నాయి.

ఇంకో కోణం కూడా ఉంది. మనిషిని బాగా స్వార్థ పరుడుగా మతాలు మలుస్తున్నాయి. సృష్టి అంతా మనిషి కోసమే వున్నట్లు కనుక వినయంతో ప్రార్థిస్తే దైవం కటాక్షిస్తాడని బోధించారు. ఈ నమ్మకం చుట్టూ మూఢ నమ్మకాలు అల్లుకపోయాయి.

సృష్టి అంతా ఒక పథకంతో వున్నదని అందులో సూక్ష్మరూపం, స్థూలదశ ఉన్నదని నమ్మారు.

విలియం పాలే (1743-1805) ఈ సృష్టి పథకం తన రచనల్లో చిత్రించాడు. ప్రాచీన మానవుడికి గడియారం తటస్థపడిందనుకోండి. అదొక ప్రయోజనాన్ని ఉద్దేశించి తయారు చేశారనుకుంటాడు. అదే ప్రయోజనం ప్రకృతిలోనూ, మానవుడిలోనూ వుందన్నాడు. ఈ పథకం ఎందుకు వేశాడో అనేది పాలే వివరించలేదు. కాని కన్ను పరిణమించలేదని, సృష్టి అయిందనీ ఉదాహరణగా చూపాడు. ప్రకృతిలో వేడి పెరిగిపోవడం, కొన్ని చోట్ల సూర్యమండలంలో పొందిక లోపించడం సర్ ఐజాక్ న్యూటన్ గమనించాడు. దీనికి సంజాయిషీగా దేవుడు అప్పుడప్పుడూ జోక్యం చేసుకొని సరిదిద్దుతాడన్నారు. కాని సృష్టి చేసినప్పుడే ఎందుకు సరిగా చేయలేదని లైబ్నిజ్ తాత్వికుడు ఎగతాళి చేశాడు. మనం చూస్తున్న జీవితం ప్రకృతిలో చాలా మండలాలలో కనిపించదు. భూమి మీద సైతం విపరీత వేడి, విపరీత చలి జీవాలకు అనుకూలంగా వుండడంలేదు. ఇదంతా దైవ పథకమేనా.

ఇక సూక్ష్మలోకానికి వస్తే మనకు తెలిసిన వాటికంటే తెలియాల్సినవి ఎన్నో ఉన్నాయి. వాటిని పరిశోధించి, క్రమంగా గ్రహిస్తూ పోవడమే మన పని. డార్విన్, ఐన్ స్టీన్ చెప్పిన అంశాల నుండి భవిష్యత్తులో ఇంకెంతో ముందుకు పోతాం. అదే సైన్స్ కృషి. ఓపికగా నిరంతర శ్రమ, పరిశోధనతో జ్ఞానం విస్ఫారుతుంది. ఈలోగా మనం ముందుగా మూఢ నమ్మకాలు పటాపంచలు చేయాలి కూడా. త్రవ్వకాలలో బయట పడిన ఎముకల్ని చూసి, సైన్స్ పరిశోధిస్తుండగా, మన నమ్మకాన్ని పరీక్షించడానికి, దేవుడు వాటిని అలా పెట్టాడని భక్తులన్నారు. ఇలాంటి వాదనలు రుజువు చేయడానికి, చేయక పోవడానికి ఏ ప్రాతిపదికాలేదు.

ఇక కన్ను విషయం గమనిస్తే, అది పరిణమించలేదనీ, అదే అద్భుతమని వాదించేవారున్నారు. ఇలాంటి వాదన వచ్చిన తరువాత, ఎంతో పరిశోధన సాగింది. కన్ను దశలవారీగా ఎలా పరిణమించిందో వివరంగా నిర్దుష్టంగా కనుగొన్నారు. అందులో దైవ పథకం ఏదీ లేదు.

డి.ఎన్.ఎ. పరీక్షలవలన అతి సూక్ష్మ జీవుల నుండి క్రమంగా మనం పరిణమించాం. బాగా అభివృద్ధి జరిగిన పరిణామ జీవులు సైతం అతి స్వల్ప స్థాయినుండి క్రమేణా పరిణమిస్తూ వచ్చాయి అని తెలిసింది.  ఇదే డార్విన్ కనుగొని నిర్ధారించాడు.

మనుషులు ఎంతో పరిణతి చెందిన జీవులనుకుంటాం. కాని కంటి విషయంలో మనకంటె చురుకైన పరిణామం ఆస్ప్రేలలో వుంది. నీటిలో వేగంగా పోతున్న చేపల్ని దూరం నుండే చూచి పట్టేయగల చూపు వాటికి ఉన్నది. వాటిని మానవులే చంపేశారు.

కన్ను గురించి చార్లస్ డార్విన్ ప్రస్తావించిన అనంతరం అదొక ప్రత్యేక శాఖగా అధ్యయనం చేశారు. ఇంచుమించు 40 విభిన్న కళ్లు పరిణమించినట్లు తెలుసుకున్నారు. చేపలలో కళ్ళు పరిణామం డా. డేనియల్ నికల్సన్ కనుగొన్నారు. కొన్ని చేపలు నీటినుండి బయటకు చూస్తుంటే మరికొన్ని నీటికిందకు చూడగలుగుతున్నాయి. పరిణామ దశల్ని ఇలా శాస్త్రీయంగా కనుగొంటూ నిరంతరంగా సాగిపోతున్నాం.

ఇంతా జరిగిన తరువాత పరిణామం కేవలం సిద్ధాంతం అని కొత్తవాదన లేవనెత్తారు. కానీ సిద్ధాంతం కూడా పరిణమించినదని విస్మరించారు. కనుగొన్న వాస్తవాల్ని ఒక చట్రంలో పెట్టిన తీరు అది. ఇంతకు ముందు తెలియని వాస్తవాలను ఒక సిద్ధాంత క్రమంలో పెడితే, జయప్రదమైన సిద్ధాంతం అని అంటాం. అంచనాలు ఋజువుకు నిలబడితే నిర్దిష్ట సిద్ధాంతం అవుతుంది. ఇది పూర్తి గావించడానికి సమయం పడుతుంది. ఈలోగా అనవసర విషయాలను తొలగించు కుంటూ సిద్ధాంతీకరిస్తాం. అదే ఒకం సిద్ధాంతకర్త చెప్పినది. భూమిబల్లపరుపుగా ఉందని నమ్మిన ప్రాచీన ఈజిప్షువారు కూడా గ్రహణాలు అంచనా వేశారు. కాకుంటే చాలా అనవసర విషయాలు చెప్పినందున, వారికి సమయం పట్టింది. సాపేక్ష సిద్ధాంతం ఋజువుకు నిలబడింది. గురుత్వాకర్షణ వలన నిలువుగా ప్రసరించే కిరణాలు ఒంగుతాయని చెప్పాడు. 1913లో ఆఫ్రికాలో యీ సంఘటన పరిశీలించి, సరైనదని నిర్ధారించాడు.

పరిణామంలో క్లిష్టదశలు జరిగిన తీరుపై పరిణామ వాదుల మధ్య భేదాభిప్రాయాలు లేకపోలేదు. భూమిపై జీవోత్పత్తికి కారణం, దగ్గరగా దూసుకుపోయిన తోకచుక్క అని సైంటిస్టు ఫ్రాన్సిస్ క్రిక్ భావించాడు. అయితే వీరి మధ్య అభిప్రాయభేదాలు పరిశోధనా పద్ధతులు, శాస్త్రీయ రీతులతోనే పరిష్కరిస్తారు.

ఇందుకు భిన్నంగా సృష్టి వాదనలో ఎలాంటి సిద్ధాంతమూ లేదు. డబ్బులిచ్చి కొన్ని మత సంస్థలు దీని ప్రచారం చేస్తున్నాయి. ఇందులో పథకం అనేది ప్రకృతిలో ఎలా పనిచేస్తుందో వారెవరూ కనుగొనలేకపోయారు.

అవును, కాదు అని మాత్రమే చెప్పమని, సృష్టివాదులు కొన్ని ప్రశ్నలేశారు. కట్టే వాడు లేకుండా భవనం వస్తుందా. చిత్రకారుడు లేకుండా చిత్రం వస్తుందా. ఎవరూ తయారు చేయకుండా కారు వస్తుందా. అవును అంటే, వివరాలు చెప్పండన్నారు.

వీటన్నిటికీ సమాధానం మనకు తెలుసు. ఎవరో కృషి చేసిన ఫలితంగా అవి రూపు ధరించాయి. సృష్టివాదులు పరిణామాన్ని సుడిగాలితో పోల్చారు. పెరట్లో చిందరవందరగా పడిన సామాన్లు కొట్టుకొచ్చి, జంబో జెట్ గా మారిందన్నారు. ప్రకృతిలో ఆవిధంగా కూడగట్టడానికి విడి భాగాలు ఎక్కడా లేవు. విడిభాగాలను జతచేసి ఒక వస్తువుగా తయారు చేయడానికి చాలా కాలం పడుతుంది. సరిగా పనిచేయని విమానాల నుండి జంబోజెట్స్ పరిణమించలేదు. దీనంతటికి తెలివిగల పథకం అని పేరు పెట్టడం అవివేకం. ఇందులో మాటల గారడీ తప్ప, తెలివిగానీ, పథకం గానీ లేదు.

మానవులు క్రమేణా విమానాలను మెరుగు పరుస్తూ వచ్చారు. అలాగే మానవులు సైతం మారుతున్నారు. సంక్లిష్టమైన విధానాలున్నాయనీ, వాటిని ఏమీ చేయలేమనీ సృష్టివాదులనడం ఒక పెద్ద జోక్. ప్రొటీన్ కణాలు పడుతూ లేస్తూ వస్తున్నాయన్నారు. ఇంకా భూమిపై జీవం రాకముందు, ఎముకల పరిణామం జరగకపూర్వం, 450 మిలియన్ సంవత్సరాల క్రితం జన్యువులు సాగాయి. మత స్థాపకులకు ప్రకృతి విషయాలు ఏమంతగా తెలియవు. మనల్ని ఎవరు రూపొందించారనేది ఎంత అవివేకమైన ప్రశ్నో, పథకం వేసిన వారిని ఎవరు రూపొందించారనేదీ అంతే. తర్కం ప్రకారం 47 నుండి 55 వరకూ దేవుళ్ళు అవసరమవుతారని అరిస్టోటిల్ అన్నాడు. అందుకే ఒకం తర్కాన్నిబట్టి అనవసర ప్రతిపాదనలు తొలగించుకోవాలి.

మతవాదులు ఒక దేవత నుండి బహు దేవతల వరకూ

వచ్చారు. వాస్తవానికి దగ్గరలోకి వచ్చారు. సున్న చుడితే నిజం చెప్పినట్లు.

పరిణామక్రమంలో క్రూరత్వం, నిర్దయ, అడ్డదిడ్డంగా వున్నాయి. మానవుల దృష్ట్యా చూస్తే అలా అనిపిస్తుంది. పరిణామంలో జనించిన 98 శాతం అంతరించి ఉంటాయి. జీవం ఆవిర్భవించే ఉప్పెనలు వచ్చాయి. అలాగే అస్తమించడం కూడా కద్దు.

మానవుల్ని గమనించండి. జీవోత్పత్తికి పనికివచ్చేదే తప్ప. అండాలు ఎన్నో వృధా అవుతున్నాయి. అలాగే ఎన్నో కీటకాలు, చేపలు ఒకవైపు అంతరిస్తుండగా, మరోపక్క మనుగడ సాగిస్తున్న జీవజాలం వుంది.

ప్రాచీనకాలం నుండీ ఎన్నో మతాలు పుట్టి గిట్టాయి. ప్రపంచం అంతం కాబోతున్నదంటూ ఏటా క్రైస్తవ ఛాందసులు టర్కీలోని అరారత్ పర్వతానికి యాత్ర చేస్తూనే వున్నారు.

అమెరికా వచ్చిన కేథలిక్కులు 16వ శతాబ్దిలో విచక్షణా రహితంగా క్రూరంగా స్థానిక ఇండియన్ అమెరికన్లను హతమార్చారు. ఇండియన్ అమెరికన్లు ప్రశాంతంగా, ఒకరి జోలికి పోకుండా బ్రతుకుతున్నారు. అలాంటి వారిని చంపినందుకు, బారలోమియా అనే క్రైస్తవ నాయకుడు పశ్చాత్తాపం వెల్లడించాడు.

మాయన్ సంస్కృతిలో **సున్న** (0) భావన వుండేది. అలాంటిదే సంస్కృతంలోనూ, అరబ్బీలలోనూ వుండేది. అది లేకుంటే గణిత అధ్యయనం చాలా కష్టమయ్యేది. అయినా మధ్య కాలాల్లో క్రైస్తవులు **సున్న** (0) భావన తమది కాదనీ, పరాయిదనీ నిరాకరించారు.

అమెజాన్ నదీ పరీవాహకం చుట్టూ నాగరికతలు విలసిల్లినట్లు యిటీవలి వరకూ తెలియదు. ప్రపంచంలో ఒకవైపు మోసెస్, అబ్రహాం, మహమ్మద్, బుద్ధులను ఆరాధిస్తే, వారికి భిన్నంగా విలసిల్లిన నాగరికతల్ని విస్మరించారు. ఆ నాగరికతలకూ వారిసృష్టి వాదనలు, దైవం చెప్పిన సంగతులు లేకపోలేదు. అలాంటివారున్నారనే తెలియకనే గతించారు. మానవ చరిత్రలో నిర్లక్ష్య గమనం అలా సాగింది.

పరిణామంలో పూర్వం ఎందరో మనుషులు సూక్ష్మజీవుల వలన అంతమొందారు. అవి ఎక్కడ నుండి ఎలా వచ్చాయనేది మరో విషయం.

దైవ వాక్యంగా పేర్కొన్న బైబిల్ లో జనిసిస్ చూస్తే, డైనోసార్ (సరీసృపాలు) మొదలుకొని ఎన్నో జంతువులు, క్రిమి కీటకాలు, సూక్ష్మ జీవులు, ఆస్ట్రేలియాలోని మార్సుపియల్స్ ప్రస్తావనే లేదు. అవి ఉన్న జ్ఞానమే వారికి లేదు.

ప్రకృతిలోని మానవుల స్థానం గమనిస్తే అనల్పమైనది. రోగాల్ని ఎదుర్కోవటానికి, బ్రతుకు సాగించడానికి ఎంతో పెనుగులాట తప్పడం లేదు. బ్రిటిష్ కొలంబియా సరిహద్దులలో బయటపడిన సుద్ద, 570 మిలియన్ ఏళ్ళ క్రితంనాటిదని తెలిసింది. వీటినుండి బయటపడి, కొనసాగుతున్న వాటి గురించి 1907 వరకూ మనకు తెలియదు. పరిణామ క్రమం పటం గీసి చూపుతుంటాం. అందులో చేపతో మొదలెట్టి మానవుడి వరకూ చూసి, ఉన్నత స్థానంలో మనల్ని అట్టి పెడుతాం. ఇది మన స్వార్థ దృష్టి వలనే తప్ప మరొకటి కాదు. పరిణామంలో చెట్టుకొమ్మల్ని పోల్చి చూపితే, భిన్న దశలో ఆకొమ్మలు కనిపిస్తాయి. స్టీవెన్ జె గెల్డ్ యీ విషయాలను కుణ్ణంగా అధ్యయనం చేసి, వెలికి తెచ్చాడు.

డార్విన్ కనుగొన్న పరిణామ దశల్ని నిర్ధారించడంలో పీటర్, రోజ్ మేరీ గ్రాంట్ అనేవారు చాలా కృషి చేశారు. ప్రిన్స్ టన్ యూనివర్సిటీ నుండి, డార్విన్ వెళ్లిన గెలపాగో దీవులకు వెళ్లి, 30 ఏళ్లు పరిశోధించారు. డార్విన్ సిద్ధాంతం శాస్త్రీయంగా నిలుస్తుందని కనుగొన్నారు.

మానవ పరిణామం 50 వేల ఏళ్ళ క్రితం పూర్తయిందని కొందరు భావిస్తారు. షికాగో యూనివర్సిటీలో జరిగిన పరిశోధనబట్టి, పరిణామం జరుగుతున్నదని, ఆగలేదని తెలిసింది. రెండు జీన్స్ పై జరిపిన పరిశీలన వలన ఒకప్పుడు మానవ మెదడు నేటి కంటే చాలా చిన్నదైనట్లు తెలుసుకున్నారు. మైక్రో సెఫాలిక్, ఎవస్ పితం అనే రెండు జీన్సును పనిచేయకుండా ఆపితే, మైక్రో సెఫలిక్ కు దారితీస్తుందన్నారు. ఈ రెండు జీన్స్ పరిణమిస్తున్నాయి. మానవ జనోంలో కొన్ని రూపు రేఖలు మార్చుకుంటున్నాయి. ప్రగతి అంతా పైపైకి దారితీస్తుందనలేం. కాని మార్పులు జరుగుతూనే ఉన్నాయి.

ఈ క్రమంలో దైవ జోక్యం ఎక్కడా లేదు. అది అనూహ్యం కూడా. దేవుడు లేకుంటే, సృష్టిద్దాం అన్నాడు ఫ్రెంచి తాత్వికుడు ఒల్టేర్. నేనదీ ఒప్పుకోను. మానవుడు సృష్టించిన భగవంతుడి వలననే సమస్యలు వచ్చాయి. జీసస్ క్రీస్తు కన్య మేరీకి పుట్టాడనడం అలాంటి సమస్యలలో ఒకటి.

సందేహవాదం, పరిశోధనల వలన మనుషులకు విమోచన లభిస్తున్నది. నేడు దేవుడి అవసరం లేదు. విశ్వాసం గలవారు వ్యక్తిగతంగా అట్టి పెట్టుకొని, ఇతరుల పై రుద్దకుండా వుంటే మంచిది. మతాన్ని బలవంతంగా ఇతరులపై రుద్దనంత వరకూ ఇబ్బంది లేదు.

-----

## అధ్యాయం – 7

# బైబిల్ ఘోరాలు వినుడీ!

బైబిల్ మొదటి భాగాన్ని పూర్వ నిబంధన అంటారు. రెండో భాగం కొత్త నిబంధన. హిబ్రూ, గ్రీక్, లాటిన్ భాషల నుండి ఇంగ్లీషులోకి అనువదించారు. ఆరమిక్ భాషలో తొలుత బైబిల్ రాశారు. జేమ్స్ రాజు ఇంగ్లండ్ లో కొందరు పండితులను నియోగించి చక్కగా అనువదింపజేశారు. అది నేడు బహుళ ప్రచారంలో వున్నది.

పూర్వనిబంధన బైబిల్ మాత్రమే పవిత్రమని యూదు జాతి స్వీకరిస్తున్నది.

దేవుడు కొండపై మోసెస్కు దివ్యవాణిగా పాత బైబిల్ వెల్లడించినట్లు నమ్ముతారు. అప్పుడు పది ఆజ్ఞలు అందించాడు. ఇదంతా సినాయ్ కొండపై జరిగిందని చెప్పారు.

చదువురాని వ్యక్తికి ఏకాకిగ ఒకచోట దేవుడు యీ విషయాలు మధ్య ప్రాచ్యంలో వెల్లడించాడు. లోగడ విగ్రహారాధనలు చేస్తూ, మూఢ నమ్మకాలతో ఉన్న ప్రజలకు, దేవుడు ఒక్కడేనని, మరెవరినీ ఆరాధించరాదనీ ఆజ్ఞాపించాడు.

ఇదంతా నిజం అని ఎలా నమ్మడం? అంటే దివ్యవాణి మోసెస్ కు వెల్లడించడమే సాక్ష్యాధారం అన్నారు. దేవుడే అతడిని ఎంపిక చేసి అతడి ద్వారా చెప్పాడన్నారు. అవన్నీ తిరుగులేని నియమాలన్నారు.

అయితే పెద్ద చిక్కే వచ్చిపడింది. దేవుడు కనిపించి తనకు చెప్పాడనేవారు భిన్న ప్రాంతాలలో తలెత్తారు. ఇందులో పరస్పర విరుద్ధ విషయాలున్నాయి. ఎవరికి వారే తమదే సిసలైన దివ్యవాణి అన్నారు. ఒకతను తనకు చెప్పిందే చివరి సత్యం అనీ, ఇక వేరే ప్రవక్తలకు, విభిన్న సత్యాలకు తావు లేదన్నాడు.

అన్నీ నిజంగావడానికి వీల్లేదు. పైగా వీరి దివ్యవాణి సత్యాలలో చాలా విరుద్ధ తేడాలున్నాయి. కనుక భ్రమపూరితాలుగా ఉన్నాయి. ఏదో ఒకటి నిజమైతే, మిగిలినవి అబద్ధమై ఉండాలి. ఎవరికి వారే తమదే సిసలైన విషయమనీ, మిగిలిన వారిది అసత్యమనీ అన్నారు. అందుకే మత యుద్ధాలకు దారి తీసింది.

శాస్త్రీయ పరిశీలనకు పెడితే యీ దివ్యవాణి, కథనాలన్నీ పటాపంచ లౌతున్నాయి.

ఒకే దేవుడున్నాడనే మూడు ముఖ్య శాఖలు కూడా మోసెస్ పరంరను అంగీకరిస్తున్నాయి. యూదులు తామే దైవం ఎంపిక చేసిన జాతిగా ప్రకటించుకున్నారు. కొరాన్ యీ సంగతి కూడా ప్రస్తావించింది. జీసస్ కూడా ప్రవక్త అనీ కన్యగా ఉన్న మేరీకి పుట్టాడని రాసింది. జీసెస్ ను చంపినందుకు యూదుల్ని కొరాన్ తప్పు పట్టలేదు. అయితే జీసస్ బదులు మరెవరినో యూదులు సిలువపై కొట్టారనడం వలన తప్పు పట్టలేదేమో.

దేవుడిచ్చిన పది ఆజ్ఞలలో మొదటి మూడు, తానొక్కడినే దేవుడననీ, మరెవరినీ ఆరాధించగూడదనీ, తనపేరు వృధా చేయరాదనీ చెబుతున్నాయి. ఆజ్ఞలు దాటితే, తండ్రులు చేసిన పాపాలు పిల్లలకూ వారసత్వంగా సంక్రమిస్తాయన్నారు. తల్లిదండ్రులు చేసిన నేరాలు అమాయక పిల్లలకు అంటగట్టడం దారుణం.

పవిత్ర పండగ సెలవునాడు ఎలాంటి పనీ చేయరాదన్నారు. ఇది యింట్లో పని వారికి, బానిసలకు సైతం వర్తిస్తుందని నాలుగవ ఆజ్ఞ చెబుతుంది. దేవుడు ఆరు రోజులలో సృష్టి అంతా చేశాడు. ఏడవ రోజు విశ్రాంతి తీసుకున్నాడు. (8వ రోజు ఏం చేశాడో వూహించాల్సిందే.)

తరువాత ఆజ్ఞలో తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. దానివెంట చేయగూడని పనులు పేర్కొన్నారు. చంపరాదు, వ్యభిచరించరాదు. చౌర్యం చేయగూడదు. దొంగ సాక్ష్యం చెప్పవద్దు. పొరుగువాడి సంపదను ఆశించవద్దని మరో ఆజ్ఞ. అందులో స్త్రీ, పురుషసేవకుల్ని, ఎద్దు, గాడిద, పొరుగువారి భార్యను చేర్చారు.

మతాన్ని మానవుడే సృష్టించాడనడానికి యివన్నీ చక్కటి ఆధారాలు. దేవుడు సర్వశక్తివంతుడనీ, పగతీర్చుకుంటాడనీ బెదిరించడం ఎత్తుగడే. ఎప్పుడు పనిచేయాలి, సెలవు ఏనాడు తీసుకోవాలి అనేది కూడా యజమాని దృష్ట్యా చెప్పిన అంశమే. హిబ్రూ ప్రకారం చంపరాదనేది స్పష్టంగా ఉంది. మోసెస్ అనుచరులు అందాకా ఎప్పుడు ఆలోచించారో

తెలియదు. పది ఆజ్ఞలలో ప్రస్తావించిన నేరాల విషయమై ఏ సమాజంలోనైనా జాగ్రత్త తీసుకుంటూనే పోయారు. కాని భార్యను కూడా ఆస్తిలో చేర్చడమే విడ్డూరంగా వుంది.

పది ఆజ్ఞలు చెప్పని అంశాలు చూద్దాం. పిల్లల్ని క్రూరత్వానికి గురిచేయకుండా కాపాడాలని వారికి అనిపించలేదా? చెరచడం నేరంకాదా? బానిసత్వం తప్పు కాదా? సామూహిక హత్యలు ఘోరం కాదా? పైగా ఇలాంటి నేరాలను ప్రోత్సహించిన పాపం వీరిది. బానిసల్ని ఎలా కొనవచ్చు, ఎలా అమ్మవచ్చు అనేది మోసెస్ తన అనుచరులకు చెప్పాడు. దెబ్బకు దెబ్బ, పన్ను పీకితే మళ్ళీ పన్ను పీకడం, కంటిని పొడిస్తే తిరిగి కంటిని పొడవడం మోసెస్ బోధనలలో ఉన్నాయి.

దయ్యం పట్టిందనే పేరిట స్త్రీలను చిత్రహింస పెట్టడం, కాల్చి చంపడం నిత్యకృత్యంగా కొనసాగించాడు. మధ్యలో నీతి సూత్రాలు వల్లిస్తూ, గుంపులోబడి చెడుపనులు చేయడం తగదన్నాడు. దేవుడి బిడ్డలాగా ఇజ్రాయిల్ పిల్లల్ని చూపి వారిని నిర్దాక్షిణ్యంగా తరిమేసినట్లు పేర్కొన్నారు. పాలస్తీనా తమకు దైవం యిచ్చిన హక్కు అని ఇజ్రాయిలో వాసులు అంటారు. అదే నిరంతర యుద్ధాలకు దారితీసింది.

దేవుడిని ముఖాముఖి 74 మంది పెద్దలు చూచారట. ప్రజలు ఎలాంటి త్యాగాలు చేయాలి, ఎలా తనను ఆరాధించాలి అనేది వివరంగా వారికి దేవుడు చెప్పాడట. తరువాత మోసెస్ కొండదిగి రాగా, అప్పటికే ఇజ్రాయిల్ వాసులు ఒక ప్రతిమను అలంకరించి ఆరాధించడం మొదలుపెట్టారట. అది చూచి ఆగ్రహించిన మోసెస్ దేవుడిచ్చిన ఆజ్ఞాఫలకాలలో రెండింటిని నేలకేసి కొట్టి ముక్కలు చేశాడట. (అంటే మనిషి ఆ ఫలకాలు చేశాడని స్పష్టపడుతుంది)

అప్పుడు యిచ్చిన ఉత్తరువు ప్రకారం అందరినీ హతమార్చ మన్నారు. పిల్లల్ని సైతం చంపేయమన్నారు. ఆవిధంగా ఒక్కనాడే మూడువేలమందిని చంపేశారు.

మత మిథ్యలలో సత్యం లేదు. బైబిల్ లో అక్కడక్కడా నైతిక సూత్రాలు వల్లించి ఉండవచ్చు.

బైబిల్ లో పేర్కొన్న ఇజ్రాయిల్ వాసుల ప్రవాసానికి ఎలాంటి వాస్తవ చారిత్రక ఆధారాలు లేవు.

కాని కొందరు ప్రాచీన పురావస్తు పండితులు వీటిలో నిజాలు వెతకడానికి విఫల ప్రయత్నం చేశారు. ఇజ్రాయల్ లో దీనికోసం ఎన్నో త్రవ్వకాలు జరిపారు. ఎంత ప్రయత్నించినా, ఇజ్రాయల్ వాసుల ప్రవాసం రుజువుపరచలేకపోయాం. ఆ తరువాత దేవుడిచ్చిన హామీ ప్రకారం పవిత్ర భూమిని తిరిగి వశపరుచుకున్నారనేది కేవలం మనుషులు అల్లిన కథ. ఈజిప్టు చరిత్రలో యిలాంటి ప్రస్తావనే లేదు. పైగా చారిత్రక ఆధారాలు యీ కథకు భిన్నంగా ఉన్నాయి. పాలస్తీనాలో యూదులు ఉన్నమాట నిజం. డేవిడ్ రాజ్యం పరిమితంగా ఉన్నదీ వాస్తవమే. మిగిలినవన్నీ కట్టుకథలే.

చావును తప్పించుకోవాలని మానవుడు కోరుకుంటాడనీ, మతం దాని చుట్టూ చాలా భ్రమలు అల్లిందనీ ఫ్రాయిడ్ చెప్పాడు. అయితే బైబిల్ పూర్వ నిబంధనలో చూపిన క్రూరత్వం, అమానుషత్వానికి జవాబు లేదు.

ఉత్తరోత్తరా ఇజ్రాయిల్ వాసుల పవిత్ర స్థల పురాణం గురించి సమర్థిస్తూ, క్రైస్తవులు ఎన్నో ప్రయత్నాలు చేయకపోలేదు. అయితే చరిత్రలో ఎలాంటి ఆధారాలూ లేవని ఫ్రెంచి పురావస్తు శాస్త్రజ్ఞుడు రొనాల్డ్ వాక్స్ ఘంటాపథంగా చాటి చెప్పాడు. ఈ విషయంలో కనబరిచే విశ్వాసం తప్పు అన్నాడు. పైగా యితడు డొమీనికన్ కూడా.

సినాయ్ పర్వతంపై జరిగినట్లు అల్లిన దివ్యవాణి కథనాలు, పూర్వ నిబంధన ప్రకరణల విషయాలు. తరువాత కాలంలో ప్రవేశపెట్టిన వ్యవహారాలే. బైబిల్ చదివే పిల్లలు వేస్తున్న ప్రశ్నలు, పెద్దల్ని తబ్బిబ్బు చేస్తున్నాయి.

పూర్వ నిబంధనల ప్రకరణాల మోసపూరిత విషయాలను థామస్ పెయిన్ ఉతికి ఆరేశాడు. ఆయన చేసిన వాదనలకు ఎవరూ ఎదురు చెప్పలేకపోయారు. మోసెస్ అనే వ్యక్తి వీటిని రాయలేదు. అతడున్నాడనే కాలంలోనూ యిలా రాయలేదు. తరువాత ఎప్పుడో రాసి అతడికి అంటగట్టారు.

మోసెస్ నెమ్మదస్తుడని ఒకచోట రాశారు. మరికొన్ని చోట్ల మోసెస్ ఉగ్రస్వరూపంతో ఆజ్ఞలిచ్చాడన్నారు. పూర్వ నిబంధనలలో కొన్ని ప్రకరణాలు మోసెస్ పేరెత్త లేదు. కొన్ని సందర్భాలలో ఎవరో వ్యక్తితో మాట్లాడినట్లున్నది.

మోసెస్ నూట పదేళ్లు చెక్కు చెదరని ఆరోగ్యంతో బ్రతికాడట. అప్పుడు నెబో కొండెక్కి దేవుడు పేర్కొన్న పవిత్ర భూమిని చూచాడట. హఠాత్తుగా అతడి ప్రవక్త శక్తులు ఉడిగి పోగా, మౌబ్ ప్రాంతంలో చనిపోయాడు. అక్కడే భూస్థాపితం అయ్యాడన్నారు. అప్పటి నుండీ అతడి సమాధి కనుక్కోలేక పోయారు.

పరస్పర విరుద్ధ విషయాలు బైబుల్ లో మామూలే. మోసెస్ రెండోసారి తన అనుచరుల్ని కూడగట్టి, దేవుడిచ్చిన ఆజ్ఞలు అందజేశాడట. అలాగే రెండు రకాల సృష్టి ప్రక్రియలు ఉన్నాయి. ఆడం సంతతి పరంపర రెండు రకాలుగా రాశారు. మహా ప్రళయం రెండు విభిన్న రీతులలో చూపారు.

కట్టుదిట్టంగా వుండని పిల్లల్ని రాళ్ళతో కొట్టి చంపమని మోసెస్ చెప్పాడు. మరోవైపు, రాళ్ళ దెబ్బలకు గాయపడిన వారు, అంగాలు పోగొట్టుకున్నవారు, దైవ సన్నిధి చేరలేరన్నారు.

యుద్ధానంతరం తిరిగొచ్చిన సైనికాధిపతుల్ని ఉద్దేశించి, మోసెస్ ఆగ్రహావేశంతో మిగిలిన పిల్లా జల్లా, స్త్రీలతో సహా అందరినీ మట్టుపెట్టమంటాడు. పురుష సాంగత్యం లేని స్త్రీలను మాత్రం వుంచుకోమని సైనికాధికారులకు సలహా యిచ్చాడు.

పవిత్ర గ్రంథాల పేరిట రాసిన యీ అపవిత్ర పోరాటాల పట్ల థామస్ పెయిన్ ఆగ్రహించాడు.

బైబుల్ ప్రకారం మనుషులు అసంభవమైన వయస్సు వచ్చేవరకూ బ్రతకడమే గాక, పిల్లల్ని కూడా కంటారు. తెలివిలేని వారు సైతం దేవుడితో తలపడి వాదిస్తారు. మరి దేవుడి సర్వశక్తిమంతం ఏమైందో తెలియదు. బైబిల్ లో ఎప్పుడూ నేల రక్తసిక్తంగానే ఉంటుంది. ఇదంతా పరిమిత ప్రాంతానికి చెందిన కథ. ఆ ఎడారి ప్రాంతం అవతల ఏముందో, ఏం జరుగుతుందో వారికి తెలియదు. సామాన్య ప్రజలకే కాదు. వారిని సృష్టించినట్లు చెబుతున్న దేవుళ్ళ జ్ఞానము ఆమేరకే ఉంది. అంటే దేవుళ్ళు కూడా మానవ ప్రతి రూపాలన్న మాట.

-----

## అధ్యాయం – 8

# పాత బైబుల్ పాపాలకు మించిన కొత్త నిబంధన

బైబుల్ లో కొత్త నిబంధన క్రైస్తవులకు పవిత్రం. యూదులు అది అంగీకరించరు. కొత్త నిబంధన చదువుతుంటే పాత నిబంధన ప్రస్తావనలు వస్తాయి. కనుక పాత నిబంధన చదవక తప్పదు. అయితే పాత నిబంధన చదవాలంటే చాలా ఓర్పు కావాలి. లేకుంటే విసుగు పుడుతుంది.

పాత నిబంధనలో అబ్రహాం తన కుమారుడిని బలివ్వడానికి తీసుకెళతాడు. కన్యకు కుమారుడు పుట్టబోతున్నాడని అతడికి వాణి వినిపిస్తుంది. కొడుకుని బలియివ్వడం విరమిస్తాడు.

కొత్త నిబంధనలో నాలుగు సువార్తలు తెరచి, ఎక్కడ చదివినా, జీసస్ చేశాడని చెప్పే ఉదంతాలు ఎదురవుతాయి. లోగడ ప్రవక్తలు చెప్పిన విషయం నిజం కావడానికి అది అవసరమైంది. జెరూసలేంకు జీసస్ రాక, గాడిదపై పయనం, యిత్యాదులన్నీ దివ్యవాణి ప్రవక్తలు చెప్పింది నిజమని రుజువు చేయడానికే. (మాథ్యూ సువార్త 21వ ప్రకరణ 4వ చరణం) జకరయ్య ప్రకరణ 9: 7 ప్రకారం దైవదూత వచ్చినప్పుడు గాడిదపై పయనిస్తాడనే ప్రస్తావన ఉంది.

ఆలాంటి దైవదూత రాక కోసం యూదులు ఎదురు చూస్తున్నారు. క్రైస్తవుల ప్రకారం అతడు వచ్చేశాడు. పాత నిబంధన వలె, కొత్త నిబంధన కూడా సరిగా అల్లలేకపోయారు. సంఘటనలు జరిగిన తరువాత ఎప్పటికోగాని రాయడం మొదలు పెట్టలేదు. అందుకే అవకతవకలు బాగా దొర్లాయి.

కొత్త నిబంధన అంతా అస్తవ్యస్తం, కలగాపులగం అని హెచ్. ఎల్. మెన్ కెన్ తన ట్రీటైజ్ ఆన్ గాడ్స్ రచనలో అంటాడు. నిబంధనలలో విషయాలు యింకా పనికొస్తాయని చూపడానికి తిప్పలు అలా రాసారని థామస్ పెయిన్ అంటాడు.

2004లో మెల్ గిబ్సన్ సినిమా తీశాడు. జీసస్ మరణం గురించిన చిత్రం అది. మెల్ గిబ్సన్ ఆస్ట్రేలియా ఫాసిస్టు. అతడి తండ్రి ఒక కర్కోటక వ్యక్తి. వారు కేథలిక్ ముఠాకు చెందినవారు. యూదు వ్యతిరేకులు. క్రీస్తును శిలువ వేసిన నేరం యూదుదని వారి ఆరోపణ. సినిమా పేరు ది పాషన్ ఆఫ్ ది క్రైస్ట్. ఆ సినిమా కోట్లు ఆర్జించింది. యూదులు సైతం మౌనం వహించారు. రెండవ ప్రపంచం అంతమైన రెండు దశాబ్దాలకు యూదులపై ఆరోపణల్ని పోప్ ఉప సంహరించాడు. క్రీస్తును శిలువేసిన ఖ్యాతి తమదేనని యూదులు అన్నారు.

క్రీస్తు అనంతరం అనేక దశాబ్దాలకు గాని నాలుగు సువార్తలు రాయలేదు. వారెవరికీ ఏ ముఖ్యమైన విషయం పైనా ఏకాభిప్రాయం లేదు.

అయితే మెల్ గిబ్సన్ సినీ నిర్మాతగా నూతన నిబంధనలన్నీ వాస్తవాలని నమ్మాడు. సువార్త రచయితలు ఏ ఒక్క విషయం పైనా ఏకాభిప్రాయంతో లేరు. కన్యకు జీసస్ పుట్టడం, జీసస్ వంశంపై మాథ్యూ, లూకస్ లు విభేదించారు. ఈజిప్టుకు ఇజ్రాయల్ వాసులు పారిపోవడంపై విరుద్ధ భావాలు వెల్లడించారు. వెంటనే తప్పించుకొమ్మని జోసెఫ్ కు కలవచ్చినట్లు మాథ్యూ అంటాడు. అందరూ బెత్లహాంలోనే వున్నారని లూక్ రాశాడు. తరువాత జెరూసలేం మీదుగా నజరత్ వెళ్ళాడన్నారు. (పిల్లవాడిని దాచిపెట్టడానికి ఈజిప్టు పారిపోతే, నైల్ తీర ప్రాంతంలో అది రహస్యంగా ఉంచడం చాలా కష్టం)

సీజర్ ఆగస్టస్ చక్రవర్తి జనాభా లెక్కలు సేకరించమని ఉత్తరువులిచ్చిన ఏడాదికి దైవాంశ బాలుడు జన్మించాడని లూక్ రాశాడు. అప్పుడు జుడాలో హెరాద్ రాజుగా ఉండగా సిరియాలో క్విరినియస్ గవర్నర్ హెరాద్ క్రీ.పూ. 4వ ఏట చనిపోయాడు. సువార్తలలో ఏది దైవ ప్రేరితము అనే చర్చ కొనసాగింది. తరువాత లభించిన సువార్తలు కొంత వాస్తవానికి దగ్గరలో ఉన్నాయి. కాని ఇవన్నీ మనుషులే రాశారని ధైర్యంగా చెప్పలేకపోయారు.

జీసస్ సమకాలీన శిష్యులు చదువు రానివారు వారు ఎలాంటి సమాచారం అందించలేదు. పైగా వారెవరూ ఆనాడు క్రైస్తవులు కాదు. జీసస్ ఎన్నడు క్రైస్తవ చర్చిని స్థాపించాలనుకోలేదు.

పురాతన నిబంధన కలగపులగపు రాతల ప్రకారం, డేవిడ్ నగరంలో దైవప్రతినిధి జన్మించాలి. అదే బెత్లహాం. కాని క్రీస్తు తల్లిదండ్రులు నజరత్ కు చెందిన వారు. వారికి కొడుకు పుట్టి ఉంటే అక్కడే జరిగి ఉండాలి. మొత్తం మీద హెరాద్, అగస్టస్, క్వెరినియస్ ల పై ఎన్నో కాకమ్మ కథలు అల్లారు. బెత్లహాంకు రంగం తరలించారు. అక్కడ పశువుల కొట్టం ఎక్కడా ప్రస్తావనలో లేదు. బెత్లహాంలో పుట్టినట్లు కథ అల్లితే సరిపోయేది. బైబిల్ ప్రవచనాలకు పొందికగా ఉండటానికి యిన్ని తిప్పలు పడ్డారు.

జాన్ సువార్త ప్రకారం జీసస్ డేవిడ్ రాజు సంతతి కాదు, బెత్లహాంలో పుట్టలేదు. రాజ వంశం కోసం పడిన తిప్పలన్నీ జనాకర్షణ కోసమే.

బైబుల్ నూతన నిబంధన చూపే పరస్పర విరుద్ధాలు, చదువురాని ధోరణిలో వ్యక్త పరచటం గమనిస్తే, పండితులు వీటిని విడమర్చటానికి జుట్టు పీక్కున్నారు. క్రైస్తవ మతాధికారులు మాత్రం వీటిని వివరించదలచలేదు. కేవలం క్రైస్తవ మత విశ్వాసం అనో, ఉపమానాలు అనో చెప్పి తప్పించుకునేవారు. ఇబ్బందికరమైన ప్రశ్నలు ఎవరైనా వేస్తే వారిని తన్ని తగలెయ్యడం, లేదా నోరు మూయించడం క్రైస్తవులు చేసిన పని. సువార్తలు ఉపయోగకరమైనవని, పూర్వీకులు చెప్పిన వాటికి నిదర్శన పూర్వకంగా చూపటానికి అవి అవసరం అని చెప్పారు. అంటే మతం మానవ సృష్టి అని చూపారన్నమాట. జాన్ చెప్పినదాన్ని బట్టి మోసెస్ చట్టాన్ని ఇచ్చారు. కాని దయ, సత్యం జీసస్ నుండే వచ్చాయి. ఈ అర్థంలో మాథ్యూ చెబుతూ ఈసయ్య ప్రవక్త ఆనాడు ఆహజ్ రాజుకు చెప్పిన వాక్యాలను ప్రమాణంగా స్వీకరించాడు. అయితే జీసస్ పుట్టుటకు ముందు ఎనిమిదివేల సంవత్సరాల క్రితం ఇది జరిగింది. దాని ప్రకారం ప్రభువు సంకేతం ఇస్తాడని, కన్యకు కుమారుడు పుడతాడని రాశాడు. అహజ్ రాజు తన శత్రువులపై విజయానికి అవి సంకేతాలుగా భావించాడు. కన్య అంటే యువతి అని మాత్రమే ఆనాడు అర్థం చేసుకున్నారు. ఏమైనా కన్యకు పుట్టిన శిశువు దివ్యశక్తులతో ఉంటాడనేది ఏమీ లేదు. ఆ విధంగా మతం అనుమానాలకు దారితీసింది. సినాయి పర్వతంపై మోసెస్ స్వీకరించిన దానికి, క్రీస్తు బోధనలకు పోల్చి చూస్తే మోసెస్ ఎక్కడికి వెళ్ళినా యూదులు అతడిని అనుసరించినట్లు వున్నది. అంటే ప్రవక్త చెప్పింది రుజువైనట్లు భావించారు. సినాయి పర్వతంపై దేవుడు చెప్పింది యూదు పురోహితులు నమ్మారు. అ తర్వాత జీసెస్ రక్తాన్ని వారు కోరినట్లు ఉత్తరోత్తర ప్రచారంలోకి వచ్చింది.

కన్యకు పుట్టిన అనే విషయం గమనిస్తే, గాథలని ఎలా సృష్టిస్తామో అర్థమవుతుంది. జీసస్ పరలోకంలో ఉండే తన తండ్రిని ప్రస్తావించాడే కానీ తన తల్లిని, అమె కన్యత్వాన్ని ఏనాడూ పేర్కొనలేదు. పైగా ఆమె పట్ల మోటుగా, కరుగా ప్రవర్తించాడు. అమెకు కూడా గాబ్రియల్ దేవత కనిపించినట్లు గుర్తు లేదు. దేవదూతలు వచ్చినట్లు తెలియదు. వారంతా ఆమె దైవమాత అని చెప్పినట్లు ప్రచారం మాత్రం జరిగింది. తన కుమారుడు చేసేదంతా ఆమెకు ఆశ్చర్యాన్ని కలిగించింది. అతడు యూదులతో దేవాలయంలో ఏం మాట్లాడాడు? తన తండ్రి పిలుపుపై తాను కృషి చేసినట్లు చెప్పటంలో అర్థమేమిటి? తల్లికి ఇవన్నీ బాగా గుర్తు ఉండి ఉండాలి. పైగా కన్యగా గర్భం ధరించిన తల్లికి ఈ విషయాలన్నీ జ్ఞాపకం లేకపోవడం సంభవం కాదు. లూక్ వ్రాస్తూ జోసెఫ్ మేరీలను జీసెస్ తల్లిదండ్రులుగా ప్రస్తావించాడు. అమెను శుద్ధి చెయ్యటానికి వారంతా దేవాలయ ప్రవేశం చేసినట్లు, అప్పుడు సైమన్ అనే వృద్ధుడు వారిని శ్లాఘించినట్లు వ్రాశాడు.

మాథ్యూ వ్రాస్తూ జీసెస్కు నలుగురు సోదరులు ఉన్నట్లు, కొందరు చెల్లెళ్ళు వున్నట్లు పేర్కొన్నాడు. (13-55-57 సువార్త) జేమ్స్ సువార్తలో జీసస్ సోదరుడి ప్రస్తావన ఉన్నది. మేరీకి ఈ సంతానమంతా జోసెఫ్ ద్వారా పుట్టి వుంటే చాలా పెద్ద సంతానవతిగా భావించవలసి ఉంటుంది.

సువార్తలలో ఏది సరియైనది, ఏది కాదు అని చర్చకు పెడితే ఒక పట్టాన తేలదు. మేరీకి పెళ్ళికి ముందే కన్యగా శిశువు పుట్టినట్లు ఒక కథనం చెపుతున్నది. మరో పక్క పాపానికి నేరం మరణం అని వ్రాశారు. బహుశా ఆమె పాపం చేసి ఉండకపోవచ్చు. కనుక అమె చనిపోయి ఉండకపోవచ్చు. 1852లో రోమ్ లో మేరీని కన్యగా కనుగొన్నట్లు ప్రకటించారు. ఇదంతా మానవ సృష్టి అనటం, మూర్ఖత్వం అని కొట్టి పారెయ్యటానికి వీలు లేదు. ఏదో ఒక రకంగా పరువు నిలబెట్టుకోవాలని చేసిన ప్రయత్నాల లాగా కనిపిస్తున్నాయి. అయితే ఈ ప్రేరణలో చర్చి చేసిన ప్రయత్నం దేవుళ్ళకు అవమానకరంగా పరిణమించింది.

పాత నిబంధన అంతా కలల మయంగా ఉంటే, జ్యోతిష్యాలతో నిండి ఉంటే, తరువాత వచ్చిన క్రైస్తవుల బైబుల్, నక్షత్రాల ఆధారంగా అంచనాలు, మాంత్రిక వైద్యులు, సోది చెప్పేవారి విషయాలతో నిండి పోయి ఉన్నది. శాంతి ప్రియులకు, మూగజీవులకు సానుభూతిని వ్యక్తం చేసే మాటలు, చేతలు జీసెస్ నోటితో వెల్లడించినప్పుడు ఇలాంటి అభిప్రాయాలు ఏర్పడతాయి. ఇందులో కొన్ని అయోమయంగా ఉన్నాయి. మరి కొన్ని మ్యాజిక్ లో నమ్మకాలు కనబరిచాయి. మరికొన్ని అసంభవాలు అనిపిస్తాయి. వ్యవసాయం పట్ల వారి ధోరణి మరీ ఆదిమ దశలో ఉన్నది. అవినీతికి కంకణం కట్టినట్లుగా

స్పష్టపడుతుంటుంది. మానవులను లిల్లీపూలతో పోల్చడం చూస్తే కాలాన్ని వృధా చేసారేమో అనిపిస్తుంది. రేపటి గురించి అలోచించవద్దని చెప్పారు. కొన్ని సువార్తలలో జీసెస్ ను జనం పిచ్చోడని అనుకున్నారు. మరికొన్ని చోట్ల యూదు భావాలతో గూడు కట్టుకుని పోయిన వాడని అన్నారు. కననైట్ స్త్రీలపట్ల విపరీత జుగుప్సను కనబరిచి, యూదులు కాని వారితో తన కాలాన్ని వృధా చెయ్యబోవడం లేదని జీసస్ అన్నాడు. (మాథ్యూ 15.21-28) బహుశ ఆ రోజులలో అలాంటి వ్యక్తి ఎవరైనా ఉండి ఉండవచ్చు. మానసికంగా దిగజారిపోయిన వారుగా ప్రవక్తలు పాలస్తీనాలో సంచరించారు. అక్కడే తేడా వస్తుంది. తన అనుచరులకు స్వర్గం చూపిస్తానని నిజంగా నమ్మించాడా అని ఆలోచించాలి. సి.ఎస్. లూయిస్ క్రైస్తవ మతం పట్ల ఏదో ఒక విధంగా సమర్థించే విధానాలను పెంపొందించాడు. జీసెస్ అందరి పాపాలను తానుగా స్వీకరించినట్లు వ్యాఖ్యానించాడు.

అయితే లూయిస్ నిర్దిష్టమైన అధారాలతో ఈ విషయాలు చెప్పలేదు. చరిత్రలో ఒక పాత్రగా జీసెస్ ను గమనించి వదిలేయమన్నాడు. అతడి తర్కాన్ని, నీతిని గమనించి ఆమోదించమన్నాడు. జీసస్ ను కేవలం నైతిక బోధకుడుగా స్వీకరించి, దివ్యత్వాన్ని నిరాకరించిన వారిని లూయిస్ ఖండించాడు. అలా చెప్పిన వారిలో థామస్ జఫర్ సన్ ఉన్నాడు. లూయిస్ క్రైస్తవుల పట్ల ప్రధాన ప్రచారకుడుగా పరిణమించాడు. అతడు లౌకిక విషయాలను, దేవత, దయ్యం ప్రస్తావనలు చెప్పినప్పుడు మనం అంగీకరించ నక్కరలేదు. అతడి వాదన చాలా దయనీయమైనది. ఇది వర్ణనాతీతం కూడా. జీసస్ దేవుడేనంటూ లూయిస్ భావించి, అతడిని పిచ్చి వాడిగా పరిగణించరాదు అన్నాడు. సువార్తలు నిత్య సత్యాలు కావని వ్రాశాడు అంటే జీసస్ చెప్పినవి, బోధించినవి అభూత కల్పనలని భావించాడు. రెండవసారి జీసస్ తిరిగి వస్తాడని చెప్పడం అందులో ఒకటి. బిషప్పులు కొందరు తొలి రోజులలో ఏదో స్వయంగా విన్నట్లే ఈ విషయాలు ప్రచారం చేశాడు. సి.ఎస్. లూయిస్ చెప్పిన వాటిని బార్ట్ న్ ఎర్మన్ సునిసితంగా పరిశీలించాడు. క్రైస్తవుల మౌలిక ప్రచార సభలో పాల్గొన్నాడు. అతనికి గ్రీకు, హిబ్రూ భాషలు వచ్చు. కానీ తన పాండిత్యానికి, భక్తికి అఖాతం ఉన్నట్లు కనుగొన్నాడు. జీసస్ పేరిట ప్రచారంలో ఉన్న కథను చాలా కాలం తరువాత కల్పించినవేనని తెలుసుకున్నాడు.

జీసస్ కు ఎదురైన వారిలో ఒక వ్యభిచారిణి ఉన్నది (జాన్ 8.3-11) ఆమెను యూదులు బయటకు లాగి రాళ్లతో కొట్టి చంపుతామన్నారు. అలా చెయ్యకపోతే చట్టాన్ని ఉల్లంఘించి నట్లవుతుంది. చంపేస్తే క్రీస్తు బోధనలకు అర్థం లేదు. అలాంటప్పుడు క్రీస్తు ప్రశాంతంగా సమస్యను పరిష్కరించాడు. ***మీలో పాపాలు చెయ్యని వారు ముందుకు వచ్చి ఆమెను రాళ్ళతో కొట్టండి*** అన్నాడు. అప్పటి నుండి జీసస్ సాహిత్యంలో, మానవుల మెదడులో తిష్ఠవేసుకున్నాడు.

ఇదే కథ తెరపైకి ఎక్కింది. మెల్ గిబ్బన్ దీన్ని చిత్రించాడు. పతనమైన స్త్రీని వుద్దేశించి జీసస్ చెప్పిన మాటలని ఇతర సినిమాలలోను ప్రస్తావించారు. ***ఇక పాపాలు చెయ్యవద్దు*** అని స్త్రీకి చెప్పి పంపించాడు. ఇలాంటి సన్నివేశాలు అనేకం ముందుకు వచ్చాయి.

మోసిస్ చట్టాలు నూతన నిబంధన ప్రకారం సమర్థనీయమైతే, పాత నిబంధనల క్రూరత్వం ఏమౌతుంది? దెబ్బకు దెబ్బ తీయాలనే సూత్రం అమలు జరగాలా వద్దా? బైబుల్ లో ఈ పరస్పర విరుద్ధాలు చూస్తే మనం ఎంత మోసపూరితంగా ప్రవర్తిస్తున్నామో అర్థమవుతుంది. జీసస్ ఏ ఆధారాలతో క్షమిస్తున్నాడు. ఇదంతా మోసం చెయ్యడం కాదా? జీసస్ జనాన్ని ఉద్దేశించి పాపాలు చెయ్యనివారు ఆమెపై రాయి వెయ్యండి అన్నప్పుడు, ఆమె, జీసస్ మాత్రమే మిగిలారు. అయితే ఆ సంఘటన గురించి వ్రాసింది ఎవరు? విన్నదెవరు? ఇది మంచి కథ అనిపించటంలేదా. ప్రొఫెసర్ ఎర్మన్ ఇంకా తన విమర్శ కొనసాగించాడు. స్త్రీ వ్యభిచారిణి అయితే ఆ చర్యలో పాల్గొన్న పురుషుడు ఎవడు? బైబుల్ లో లెవెటికస్ అధ్యాయం ప్రకారం ఉభయులకు శిక్ష ఉండాలి. రాళ్ళు వేసి కొట్టాలి. కానీ ఈ కథలో జనం మధ్య వణుకుతూ స్త్రీ మాత్రమే నుంచుంటుంది. లైంగిక చర్యల్లో మునిగి తేలే పురుషులు అమెను జనం మధ్యకు ఈడ్చారు. అప్పుడు ఆమెకు ఒకే ఒక స్నేహితుడు ఆదరణ చూపించాడు. ఆ సమయంలో జీసస్ చెప్పిన మాటలే జనాన్ని వెళ్ళి పోయేటట్లు చేశాయి. ఏమైనా ఈ భావన ఆహ్వానించదగింది. ఇందులో చిక్కులు ఎన్ని వున్నప్పటికీ సమస్య పరిష్కారమైంది. ఎర్మన్ ప్రకారం జాన్ సువార్తలో ఈ విషయాలు ప్రస్తావనకు రాలేదు. అంటే ఇదంతా సువార్తలో భాగం కాదన్నమాట.

పవిత్రమైన విషయాలను ప్రస్తావించటానికి ఈ పండితుడు ఇదంతా వ్రాయడు. బైబుల్ లో పొందిక లేదు అనేది అతడికి స్పష్టపడింది. ప్రేరణ ఎక్కడా కనిపించలేదు. పరిశోధిస్తే దైవం చెప్పినట్లు ఎక్కడా రుజువులకు, ఆధారాలకు నిలబడేటట్లు లేదు. అంటే మతాన్ని కేవలం మూఢనమ్మకంతోనే నిలబెట్టుకోవాలి. ఇప్పుడు చేస్తున్న పని అదే అని ఒప్పుకుంటే మర్యాదగా ఉంటుంది.

--------

## అధ్యాయం – 9

# బైబుల్ నుండి కొరాన్ కు

దేవుడు వెల్లడించిన చివరి సత్యం కొరాన్ అని ముస్లింలు నమ్ముతారు. అది మహమ్మద్ ద్వారా అందించాడు. అతడే చివరి ప్రవక్త అని ఇస్లాం గట్టిగా చెబుతుంది.

గాబ్రియేల్ అనే దైవ ప్రతినిధి ఒక కొండ గుహలో మహమ్మద్ కు కొరాన్ సురాలు యిచ్చాడు. మహమ్మద్ చదువుకోలేదు. అయినా అతడికే దివ్య సందేశం అందించాడు. అదంతా అరబిక్ భాషలో ఉంది. హీరా కొండ గుహలో ఒక నెలపాటు మహమ్మద్ గడిపాడు. అప్పుడే అతడు మగతగా దివ్యవాణి విన్నాడు. కొరాన్ అందించి చదవమంటే, తాను చదవలేనన్నాడు. అయినా అతడు దేవుడు ఎంపిక చేసిన వ్యక్తి అనీ, కనుక అతనే చదవాలనీ గాబ్రియేల్ శాసించాడు. దేవదూత వెళ్ళిపోయిన తరువాత, జరిగినదంతా తన భార్య ఖజాకు చెప్పాడు. అతన్ని వెంటబెట్టుకొని వారక్ ఇబ్న నాఫల్ వద్దకు తీసుకెళ్ళింది. అతడికి యూదు, క్రైస్తవుల పవిత్రగ్రంథాలు తెలుసు. మోసెస్ ను సందర్శించిన దేవదూతే హీరా కొండలో మళ్ళీ మహమ్మద్ వద్దకు వచ్చినట్లు చెబుతాడు. నాటి నుండి తనను అల్లా బానిసగా మహమ్మద్ చెప్పుకున్నాడు.

మహమ్మద్ కు తారసిల్లిన మక్కా వాసులు యిదంతా యూదుల్ని యింకా ఆగ్రహావేశుల్ని చేస్తుందని భావించారు. కాని మదీనా వాసులు మహమ్మద్ ను ఆహ్వానించారు. ఆ విధంగా మక్కానుండి మదీనాకు వెళ్ళినప్పటి నుంచి ముస్లిం శకం లెక్కిస్తారు.

యూదులకు క్రైస్తవులకు కనిపించిన దేవుడు, అరబ్బులను అశ్రద్ధ చేశాడనే భావన ఉంది. మహమ్మద్ రాకతో అది తొలగిపోయింది. స్థానిక ముఠాలు కొట్లాటలకు దిగాయి.

ప్రవక్త మహమ్మద్ 632లో చనిపోయాడు. ఆ తరువాత 120 ఏళ్ళకు గాని అతడి జీవిత గాథ రాయడం జరగలేదు. ఇబ్న ఇష్క అలాంటి తొలి ప్రయత్నం చేశాడు. కాని అది పోయింది. ఇబ్న హిషమ్ మళ్ళీ కృషి చేసి రాశాడు. 834లో అతడు చనిపోయాడు. అయితే మహమ్మద్ అనుచరులు ఎలా కొరాన్ సురాలు రాశారనేది స్పష్టత లేదు. దీనికి తోడు వారసత్వ కలహాల వలన సమస్య జటిలమైపోయింది. తన వారసత్వం గురించి మహమ్మద్ ఏమీ చెప్పలేదు. అప్పుడు మొదలైన కలహాలే, సున్నీ, షియా వర్గాల ఏర్పాటుకు దారితీసింది. అబుబకర్ ఖలీఫాగా వుండగా మహమ్మద్ చెప్పినవన్నీ మరచిపోయే ప్రమాదం ఉంది గనక, తొందరగా రాయించాలనుకున్నాడు. కాని ముఠా తగాదాలతో చాలామంది అంతం అయినందున, కొరాన్ సురాలు గుర్తుంచుకోగల వారి సంఖ్య తగ్గింది. సాధ్యమైనంత మేరకు పోగు చేసి మహమ్మద్ కార్యదర్శిగా ఉన్న జయిద్ ఇబ్న తబిత్ కు అందించారు. కాని ఏది సరైనది అనే విషయమై ఏకాభిప్రాయం లేదు. నాలుగో ఖలీఫా రోజులలో కొంత రాయించడం జరిగిందన్నారు. ఖలీఫా ఉత్ మన్ ద్వారా యిదంతా రాయించినట్లు సున్నీలు అంటారు. 644 నుండి 656 వరకూ అతడి పాలన ఉంది. జయిద్ ఇబ్నతబిత్ సంకలనం చేసి తుది రూపం ఇచ్చిన కొరాన్ ను మదీనాలో అట్టిపెట్టారు. ప్రతులు రాయించి బస్రా, కుఫా, డమాస్కస్ తదితర చోట్లకు పంపారు. మిగిలిన కొరాన్ రచనలన్నీ తగలబెట్టామన్నారు. ఇంత జరిగినా మహమ్మద్ ఉన్నప్పుడు ఏం జరిగిందో ఎవరికీ తెలియదు.

ఆరబ్ భాషలో తొలుత అచ్చులకు సంకేతాలు లేవు. బి.టి. వంటి అక్షరాల గుర్తింపుకు చుక్క గుర్తు వాడతారు. దీనంతటి వలన అరబ్బు భాష భిన్న రూపాంతరాలకు దారితీసింది.

మహమ్మద్ చెప్పినవీ, చేసినవీ హడిత్ పేరిట క్రోడీకరించారు. దీని ఆధారాలు సాక్షాత్తు చూచినవారు నిర్ధారించాలన్నారు. దైనందిన జీవితంలో ముస్లింలు వీటిని పాటిస్తారు. కుక్కలు అపరిశుభ్రమైనవని మహమ్మద్ భావించాడు గనుక, ముస్లింలూ అలానే అనుకుంటారు. సంఘటనలు జరిగిపోయిన ఎంతో కాలానికి కానీ, హడిత్ లు రాయలేదు. అలా సేకరించిన వారిలో బుఖారీ అనే అతడు మహమ్మద్ అనంతరం 238 ఏళ్ళకు చనిపోయాడు. అతడు 3 లక్షల హడిత్ లకు సాక్ష్యం చెబుతూ, రెండు లక్షల హడిత్ లు పనికిరావన్నాడు. చివరకు 10 వేల హడిత్ లు మిగిల్చారు. హడిత లలో కొన్ని బైబుల్ నుండి మరికొన్ని యూదుల నుండి సేకరించినట్లు స్పష్టం.

ఇస్లాంలో పరస్పర విరుద్ధ విషయాలెన్నో కనిపిస్తాయి. అందులో మత సహనం గురించి చెప్పేది ఒకటి. మతపరంగా బలవంతం లేదంటూనే ఇతర దేవుళ్ళను కొలిస్తే దేవుడు సహించడన్నారు. ఇస్లాంలో సూఫీల తత్వం భిన్నంగా ఉంది. కొరాన్ లో తలెత్తిన భిన్న పాఠాంతరాలు క్రోడీకరించి చూపే ప్రయత్నాలను అడ్డుకొంటున్నారు. మూఢ విశ్వాసంతో గొంతు నొక్కేస్తున్నారు.

ఇస్లాం ఏకేశ్వరారాధన మతం. కొరాన్ వారి పవిత్ర గ్రంథంగా అరబిక్ భాషలో ఉంది. దేవుడు ఆ భాషనే ఎందుకు ఎంపిక చేశాడు. మరొక భాష రాదా అనేవి సమాధానం లేని ప్రశ్నలు. కొరాన్ అనువాదాలు మూలానికి సాటిరావు. గనుక, ముస్లింలు అరబిక్ భాషలోనే తమ పిల్లలకు కొరాన్ సురాలు నేర్పిస్తారు. క్రైస్తవులు కూడా తమ పవిత్ర బైబిల్ ను అనువదించినప్పుడు కొందరిని చంపేశారు. కాని అనువాదాలు వచ్చిన తరువాతే ప్రొటెస్టెంట్ పునర్వికాసం వచ్చిందని మరచిపోకూడదు. అలాంటి సంస్కరణ ఇంకా ఇస్లాంలో మొదలు కాలేదు. అనువాదాల పక్కనే ఆరబిక్ మూలాన్ని యింకా వేస్తూనే ఉన్నారు.

ముస్లిం దండయాత్రలు జరగడం, అత్యంత వేగంగా ఇస్లాం వ్యాపించడం కూడా గమనార్హం. ఇస్లాంను ప్రశ్నించేవారిని చంపడమో, నోరు మూయించడమో జరిగింది. అలా చేసే హక్కు తమకు ఉన్నదంటారు. ఇస్లాంను నమ్మనివారు నరకానికి పోతారంటారు. ప్రశ్నిస్తే యిలా అణచివేయడం వెనుక, ముస్లింలకు తమ మతం పట్ల అభద్రతా, ఆందోళన వుంది.

ఇస్లాం సమాజులకు ఎన్నోచోట్ల నేను వెళ్ళాను. ప్రార్థనల అనంతరం ఆగ్రహావేశాలతో హింసాచర్యలకు పాల్పడడం గమనించాను. టెహ్రాన్, దోహా, జెరూసలేం, ఇస్తాంబుల్, మలేసియా, ఇండొనేషియా, బోస్నియాలలో ప్రార్థనా సమావేశాలలో పాల్గొన్నాను.

అయోతుల్లా ఖోమిని మనమడు సయ్యద్ హుసేన్ ఖోమినీ వాషింగ్టన్లో మాయింటికి వచ్చినప్పుడు, కొరాన్ ప్రతి యిచ్చాను. ముద్దు పెట్టకొని, కొరాన్ తెరిచి, నాతో చర్చించాడు. తన తాత చెప్పుకునే పెత్తనం, అధికారం సబబు కాదని ఖండించాడు. సాల్మన్ రష్దీని చంపాలనడాన్ని నిరసించాడు. అలాంటి వివాదాస్పద విషయాలలో నిర్ణయించే హక్కు ఎవరికున్నదన్నాడు.

అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఒకసారి వైట్ హౌస్ లో యిచ్చిన విందులో ఒక ఛాందస క్రైస్తవుడు తారసిల్లాడు. ఆ మధ్య నాపర్యటన జరిగిన అరబ్బు దేశాల అనుభవాలు అడిగాడు. ఇస్లాం ఇతర మతాల కంటే వయస్సులో చిన్నదని, నిలదొక్కు కోవడానికి తీవ్రఛాందసం చూపుతున్నదని చెప్పాను. క్రీస్తు ఉన్నాడో లేడో చరిత్ర నిర్ధారించలేదు. కాని మహమ్మద్ కచ్చితంగా వున్నట్లు చరిత్ర చెబుతున్నదన్నాను. అంతటితో అతడు ఆగ్రహావేశంతో బయటకు వచ్చిన తరువాత నన్ను చంపుతానని బెదిరించాడు.

ఇస్లాం అందరిదీ, విశ్వజనీనమైనది అంటారు. కాని హజ్ యాత్రలో ముస్లింలు కాని వారిని మక్కాకు రానివ్వరు.

స్వేచ్ఛాపూరిత అన్వేషణను గొంతు నులిమేస్తున్న అంధ విశ్వాసం ఎలాంటి దారుణ ఫలితాలకు దారితీస్తున్నదో గమనిస్తూనే ఉన్నాం.

-----

## అధ్యాయం – 10

# అద్భుతాల ముసుగులో

మదర్ థెరీసా అద్భుతాల పేరిట ఆమెకు ప్రపంచ ఖ్యాతిని తెచ్చి పెట్టిన వ్యక్తి మల్కొం మగ్ రిడ్జి. అతడు ఇంగ్లాండ్ మత ప్రచారకుడు. కేథలిక్ మత శాఖకు చెందిన వాడు. 1969లో సుప్రసిద్ధ కెమెరామెన్ కెన్ మక్మన్ను వెంటబెట్టుకొని కలకత్తా చేరాం. సివిలిజేషన్ పేరిట అతడు తీసిన పరంపర చాలా పేరు తెచ్చిపెట్టింది.

1969 నాటికి కలకత్తాలో మదర్ థెరీసా మరణ గృహాన్ని ఏర్పరచింది. చనిపోయే దశ వచ్చిన వారి నిమిత్తం ఆ గృహం ఉద్దేశించారు. అంతా చీకటిగా వుంటుంది. ఇంటి బయట వెలుతురు బాగా వుండగా, దృశ్యాలు తీశారు. లోన సందేహాస్పదంగా ఉన్నా అలానే తీశాం. అయితే మేము వస్తూ, అప్పడే కొత్తగా మార్కెట్ లోకి వచ్చిన కొడక్ ఫిలిం తెచ్చాం. అదెలా పనిచేస్తుందో మాకు తెలియదు. మొత్తం మీద దీనితో గృహంలో ఫిలిం తీశాం. ఇంగ్లండ్ వెళ్లి యీలింగ్ స్టూడియోలో ఫిలిం వేసి చూస్తే, గృహం లోన భాగం ఎంతో స్పష్టంగా వచ్చింది. కొడక్ కొత్త ఫిలిం విశేషం అది.

కాని ఆ విషయం దాచి పెట్టి, అదంతా మదర్ థెరీసా మహత్తు అని మాల్కొం మగ్ రిడ్జ్ లోకానికి చాటాడు. ఆ ఫిలిం పేరు ***సంథింగ్ బ్యూటిఫుల్ ఫర్ గాడ్.*** అంతేమరి. అది విశేష ప్రచారం పొంది, మదర్ థెరీసా పేరు మోగిపోయింది.

అసలు విషయం నేను బయట పెట్టాను. మదర్ థెరీసా చర్యలన్నీ విమర్శిస్తూ ది మిషనరీ పొజిషన్ గ్రంథం రాశాను. ఆ దెబ్బతో రోమ్ నగరంలో వాటికన్ అధిపతి పోప్ నన్ను సాక్ష్యం యివ్వమని పిలిచారు. మదర్ థెరీసాను సెయింట్ చేయదలచి, అల్లిన కథనాల్ని ఎండగట్టాను. అలా నన్ను పిలవడం వాటికన్ చరిత్రలో పెద్దమలుపు. కలకత్తాలో మదర్ థెరీసా అద్భుతాల కథలు అల్లి, సెయింట్ చేయడానికి కావలసిన కసరత్తు చేశారు. 1997లో మదర్ థెరీసా చనిపోయింది.

మోనికా బెస్రా అనే ఆమె పొత్తి కడుపు వ్రణంతో బాధపడుతున్నది.  ఇరవురు నన్స్ వెళ్ళి మదర్ థెరిసా బొమ్మగల తాయెత్తు ఆమెకు యిచ్చారు. అంతటితో ఆమె వ్రణం కాస్తానయమయిందని ప్రచారం చేశారు. ఆమె కాథలిక్, మదర్ థెరీసా పేరు విన్నది. మోనికా బెస్రా క్షయ వ్యాధితోనూ, పొత్తికడుపు వ్రణంతోనూ బాధపడుతుండగా చికిత్స చేసి నయం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మంజు ముర్షిద్, డా.కె.టి. బిస్వాస్, డా. రంజన్ ముస్తఫి యీ వాస్తవాన్ని వెల్లడించారు. మదర్ థెరీసా, నన్స్ ఫోను చేసి అద్భుత మహత్తు కారణంగా నయం అయిందని చెప్పమని డా. మంజు ముర్షిద్ పై ఒత్తిడి తెచ్చారు. తన భార్యకు వైద్య చికిత్స వలన నయమైందని ఆమె భర్త సెల్కు ముర్ము బయట పెట్టాడు. కనీస సాక్ష్యాధారాలు లేకుండా మదర్ థెరీసా అద్భుతాల వదంతులు వ్యాపింప జేశారు. అయినా సరే, రోమ్ లో ఆమెకు సెయింట్ ముద్ర వేసి మత వ్యాపారం చేయబోతున్నారు. మంత్రగాళ్ళు, ఫకీర్లతో అసలే బాధపడుతున్న గ్రామీణులు యిలాంటి వాటితో యింకా సతమత మవుతారు. ఆధునిక కాలంలోనే యిలా ఉంటే గత కాలంలో ఎన్ని దారుణాలు మత అద్భుతాల పేరిట చేశారో వూహించండి.

పూర్వ అద్భుతాల  కథనాలు కోకొల్లలుగా వుండగా, క్రమేణా వాటికి కాలం చెల్లుతున్నది.

మహమ్మద్ గుర్రంపై ఎగిరి జెరూసలేం వెళ్ళినట్లు నమ్ముతారు. అల్ అక్సా మసీదు చెంత గుర్రపు డెక్కల గుర్తులున్నాయని చూపుతారు. గుర్రాలు ఎగురుతాయా అని అడగగూడదు. పక్షుల వలె ఎగరాలని కలలుగనే వారు ఎప్పుడూ వుండనే వున్నారు. ఆకాశంలో దేవతలు రథాలపై పయనించినట్లు కథలు ప్రచారంలో ఉన్నాయి.

కంబోడియాలో మెకాంగ్, బస్సన్ అనే నదులున్నాయి. ఏటా వాటికి వరదలొచ్చి, పొంగి  రెండూ కలుస్తాయి.  ఆ ఉధృత ప్రవాహంలో నీళ్ళు వెనక్కు తన్ని టాన్లే సాప్ అనే పెద్ద సరస్సులో పడతాయి. కంబోడియా  రాజు అలాంటి సమయంలో వచ్చి, నీటిని వెనక్కురమ్మని ఉత్తరువులిస్తాడు. ఇది ఏటా ఒక మత ఉత్సవంగా జరుగుతుంటుంది. కంబోడియా రాజు సిహానోక్ యీ ప్రకృతి ఘటనను తన గొప్పతనంగా వాడుకున్నాడు.

సాధారణంగా జరిగిపోతున్న సంఘటనలతో అనుకోని మార్పు వస్తేనే, మహత్తుగా చెబుతారు. కొన్నిసార్లు మనుషులు భ్రమలు, భ్రాంతికి గురై మహత్తులు చూసినట్లు భావించడమూ కద్దు.

నిప్పల మీద నడక, గాలిలో తేలిపోతూ వుండడం, నీటిపైన నడక, చంచాలు వంచడం వంటివి మహత్తుగా భావించారు. జేమ్స్ రాండీ వంటి వారు వీటిని చేసి చూపి ఎలాంటి మహత్తు లేదని చూపారు.

బైబుల్ కొత్త నిబంధనలో మహత్తులు కొన్ని చెప్పారు. జీసస్ చనిపోయిన తరువాత లేచి వచ్చాడని మార్క్ సువార్తలో ఉంది. ఇది తరువాత చేర్చిన గాథ అని బార్టన్ ఎర్మన్ పరిశోధన చేసి బయట పెట్టాడు. లాజరస్ ను లేచిరా అంటే శవమైన లాజరస్ లేచి రావడం జీసస్ అద్భుతంగా చెప్పారు. అలాగే జైరస్ కుమార్తె మృత దేహం నుండి ప్రాణంతో వచ్చిందన్నారు. వారు అలా బ్రతికి వచ్చినప్పుడు, వారి అనుభవాల గురించి ఎవరూ ఇంటర్వ్యూ చేయకపోవడం విడ్డూరం. ఆ తరువాత వారు ఎప్పుడు, ఎలా చనిపోయారో రికార్డు లేదు. లేక, తిరుగాడే యూదువలె చనిపోకుండా, శాశ్వతంగా వుండి పోయారా?

క్రీస్తు మన కోసం చనిపోయాడంటారు. మరొకవైపు క్రీస్తు అసలు చనిపోలేదంటారు. సాక్ష్యాధారాలు లేనప్పుడు నమ్మ వలసిన అవసరం లేదు. విపరీత గొప్పలు చెబితే, విపరీత సాక్ష్యాలూ అవసరమే.

ప్రకృతి వైపరీత్యాలూ, ఉపద్రవాలూ సంభవించినప్పుడు, అవెలా వచ్చాయో కారణాలు ఏమిటో నేడు శాస్త్రీయంగా తెలుసుకుంటున్నారు. అటువంటప్పుడు మతాలు వాటిని స్వీకరిస్తే, పిచ్చి వివరణలు దైవపరంగా, పవిత్ర గ్రంథాల పరంగా చెప్పనక్కరలేదు. దేవుడు శిక్షించాడనే వివరణలు యివ్వ నక్కరలేదు.

అమెరికాలో న్యూ ఆర్లీన్స్ రాష్ట్రం సముద్ర మట్టంకన్నా దిగువన వున్నది. పెద్ద తుఫాను కత్రినా వచ్చినప్పుడు భవనాలు కొట్టుకపోయాయి. తీవ్ర నష్టం వాటిల్లింది. బుష్ పాలనలో ఆ రాష్ట్రాన్ని అశ్రద్ధ చేశారు. కాని నష్టాలకు దైవాన్ని రంగం మీదకు తెచ్చి, పాపులకు శిక్షగా చెప్పడం దారుణం.

అమెరికాలో న్యూయార్క్ జంట ట్రేడ్ భవనాలను ముస్లిం మత ఛాందసులు నాశనం చేశారు. దీనికి సంజాయిషీగా, క్రైస్తవ ఛాందసులు ప్యాట్ రాబర్ట్ సన్, జెరీఫాల్ వెల్ ఏం చెప్పారనుకున్నారు? అమెరికా పురుషాయితం (హొమోసెక్స్), గర్భస్రావం అనుమతించడం వలన యీ శిక్ష వచ్చిందని ముఖ్యంగా మాట్లాడారు. పూర్వం ఈజిప్టులో సోడోమీ వలన భూకంపాలు వచ్చినట్లు నమ్మారు.

న్యూయార్క్ జంటభవనాల కూల్చివేతను శుభ్రం చేసిన అనంతరం రెండు శిలువలు పోలిన లోహపు వస్తువులు కనిపించగా దానిచుట్టూ కథలు అల్లారు. చట్ర నిర్మాణంలో శిలువను పోలిన చిత్రాలున్నందున అలా జరిగింది. ఆ మాత్రం విచక్షణ లేనివారు, అద్భుతాల్లోకి వెళ్ళారు.

ఈ రోజులలో మతాలు, పవిత్ర గ్రంథాలలో వున్న వాటికంటె, ఎంతో విజ్ఞానం విస్తారంగా వచ్చింది. నాలాంటి సాధారణ వ్యక్తికే అవి తెలుస్తున్నాయి. జీవితంలో విశ్వాసాలు, భక్తి, మతం, దైవ నమ్మకాలు లేకపోతే ఇక మిగిలేదేముంది అని దిగులు పడనక్కరలేదు.

హొమర్ రచనలు చదువుతుంటే ఎంతో ఆనందం కలుగుతుంది. షేక్స్ పియర్ నాటకాలు ఆస్వాదిస్తే కలిగే తృప్తి చెప్పనలవిగాదు. మిల్టన్ కవితలు గొప్ప సంతృప్తినిస్తాయి.

టాల్ స్టాయ్, ప్రౌస్ట్ గొప్ప రచనలు అందించారు. మొజార్ట్ సంగీతం మానవ సృష్టేనా అని ఆశ్చర్యపరుస్తుంది. కనుక మూఢనమ్మకాలు పోగొట్టుకుంటే వారి స్థానంలో జీవితానికి సంతృప్తినిచ్చేవి ఎన్నో.

సెక్స్ లో యూనిఫైడ్ ఫీల్డ్ థియరీ ఎంత ఉన్నత శిఖరాలకు తీసుకు వెదుతుందో మరి.

ఒకప్పుడు మార్క్సిజం ఎంతో గొప్ప తాత్విక సంతృప్తి కలిగించింది. ఇప్పుడు వేరేవి వచ్చాయి. మతానికి ఉత్తమ, హేతుబద్ధ మార్గాంతరాలు నిరంతరం వస్తూనే ఉన్నాయి.

-----

# అధ్యాయం – 11

# కొత్త దేవుడండీ

ఇస్లాం చివరి మతం అన్నారు. మహమ్మద్ ఆఖరి ప్రవక్తగా చెప్పారు. కాని తరువాత కొత్త దేవుళ్లు పుట్టుకొస్తూనే వున్నారు. సరికొత్త ప్రవక్తలు తలెత్తూనే వున్నారు. మరిన్ని దైవప్రేరిత పవిత్ర గ్రంథాలు వెలుగు చూస్తున్నాయి.

అమెరికాలో అలాంటి కొత్తమతం ***లేటర్ డే సెయింట్స్*** అంటారు. మోర్మోన్లు అని ఇంకొక పేరు కూడా ఉంది.

ఆ కథ చూడండి. సరికొత్త దేవుడి పేరు జోసఫ్ స్మిత్. అతడికి 20 ఏళ్ల ప్రాయంలో న్యూయార్క్ లో బెయిన్ బ్రిడ్జ్ కోర్టు శిక్ష వేసింది. 1826 మార్చిలో ఘట్టం ఇది. జనాన్ని మభ్య పెట్టి, బంగారం లభిస్తుందని మోసగించాడు. కోర్టులో నేరాలు అంగీకరించగా జైలుపాలయ్యాడు. జనం మరిచిపోయారు.

నాలుగేళ్ళ తరువాత హఠాత్తుగా పేపర్లలో మళ్ళీ కనిపించాడు. జోసఫ్ రంగం మీదకు వచ్చి, తనకు మోర్మోన్ అనే దైవదూత కనిపించి, దివ్యవాణి వినిపించినట్లు చెప్పాడు. బంగారు ఫలకాలపై రాసిన పుస్తకాన్ని దేవదూత అతడికి వెల్లడించింది. బైబిల్ పూర్వ నిబంధనలో పేర్కొన్న యురిం (URIM), ధుమిం (Thummim) జంట ఫలకాల వలన వీటిని అనువదించ గలిగానన్నాడు. అతికష్టం మీద బంగారు ఫలకాలను తవ్వి తీసి 1827 సెప్టెంబరు 21న యింటికి తెచ్చానన్నాడు. అనువదించడం మొదలెట్టానన్నాడు.

న్యూయార్క్ లో ఒక ప్రాంతమంతా ప్రాచీన మూఢ నమ్మకాలతో కొట్టుమిట్టాడుతున్నది. అక్కడ సమాధులు చాలా వున్నాయి. ప్రాచీన అమెరికా ఆదిమవాసుల అస్థికలు, రాళ్ళు, రాగి, వెండి తవ్వకాలలో బయటపడుతూ వచ్చాయి. అలాంటి చోట స్మిత్ కుటుంబానికి కొంత స్థలం ఉంది. బంగారం కోసం తవ్వేవారు. దివ్యశక్తులున్నాయనేవారు కొల్లలుగా వెలిశారు. ఇజ్రాయల్ లో కనిపించకుండా పోయిన ఒక జాతి కోసం కూడా అక్కడ అన్వేషించడం ఆనవాయితీ అయ్యింది. అదీ స్మిత్ కు లభించిన అవకాశం.

అతడికి లభించిన పవిత్ర రచనల్లో పూర్వపు ప్రవక్తల ప్రవచనాలున్నా యన్నాడు. క్రీ.పూ. 600 ఏళ్ళ క్రితం తరలి వెళ్ళిన నెఫి వంటివారు జెరూసలేం నుండి అమెరికా వచ్చారట. అయితే అ పుస్తకాలు ఎలా వచ్చాయి. అందులో ఏముంది? స్మిత్ ఎవరినీ చూపనన్నాడు. చూసిన వారు చనిపోతారన్నాడు. స్మిత్ బాగా వాదించేవాడు. కాని చదువు రాదు. రాయలేడు. కనుక తన భార్య ఎమ్మా సహాయం కోరాడు. కాని అది సరిపోలేదు. పొరుగున ఉన్న మార్టన్ హారిక్ చేయూత పొందాడు. అతడిని హెచ్చరించి, ప్లేట్లు సూటిగా చూడవద్దనీ, చనిపోతావని బెదిరించాడు. ఒక గదిలో కూర్చొని ప్లేట్లకు బట్ట కప్పి, అవతల వైపు హారిస్ ను కూర్చోబెట్టి, అనువాదాలు మొదలుపెట్టించాడు. ఈ నాటకమంతా హారిస్ భార్య గమనించింది. 116 పేజీలు కాజేసి, అందులో విషయాలు రాయమని స్మిత్ ను రెట్టించి అడిగింది. చదువురాని స్మిత్ నోరెల్లబెట్టి, చేసేదిలేక, దేవుడు తనకు కనిపించి, వేరే వేరే ఫలకాలు అందించాడని, అవి బయటపెట్టాడు. ఎలాగో తిప్పలుబడి అనువాదకుడిని పట్టుకొని రాయించుకున్నాడు. పూర్తి అయిన తరువాతి మూలఫకాలన్నీ స్వర్గానికి వెళ్ళి పోయాయని, దేవుడి దగ్గర భద్రంగా వున్నాయని, మరో కథ అల్లాడు.

జనం అతడు చెప్పేది నిజం అని నమ్మారు. బైబుల్ పూర్వనిబంధనలో ఈసయ్య ప్రకరణం నుండి చాలా భాగం యధాతథంగా కాపీ చేయించాడు. మరికొంత బైబుల్ కొత్త నిబంధన నుండి చేర్పించాడు.

ఎప్పటికప్పుడు తనకు దైవం కనిపించి చెబుతున్నట్లు స్మిత్ అప్పుడప్పుడూ కథలు అల్లాడు. తనతో విభేదించిన వారిని వెలి వేశాడు. తన సెక్స్ అవసరాలకు దివ్యవాణిని అడ్డం పెట్టుకున్నాడు. కథ నడిపించాడు.

న్యూయార్క్ లో పాల్ మైరా ప్రాంతాలలో యిలాంటిని సుప్రసిద్ధంగా కొనసాగాయి. జనాకర్షణ స్మిత్ కు కొట్టిన పిండి. దేవుడు పేర్కొన్న పవిత్ర భూమికి నడిపిస్తానని, మిస్సోరి, ఇలినాయ్, ఉటా రాష్ట్రాలకు యాత్రలు సాగించాడు. అందులో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. అయినా పట్టుదలతో సాగాడు. తాను, తనవారు పవిత్రులైనట్లు, నల్లవారు, దైవ శాపగ్రస్తులైనట్లు చూపాడు. ఆ విధంగా నల్లవారిని బానిసలుగా వాడుకోడాన్ని వెనకేసుకొచ్చాడు. దీనికి బైబుల్ ఆధారాలు చూపాడు. మిస్సోరీలో బానిసత్వాన్ని పోగొట్టాలనే వారిని ఎదిరించాడు. నీగ్రో జాతివారు స్వర్గం నుండి క్రిందకు తోసేయబడిన జాతి అన్నాడు. మార్మోన్ మతంలో నల్లవారికి చోటు పెట్టలేదు. అన్నింటికీ బైబుల్ ఆధారాలు పేర్కొన్నాడు.

మార్మోన్ దేవుడు జోసఫ్ స్మిత్ ***అబ్రహాం బుక్*** అనే శీర్షికన రాసి, లామా పైట్ల సంతతి అంతా దేవుడికి ఎదురు తిరిగినట్లు కనుక మార్మోన్ వారిని నల్లవారిగా శపించినట్లు పేర్కొన్నాడు. దేవుడికి లూసిఫర్ కు జరిగిన పోరాటంలో తటస్థంగా ఒక ముఠా ఉండిపోయిందట. వారందరినీ ఆఫ్రికా నీగ్రోలుగా శపించి పంపించారట. కనుక మోర్మాన్లలో పౌరోహిత్యానికి నల్లవారిని చేర్చుకోలేదు.

మార్మోన్ల అధినేతకు దేవుడు కనిపించకముందే చనిపోయినవారికి, విమోచన ఎలా లభిస్తుంది? అలాంటి వారి జాబితాను మార్మోన్లు ఉటా రాష్ట్రంలో నిరంతరం తయారు చేస్తూ పోతున్నారు. ప్రతివారం ప్రార్థనా సమావేశంలో కొత్త జాబితాలో వారికి ముక్తి ప్రసాదించమని ప్రార్థన చేస్తుంటారు.

మతాన్ని మానవుడు ఎలా సృష్టి స్తాడో యిదొక గొప్ప ఉదాహరణగా స్వీకరించవచ్చు.

## బాలబాబా అవతారం

అమెరికాలో పుట్టుకొచ్చిన ఒక బాలబాబా ఉదంతం మరింత ఆశ్చర్యం వేస్తుంది. 1972లో దీనిపై చక్కని సినిమా వచ్చింది. పేరు మార్జో దీనికి అకాడమీ అవార్డులు వచ్చాయి.

మార్జో గోర్డనర్ 4 ఏళ్ళ పిల్లవాడు. అతడికి తల్లిదండ్రులు క్రైస్తవమతం ప్రకారం పేరుపెట్టినప్పుడు, మేరీ, జోసఫ్ ల పేర్లు కలిపి, మార్జో అని పిలిచారు. అమెరికాలో క్రీస్తు సువార్త కూటమి ప్రభావంతో, తల్లిదండ్రులు తెలివిగా ఒక పథకం వేశారు. మార్జోకి ఒక దేవదూత వేషం వేసి కూర్చోబెట్ట సాగారు. ఫాంటల్ రాయ్ అనే దేవత రూపం అని కథనం అల్లారు. దైవ ప్రేరితుడన్నారు. దేవుడు తనను బోధించమని చెప్పాడని చూడవచ్చిన వారికి చెప్పమన్నారు. జాగ్రత్తగా రిహార్సల్ వేయించారు. 4 ఏళ్ళ పిల్లవాడు కదా. అప్పుడప్పుడు ఏడ్చేవాడు. తల్లి అతన్ని నీళ్ళ పంపు కింద నిలబెట్టేది. లేకుంటే దిండుతో ముఖం మీద అణచిపెట్టి నొక్కేది. ఏదైనా దెబ్బల గుర్తులు పడితే జాగ్రత్తగా తుడిచి కూర్చోబెట్టేవారు. రోజు అలా చేయడంతో ఆరేళ్ళ ప్రాయానికి బాగా అలవాటు పడ్డాడు. వింత బాలుణ్ణి సందర్శించుకోడానికి జనం వచ్చేవారు. అతడి చేత పెళ్ళిళ్ళు కూడా చేయించుకున్నారు. అతడి దివ్యశక్తి దర్శనాల ద్వారా 30 లక్షల డాలర్లు తల్లిదండ్రులు వసూలుచేసుకోగలిగారు. కాని బడికి పంపలేదు. ఆ విధంగా వారి క్రూరత్వంలో 17వ ఏడు వచ్చేవరకూ వున్నాడు.

అప్పుడు ఎదురు తిరిగాడు. అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్ర కౌంటర్ కల్చర్ ముఠాలో చేరి, స్వేచ్ఛగా వూపిరి పీల్చాడు. ఇదంతా ఎప్పుడో ప్రాచీన కాలంలో జరగలేదు. 1960 ప్రాంతాల ఘట్టం యిది.

సినిమా వాళ్ళను పిలిచి, తాను చిన్నప్పుడు ఎలాంటి మోసాలు చేసింది తన ద్వారా తన తల్లిదండ్రులు ఎలా ధనార్జన చేసిందీ పూసగుచ్చినట్టు బయట పెట్టాడు. భక్తి ఆవేశంలో తల్లులు తమ నిధుల్ని ధారపోసిన తీరు, సంగీతంతో పారవశ్యం చేసి, వూగిపోయేట్లు సన్నివేశాలు కల్పించిందీ చూపాడు. క్రైస్తవ ఉజ్జీవ కూటాల దృశ్యాలన్నీ కనబరిచాడు. జీసస్ స్వయంగా తన వద్దకు వచ్చినట్లు నమ్మించాడు. నొసలు పై కనుపించని సిరాతే సిలువ గుర్తు పెట్టి, చమట పోసినప్పుడు అది కనిపిస్తే భక్తులు అద్భుతంగా భావించిన తీరు చెప్పాడు. భక్త జనంలోకి వెళ్లి, వారిని ఏడిపించి, అరిచి పడిపోయేట్లు చేసి, అద్భుత శక్తిగా ప్రదర్శించాడు. ఇవన్నీ సినిమా డైరెక్టరుకు ముందే చెప్పి జాగ్రత్తగా ఫిలింకు తోడ్పడ్డాడు.

అమెరికాలో క్రైస్తవ ఉజ్జీవ కేంద్రాలు, సంకీర్తన సమావేశాలు, ప్రార్థనా కూడళ్ళు చేస్తున్న ఘోరాలు, నేరాలు అన్నీ ***మార్జో*** వెల్లడించాడు.

శ్యామ్యూల్ బట్లర్ తన రచనలో దేవుళ్ళను సృష్టించిన తీరు చక్కగా చెప్పాడు. అతడి రచనలో హిగ్స్ అనే పాత్ర మారుమూల ప్రాంతం నుండి బెలూన్ లో ఆకాశంలోకి ఎగిరి పోతాడు. అది చూచిన జనం అతడిని సూర్య భగవానుడుగా ఆరాధిస్తారు. పురోహితులు బయలుదేరి పూజలు మొదలు పెడతారు. 20 ఏళ్ళ అనంతరం తిరిగి వచ్చిన హిగ్స్, తన పేరిట జరుగుతున్న తంతు చూస్తాడు. అంతా మోసం అని బయట పెడతానంటాడు. ఆయన్ను అలా చేయవద్దని దేశంలో నీతి అంతా ఆ మిథ్య చుట్టూ వున్నదని, అతను స్వర్గానికి ఎగరలేదని తెలిస్తే, జనం దుర్మార్గులౌతారని హెచ్చరిస్తారు.

థామస్ హాబ్స్ సుప్రసిద్ధ రచన లెవిథియన్ చదవమని కోరుతున్నాను. 1651లో యీ అద్భుత రచన చేశాడు. బైబుల్ లో ఆదాం పతనమైన కథ చర్చించాడు. స్వేచ్ఛా పూరితుడిని సృష్టించి, ఆచరించడానికి వీల్లేని నిబంధనలు పెట్టిన విధానం ఎండగట్టాడు. పాపం చేసినందుకు ఆదాంకు మరణ శిక్ష విధించినా, సంతానాభివృద్ధి కోసం అది అమలు జరపకుండా

వాయిదావేసినట్లున్నదన్నాడు. ఒక చెట్టు పండు తింటే శాశ్వతంగా వుంటావని, మరోచెట్టు పండు తింటే చస్తావని చెప్పిన వైరుధ్యాలను చర్చించాడు. తృప్తినిచ్చే మతాల్ని సృష్టించడం మానవులకు ఆనవాయితీ అయిందన్నాడు. చనిపోయిన తరువాత కూడా జీవితం వుందనుకుందాం. కాని దేవుడు లేడనుకుందాం. అప్పుడేమవుతుంది. దేవుడున్నా డనుకోండి. కాని మరణానంతరం జీవితం లేదనుకోండి. అప్పుడు స్థితి ఏమిటి ఇలాంటివి బాగా హబ్స్ చర్చించాడు.

(లెవిథియన్ 3వ భాగం, 18వ అధ్యాయం, 4వ భాగం, 44వ అధ్యాయం చదవండి.)

# అధ్యాయం – 12

# ఏరీ ఆ దేవుళ్ళు ?
# ఎక్కడ ఆ మతాలు ?

ఒకప్పుడు జనాన్ని భయపెట్టి పూజలు, కానుకలు అందుకొన్న దేవుళ్ళు కొందరు నేడు నామ రూపాలు లేకుండా పోయారు.

గ్రీక్ దేవుడు పాన్ గొర్రెల కాపర్లకు ఆరాధ్య దైవం ఇప్పుడు తలచుకునేవారే లేరు. ఈజిప్టును పాతాళ లోక దేవుడుగా పాలించిన ఒసిరిస్ ను యిప్పుడు వెతక వలసి వస్తున్నది. మతాలు, మతోద్యమాలు, దేవుళ్ళు, దేవతలు ఆ విధంగా పుట్టిగిట్టినవి చాలా ఉన్నాయి.

దైవ దూతలమని, ప్రవక్తలమని బయలుదేరిన కొందరి పరిస్థితి కూడా అలాగే పరిణమించింది.

యూదులకు పూర్వ బైబుల్ నిబంధన ననుసరించి నమ్మకాలు ఎక్కువ. ఎవరో రక్షకుడు వస్తాడని వారు ఎదురు చూస్తూ వుంటారు. ***నేనే ఆ రక్షకుడిని*** అంటూ 17వ శతాబ్దం మధ్యలో ఒకతను బయటకొచ్చాడు. అతని పేరు సబతే సెవి. ఇంకేముంది మధ్యధరా సముద్ర తీరాల నుండి, పోలండ్, ఆమ్ స్టర్ డాం, హాంబర్గ్ వరకూ యూదులు వెంటబడ్డారు. సబతిని వీరారాధన చేశారు. అప్పుడు సుప్రసిద్ధ తత్వవేత్త స్పినోజా వ్యక్తిగత దేవుణ్ణి కాదనాలని రాశాడు. అతడిని ఖండిస్తూ, సబతి యాత్ర చేసి యూదుల్ని ఆకట్టుకున్నాడు.

ప్రవాసంలో ఉన్న యూదుల్ని పవిత్ర ఇజ్రాయల్ కు తీసుకెళతానన్నాడు. విశ్వశాంతి నెలకొల్పుతానన్నాడు. కాబ్ల అధ్యయనం చేసి, దాని ఆధారంగా తానే రక్షకుడిని అన్నాడు. కాన్ స్టాంట్ నోపుల్, అలెప్పొ, స్మిర్న, సలోనికా ప్రాంతాలలో యూదులు భక్తి కూటాలుగా అతడికి బ్రహ్మరథం పట్టారు. జెరూసలేంలో యూదు పురోహితులు (రబైలు) అప్పుడే రక్షకుడు వచ్చాడంటే నమ్మలేదు.

సబతి రక్షకుడిని అనుసరించకపోతే, నరకప్రాప్తి తప్పదని అతడి శిష్యులు హెచ్చరించారు. గాజ రాబై నాథన్ అతడిని సువార్త రాసిన జాన్ తో పోల్చాడు. సబతి అంటే గిట్టని వారు అతడు మూర్ఛ రోగి అన్నారు. వారిని రాళ్ళతో కొట్టారు. పరస్పర దూషణలకు దిగారు. కాన్ స్టాంటినోపుల్ కు ఓడలో బయలుదేరి, తాను రక్షకుడినని ప్రకటిద్దామనుకున్నాడు. అతడి ఓడ తుఫాన్ లో చిక్కుకోగా టర్కీవారు అతడిని బంధించి, జైల్లో పెట్టారు. అప్పటికే అతడిని నమ్ముకున్న యూదులు కొన్నిచోట్ల యావదాస్తులు అమ్మి అప్పగించారు కూడా.

టర్కీ పాలకులు అల్పసంఖ్యాకులను దారికి తెచ్చే రీతులు అనుసరిస్తూ పోయారు. సబతి తానే రక్షకుడిని అని చెప్పకోవడం టర్కీ పాలకులకు సమస్యగా పరిణమించింది. ఏమైతేనేం జైల్లో పెట్టారు. అతడిని వురితీస్తే, అనుచరులు మరొక మతాన్ని అతడిపేర స్థాపిస్తారనీ, అనవసరంగా అతడిని పెంచిన వారమౌతామనీ భావించారు.

ఈలోగా సబతి మాజీ శిష్యుడు నెహిమియా కోహెన్ బయటపడి, తన గురువు అవినీతి పరుడని అతడు చెప్పేదంతా అబద్ధమని ప్రకటించాడు. సబతిని కోర్టులో నిలబెట్టి రక్షకుడుగా అద్భుతాలు చూపితే సరేసరి. లేకుంటే ముస్లింగా మారితే, వదిలేస్తాం అన్నారు. రక్షకుడనని ప్రగల్బాలు పలికిన సబతి, ముస్లింగా మారిపోయాడు. అంతటితో అతడిని అల్బేనియా మాంటనిగ్రో సరిహద్దు ప్రాంతాలకు పంపేశారు. 1676లో ఆ ప్రాంతాలలో సబతి చనిపోయాడు. ఎక్కడ పాతిపెట్టారో కూడా అంతుపట్టలేదు.

సబతి శిష్యులు చీలిపోయారు. అతడు కేవలం ముస్లింగా మారినట్లు నటించాడని కొందరన్నారు. పెద్ద సంరక్షకుడుగా మారడానికే అలా చేశాడన్నారు. స్వర్గానికి వెళ్ళాడన్నారు. అసలు అతడు చనిపోలేదని, తమకు కనిపించకుండా వున్నాడని మరికొందరు నమ్మారు.

టర్కీలో నేటికీ కొద్దిమంది సబతి అనుచరులు డోన్మె అనే పేరిట కొనసాగుతున్నారు. వీరుపైకి ముస్లింలు, లోన యూదులు.

యూదులు యింకా రక్షకుడు ఎవరో వస్తారని ఎదురుచూస్తూనే వున్నారు.

మొత్తం మీద చూస్తే చరిత్ర నిండా ఎందరో సంరక్షకులు, దేవుళ్ళు వస్తూపోతూన్నారనేది స్పష్టం.

-----

# అధ్యాయం – 13

# మతంలో నీతి వుంటుందా ?

వలస పాలన నుండి భారత దేశం బయటపడింది. ఆ పోరాటంలో మత విశ్వాసాలకూ, నైతిక రీతులకూ ముడిపెట్టిన వారున్నారు.

మొదటి ప్రపంచ యుద్ధంతో బ్రిటిష్ సామ్రాజ్యం జవసత్వాలు వుడిగి పోయింది. 1919 ఏప్రిల్లో నిరసనదారులపై అమృత్ సర్ లో జరిగిన అమానుష హత్యాకాండతో, లండన్ నుండి పరిపాలించడం ఆట్టేకాలం సాగదని స్పష్టపడింది. అదెప్పుడు అనేది తప్ప మరో సందేహానికి తావు లేదు. అటువంటి దశలోనే సహాయనిరాకరణోద్యమం మోహన్ దాస్ కరమ్ చంద్ గాంధి చేపట్టగలిగాడు. ఆయన హిందువుల నాయకుడుగా మహాత్ముడనిపించుకున్నాడు. ఆయన చిత్తశుద్ధిలో లోపం లేదు. ఎటొచ్చి గాంధి మత భావాలే అంత వివేచనాత్మకం కాదు. భారత దేశం ఆధ్యాత్మిక ఆదిమ సమాజంలో నడచి, గ్రామాధిపత్యంతో సాగాలన్నాడు. ముస్లింలతో అధికారం పంచుకోవడం గాంధీ విధానాలలో కుదిరేపని కాదు. అవసరమైతే హింస ప్రయోగించే ధోరణి కూడా ఆయనలో వ్యక్తమైంది.

భారత స్వాతంత్రానికీ దేశ ఐక్యతకూ సంబంధం వుంది. బ్రిటిష్ వారు పరిపాలించిన దేశం. అవే ఎల్లలతో, భూభాగాలతో వుండాలా? భారత్ అనే పిలవాలా? అంటే కొందరు ముస్లింలు కాదన్నారు. బ్రిటిష్ పాలనలో అల్పసంఖ్యాకులుగా ముస్లింలు రక్షణలు అనుభవించారు. హిందువుల ఆధిపత్యంలో ఆవిధంగా సాగడానికి ముస్లింలు యిష్టపడలేదు. ఏమైనా ముస్లింలు విధ్వంసక పాత్ర నిర్వహించేవారే. గాంధీ మాట్లాడే హిందూయిజం కారణంగా కాంగ్రెస్ లో వున్న ముస్లింలను ముస్లిం లీగ్ లో చేర్చుకొనడానికి సానుకూలత ఏర్పడింది. ఒకవైపు రాట్నంలో, మరోపక్క హిందూ ధర్మంతో గాంధీ ధోరణి ముస్లింలీగ్ కు తోడ్పడింది. భారత పతాకంపై రాట్నం గుర్తు పెట్టారు. ఆధునికతను గాంధీ నిరాకరిస్తున్నాడనడానికి యిదొక సంకేతం. ముతక ఖద్దరు వడికి ధరించడం, చెప్పులు, కర్రతో సాంకేతికతను, ఆధునిక యంత్రీకరణను గాంధీ నిరాకరించాడు. భారత గ్రామీణ వ్యవస్తను పారవశ్యంతో పొగిడాడు. పశువులు, పంటలు గమనిస్తే కోట్లాది ప్రజలు ఎలా జీవించారో తెలుస్తుంది. గాంధీ సలహా పాటిస్తే అనేకమంది ఆకలి చావుకు గురయ్యేవారే. గోపూజ చేస్తూ గడిపేవారే. కరువు కాటకాలలో సైతం గోవుల్ని చంపరాదంటూ అలమటించేవారే. హిందువులలోని కొన్ని అమానుష విషయాల్ని, ముఖ్యంగా అంటరానితనాన్ని గాంధీజీ ఖండించడాన్ని మెచ్చుకోవాలి. ఇండియాకు సెక్యులర్ ఆధునిక, వివేచనాత్మక నాయకత్వం కావలసి వచ్చినప్పుడు ఆ స్థానంలో గాంధీ వుండడం దురదృష్టకరం. 1941లో యీ విషయం బాగా వెల్లడైంది. సామ్రాజ్యవాద జపాన్, బర్మా, మలయాలను కబళించి, భారత సరిహద్దులకు చేరింది. అంతటితో బ్రిటీషు రాజ్యానికి స్వస్తి పలకనున్నదని భావించిన గాంధీ క్విట్ ఇండియా నినాదం ఇచ్చాడు. దేశాన్ని దేవుడికి వదిలేయాలని, లేదా అరాచకానికి విడిచి పెట్టాలన్నాడు. భారతీయులు చేయవలసిన పోరాటాన్ని జపాన్ వారికి వదలి వేయడం పెద్ద తప్పు.

ఒకవైపు దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయం దగ్గర పడుతుండగా, మంత్రి వర్గాల్ని వదిలేసిన పద్ధతికూడా పెద్ద తప్పు. మరోపక్క ముస్లింలు పదవులకు అంటిపెట్టుకొని బాగా బేరసారాలు ఆడగలిగారు. దేశాన్ని ముక్కలు చేయడాన్ని ఆపలేకపోయారు. పశ్చిమ పంజాబ్, తూర్పు బెంగాల్ కోల్పోయారు. దాని దారుణ ఫలితాలు నేటికీ కొనసాగుతున్నాయ్. ముస్లింలే తోటి ముస్లింలపై దాడి చేశారు. బంగ్లాదేశ్ లో అది స్పష్టం. దేశంలో తీవ్రవాద హిందూ పార్టీలు వచ్చాయి. కాశ్మీర్ సమస్య చివరకు అణు యుద్ధం దాకా లాగేట్టున్నది.

నెహ్రూ, రాజగోపాలాచారి మరోవైపు మార్గాంతరాలు చూపారు. ఫాసిజానికి వ్యతిరేకంగా, మిత్ర రాజ్యాల సమైక్యత కోరారు. వాస్తవానికి దేశాన్ని స్వాతంత్ర్యంలోకి నడిపించిన ఖ్యాతి నెహ్రూదే. బ్రిటిష్ వారితో, సెక్యులరిస్ట్ లతో, వామపక్షాలతో దేశ విమోచనకు నెహ్రూ కృషి జరిపారు. దేశంపై తిరోగమన ధోరణి చూపాల్సిన ఆవశ్యకత లేదు. చివరకు మూర్ఖపు హిందువుల చేతిలో హత్యకు గురైన గాంధీ, జీవించి వుంటే, దేశానికి ఆయన తెచ్చిపెట్టిన నష్టం ఎలాంటిదో కళ్ళారా చూచేవాడు. ఇదంతా మత ధోరణి పుణ్యమే.

ఏమీ చేయలేక నిర్వీర్యంగా వున్నప్పుడు మతాన్ని శరణు వేడడం మానవ బలహీనతలలో ఒకటి.

మత విశ్వాసం లేకుంటే ఏమౌతుంది? స్వార్థం, విచ్చలవిడితనం విజృంభించదా? దేవుడిలో నమ్మకం లేకుంటే, ఇక దేన్నీ నమ్మరుగదా? ఇలాంటి వాదనలు వినిపిస్తుంటాయి.

కాని దేవునిలో నమ్మకం ఉన్నవారి ప్రవర్తన అడుగడుగునా ప్రశ్నార్థకమే. దేవుడిలో నమ్మకం వుంచి పనులు చేయడమంటే ఏదైనా చేయవచ్చు ననుకోవడమే. గుడ్డి నమ్మకాన్ని తృణీకరించి సాగిపోవడమంటే, మనిషి సత్తాపై, వివేచన పై ఆధారపడడమే.

దేవునిలో నమ్మకంగల వారిచ్చిన కట్నాలు, కానుకలు, సంపద కొల్ల గొడుతున్నవారు, బాగా దైవ నమ్మిక గలవారే. కనుక దైవ నమ్మిక వివేచనకు, సత్ప్రవర్తనకూ దారి తీస్తుందనడం సరైన ఆలోచన కాదు.

లైంగిక విషయాల్ని, కామాన్ని గురించి, నీతులు చెప్పే పురోహితులు, స్వయంగా కామచర్యలకు పాల్పడుతున్నారు. వారికి దైవంపట్ల నమ్మిక లేక కాదు. సెక్స్ ను అణచుకోమని చెబుతూనే, వారే కామక్రీడలు చేస్తున్నారు. క్రైస్తవ పురోహితులు పట్టుబడిన కేసులు కొల్లలుగా వున్నాయి. అలాగే బాబాలు కూడా.

అమెరికా సుప్రసిద్ధ నాస్తికుడు, హేతువాది రాబర్ట్ ఇంగర్ సాల్ గొప్పదాత. ఉదారంగా విరాళాలు యివ్వడం, ఎందరికో సహాయ పడడం ఆశ్చర్యం గొలుపుతుంది. అతడికి భక్తి లేదు. గుడ్డి నమ్మకాలు లేవు. మానవత్వం వుంది. కనుక వివేచనాత్మక జీవితానికి భక్తి, అంధవిశ్వాసం అడ్డు కాదని చూపాడు.

మరోపక్క భక్తులు, దైవప్రేరితులు ఎందరో ఫాసిజాన్ని, నాజీ దుర్మార్గాలను వెనకేసుకొచ్చారు. పోప్ సమర్థించాడు. హిట్లర్ను పొగిడి ఆకాశానికి ఎత్తారు. వారంతా రచనలు చేసేవారు. నోరు తెరిస్తే, దైవ స్మరణ చేస్తూ కిరాతక చర్యలు చేశారు. భక్తికీ నీతికీ సంబంధం లేదని రుజువు చేశారు.

ఒకసారి నా భార్య వాషింగ్టన్ లో టాక్సీలో ఇంటికి వస్తూ తన పర్సు సీటు మీద పెట్టి మరచిపోయింది. అందులో డబ్బున్నది. ఆ తరువాత టాక్సీ డ్రైవర్ వెతుక్కుంటూ వచ్చి, పర్సు తిరిగి యిచ్చేశాడు. అతడు సూడాన్ దేశ ముస్లిం. అతనికి కృతజ్ఞతతో కొంత పారితోషికం యివ్వబోగా, తీసుకోలేదు. అది తన ధర్మంగా భావించి చేసిన కర్తవ్యం అన్నాడు. అలాంటి వారుంటే కొరాన్ లో ఏమి రాశారనేది పట్టించుకోనక్కరలేదు.

డెన్మార్క్ లో ఒక పత్రిక ముస్లిం ప్రవక్తపై కార్టూన్లు వేసిందని ఎక్కడెక్కడో ముస్లింలు హింసాయుత చర్యలకు పాల్పడ్డారు. నేను డెన్మార్క్ పత్రిక కార్టూనిస్టు స్వేచ్ఛను వెనకేసుకొచ్చానని బెదిరింపు ఫోన్లు చేశారు. నా కుటుంబాన్ని చంపుతామన్నారు. అందులో మత నీతి ఏమిటో చూడండి.

సూడాన్ లో దార్ ఫర్ రాష్ట్రంలో ముస్లింలు చంపేస్తున్నదెవర్ని అనుకున్నారు? అరబ్బులు కాని ముస్లింలను, ఆఫ్రికన్ ముస్లింలు అంటరాని వారని అరబ్ ముస్లింల ఉద్దేశం. ఇదంతా మత నీతి.

ఆఫ్రికాలోని రవాండాలో అమానుష హత్యాకాండ 1992 నుండీ సాగింది. హుటూలు తీవ్రవాదులుగా శిక్షణ పొంది టూట్సిలను చంపారు. ఇరు జాతులు క్రైస్తవులే మరి. టూట్సిలు చర్చిలలో దాక్కున్నారు. అక్కడైతే, దైవ గృహాలుగా సురక్షితం అని భ్రమించారు. కాని హుట్సులకు అది సానుకూలమైంది. వెతుక్కోనవసరము లేకుండా ఒకేచోట 1994లో సామూహిక హత్యాకాండ జరిపారు. వీరంతా కేథలిక్కులు. వీరికి అండగా నిలిచింది. పోప్. అంతా మతనీతి. పోప్ జాన్ 2వ పాల్ లోగడ కేథలిక్కులు చేసిన పాపాలకు గాను యూదులకు, ముస్లింలకు క్షమాపణ చెప్పాడు. గొప్ప మార్పు అని లోకం తలపోసింది. కాని సమకాలీనంగా జరిగిన రవాండా హత్యాకాండకు ఏమీ జవాబు దారీ లేదు. అదీ మతం పాటించే దమన నీతి.

బైబుల్ ప్రకారం నల్ల జాతివారిని సమర్థించడానికి వీల్లేదని, క్రైస్తవమత ప్రచారకుడు ప్యాట్ రాబర్ట్ సన్ అన్నాడు. అమెరికాలో నీగ్రో వారిని బానిసలుగా చూడడం, బైబుల్ నీతిగా సమర్థించుకున్నాడు. థామస్ పెయిన్ వంటి వివేచనాత్మక చింతనాపరులు వచ్చి, హెచ్చరించిన తరువాత, ఆ ప్రభావంతో అబ్రహాం లింకన్ వంటి వారు మారారు.

బైబుల్ పేరిట నల్ల జాతిని అణగదొక్కుతుండగా, ఎదురు తిరిగి, పౌరహక్కుల కోసం డా.మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పోరాడి బలయ్యాడుగదా. అమెరికాలో మానవవాదులు మానవ స్వేచ్ఛకు, సమానత్వానికి నిలిచారు.

కొరాన్ పేరిట ఘాతుకాలు చేసినవారు చరిత్రలో చాలామంది వున్నారు. ఖుర్దు సున్నీలను మూకుమ్మడిగా చంపించిన ఇరాక్ నేత సద్దాం హుస్సేన్ తన చర్య సమర్థించుకోడానికి కొరాన్ లో 8వ సురాను చూపాడు.

మతపరంగా మానవ నీతి లేదు. మనుషులు సొంతంగా ఆలోచించి, నీతిగా, రీతిగా, సహకారంతో బ్రతకగలరు.

-----

# అధ్యాయం – 14

# కామిగానివాడు మోక్షగామి కాడయా

పూనా నగర శివార్లలో భగవాన్ రజనీష్ ఆశ్రమం వుంది. పాశ్చాత్య దేశాలవారు కొందరు తూర్పుకు తిరిగి, మనశ్శాంతి కోసం వస్తున్నారు. నేను రజనీష్ ఆశ్రమంలోకి వెళ్ళాను. బిబిసి వారికోసం అశ్రమ డాక్యుమెంటరీ తీస్తుంటే నేను కూడా సన్యాసి వేషంలో వెళ్ళి, అక్కడి వారిలో కలసిపోయాను. ఆ విధంగా సినిమా తీయడానికి సులువైన వాతావరణం కల్పించు కున్నాను.

భగవాన్ శ్రీ రజనీష్ (1990 లో చనిపోయారు.) పెద్ద కళ్ళతో ఆకర్షణీయంగా చిరునవ్వులు కురిపిస్తాడు. కొన్ని మురికి జోక్స్ వేస్తుంటాడు. పొద్దున్నే దర్శనం కోసం వచ్చే భక్తుల నిమిత్తం మైక్రోఫోన్ లో మాట్లాడుతాడు. అది సమ్మోహనంగా పనిచేస్తుంది.

భగవాన్ చెంత పద్మాసనంలో వినమ్రంగా వినడానికి కూర్చుంటారు. లోనకు వచ్చే వారంతా, చెప్పులు బయట వదలి రావాలంటారు. అందుకే కుప్పలుగా చెప్పులు బయటపడి ఉంటాయి. అలోచన లేనివారికి భగవాన్ ప్రవచనాలు వినిపిస్తాడు.

అదంతా ఆధ్యాత్మిక ప్రశాంతత నిచ్చేదిగా, అభివర్ణిస్తారు. సెట్టింగులన్నీ ప్రేరణాత్మకంగా ఆకట్టకునేట్లు అమర్చారు. మనస్సు వికటించినవారు, కలత చెందినవారు, సలహాకు, శాంతికి అక్కడకు వస్తారు. అలా వచ్చిన వారిని, యిహలోక సంపదలు వుంచుకోరాదని, ఆశ్రమానికి దానం చేయమంటారు. ఆ విధంగా చాలా సంపద సమకూరింది. భగవాన్ కి చాలా రోల్స్ రాయిస్ కార్లు కూడా అలానే వచ్చాయి. ప్రపంచంలో ఏ ఒక్కరికీ లేనన్ని కార్లు, రజనీష్ కు వచ్చాయి. భక్తులందరినీ ముఠాలుగా విభజించి ఆధ్యాత్మిక వ్యాపారం సాగిస్తారు.

ఆశ్రమంలో జరుగుతున్న కామక్రీడను, కుండలినీ తంత్రాన్ని ***ఆశ్రమం*** అనే 83 నిమిషాల డాక్యుమెంటరీగా తీశారు. వుల్ఫ్ గాంగ్ డొబ్రోవల్నీ. యిది రజనీష్ అమెరికా పారిపోకముందు తీశాడు. అందులో నుండి కొన్ని సన్నివేశాలు నేను స్వీకరించాను.

ఒక యువతి బట్టలు విప్పి, భక్తులు ఆమె చుట్టూ డాన్స్ చేస్తారు. ఆమె శారీరక లోపాల్ని, మానసిక రీతుల్ని చెబుతూ పోతారు. ఆమె కళ్ళ నీళ్ళ పర్యంతమై, క్షమాపణ కోరుతుంది. అప్పుడు అమెను కౌగలించుకుంటారు. ఆమె కూడా తమ బృందంలో సభ్యురాలేనంటారు. ఎక్కిళ్ళు పెడుతూ అమె బృందంలో చేరుతుంది. ఇంకేమి చేస్తే ఆమె వస్త్రాలు తిరిగి ఇస్తారో తెలియదు. ఇంకొన్ని చోట్ల ఎముకలు విరిగేటట్లు హింసించడం కద్దు. అలా అదృశ్యమైన వారిలో విడ్సార్ ఫ్రెన్స్ జర్మనీ వాసి ఉన్నారు.

భగవాన్‌కు ఏవో ఎలర్జీలు ఉన్నాయని నాతో చెప్పారు. కొన్నాళ్ళకు ఆయన ఆశ్రమం వదలి వెళ్ళిపోయారు. రోల్స్ రాయిస్ కార్లు ఏమయ్యాయో తెలియదు. 1983లో అమెరికాలోని ఆరిగాన్ చెంత ఆంటిలోప్ నగరంలో భగవాన్ శిష్యులు చేరారు. ఆశ్రమం వెలిసింది. పెద్ద ప్రాంగణం నిర్మించారు. భగవాన్ పేరిట ఒక పవిత్ర పత్రిక నడిపారు. దారితప్పిన భక్తులు చేసేది లేక అలా వుండిపోయారు. క్రమేణా ఆ వూరివారి తీవ్ర అభ్యంతరాల మధ్య, ఆశ్రమవాసులు కనిపించకుండా పోయారు. భగవాన్ అనంత లోకాలలో కలసి పోయాడు. ఇదీ చివరకు రజనీష్ యిచ్చిన ముక్తి. పశ్చిమ దేశాలలో మనశ్శాంతి లేక, తూర్పు దేశాలకు వచ్చిన వారి పరిస్థితి చెప్పనక్కరలేదు. (రజనీష్ అసలు పేరు చంద్రమోహన్ జైన్).

## బౌద్ధంలో శాంతి లభిస్తుందా

విశ్వంలో అన్నిటా నేను కలిసిపోయేట్లు చూడమని బౌద్ధులు ప్రార్థిస్తారు. బండి మీద రొట్టెలు అమ్ముకునేవాడి చేతిలో వంద రూపాయల నోటు పెట్టి, రొట్టె తీసుకొని, చిల్లరకోసం ఒక బౌద్ధ భిక్కు ఎదురు చూచాడట. ఎంతసేపటికీ బండివాడు చిల్లర ఇవ్వక పోయేసరికి, బౌద్ధ భిక్షువు ఛేంజ్ అడిగాడట. అందుకు అతడు జవాబిస్తూ, ఛేంజ్ మనస్సులో నుండి రావాలి స్వామీ అన్నాడట.

పాశ్చాత్య లోకంలో భౌతిక సుఖాల కోసం అర్రులు చాస్తున్నారంటూ, మానసిక శాంతి కోసం తూర్పు దేశాలకు కొందరు తరలి వస్తున్నారు. వారిలో కొందరు బౌద్ధాన్ని ఆశ్రయిస్తున్నారు. అలాంటి ఆకర్షణలలో శ్రీలంక బౌద్ధం ఒకటి. అక్కడి ప్రజలు ఉదారులు. దాతృత్వంగలవారు. వారిని తప్పు పట్టలేం. కాని నేడు శ్రీలంక హింసతో, అణచివేతతో సతమతమవుతున్నది. బౌద్ధులు, హిందువులు నిత్యమూ కొట్లాడుతున్నారు. శ్రీలంక అంటే పవిత్ర ద్వీపం అని అర్థం. అక్కడ తమిళులు, హిందువులు, వారిని వేరువేరుగా చూడడం వలన, తమను యీలం అని పిలుచుకుంటున్నారు. ఉభయుల మధ్య మతపరంగా కొట్లాటలు సాగుతున్నాయి.

తమిళులకు ప్రభుత్వంపై ఆరోపణ వుండడం సబబుగా వుంది. కాని, ముస్లిం ఆల్ ఖైదా, పాలస్తీనా హెజ్ బుల్లాలకు ముందే వీరు ఆత్మాహుతి దళాల్ని సిద్ధం చేసి, గెరిల్లా పోరాటాలకు దిగారు. వారనుసరించే పద్ధతి ఆటవికమైనది. ఆ విధానంలోనే భారత ప్రధాని రాజీవ్ గాంధీని చంపారు. శ్రీలంక అధ్యక్షుణ్ణి హతమార్చారు. మరోపక్క తమిళులపై బౌద్ధులు చేస్తున్న హింసాకాండ బుద్ధిజాన్ని సమర్థించదు.

బౌద్ధులు, హిందువులు పరపీడన పరాయణులుగా, హత్యాకారులుగా మారడం ఆశ్చర్యం గొలుపుతుంది. ఒకవైపు శాకాహారాన్ని, మరోపక్క ధ్యానం ఆచరిస్తున్నామంటూ యిలాంటి ఘాతుకాలకు ఎలా దిగుతున్నారు. బౌద్ధం మతమే కాదని వాదిస్తారు. బుద్ధుడి పన్ను ఒకటి లభించిందని అట్టిపెట్టి, శ్రీలంకలో ఆరాధిస్తున్నారు. కాని హింస మాత్రం చెలరేగుతూనే వుంది.

టిబెట్ వెళ్ళి చూస్తే వేరే దృశ్యం కనిపిస్తుంది. అనంత విశ్వంతో, ప్రకృతితో లీనం అవుతున్నట్లు ఆ దేశం వుంటుంది. అక్కడ దలైలామాను గుర్తించడం సులభం. టిబెట్ ను చైనా ఆధిపత్యం నుండి తప్పించి, స్వతంత్రంగా వుంచాలని కోరుకోవడం సబబే. కాని దలైలామా వంశపారంపర్య ప్రభువు. అతడిని దైవం నియమించిందన్నారు. అలా చెబితే తిరుగులేదు. అతనితో విభేదించిన శాఖల్ని నలుచుక తింటున్నారు. దలైలామా ఏకఛత్రాధిపత్యం తిరుగులేనిదన్నమాట. సెక్స్ గురించి, ఆహార నియమాల గురించీ విడ్డూర ప్రకటనలు చేస్తుంటాడు. దలైలామా అమెరికాలో హాలివుడ్ కు వెళ్ళి నిధులు వసూలు కార్యక్రమం తలపెట్టాడు. స్టీవెన్ సెగల్, రిచర్డ్ గీర్ వంటివారిని పవిత్రులుగా ముద్రవేసి, నిధులు స్వీకరించేవాడు. బౌద్ధ పవిత్రుల్ని చేయడానికి వేలం పాట పెట్టారు.

ఎవరైనా టిబెట్ వెళ్ళి చూస్తే, ఫ్యూడల్ ఆధిపత్యంపట్ల దిగ్భ్రమ చెందుతారు. అమానుష శిక్షలను యీసడించుకుంటారు. బౌద్ధ ఆరామాలలో శాశ్వత కట్టు బానిసలుగా అట్టి పెట్టే రీతులు జుగుప్సాకరంగా వుంటాయి. బయట ప్రపంచానికి దలైలామా ఎంత ఆకర్షణీయమైనా అసలు సంగతి అది.

## *ఇక జపాన్ బౌద్ధం చూడండి*

జపాన్ బౌద్ధుడు ***గుడో*** అందరిలోనూ బౌద్ధ స్వభావం

వుందన్నాడు. ధర్మంలో హెచ్చుతగ్గులు లేవనీ, అందరూ సమానం అన్నాడు. మానవులంతా తన బిడ్డలేనంటూ, అదంతా సోషలిస్టు సూత్రాలలో వుంది. గనుక, తాను సోషలిజాన్ని నమ్ముతున్నానన్నాడు. గుడో సూత్రీకరణ సరైన దేగాని, ప్రత్యేక సందర్భాలకు అది వర్తించదని జపాన్ బౌద్ధులు భావించారని ***జెన్ ఎట్ వార్*** అనే పుస్తకంలో బ్రయల్ విక్టోరియా రాశారు.

విక్టోరియా తనను బౌద్ధ భిక్షువుగా చెప్పుకున్నాడు. అతనికి జపాన్ గురించి బాగా తెలుసు. జపాన్ బౌద్ధం సామ్రాజ్యవాదాన్ని కోరిందని, సామూహిక హత్యాకాండ జరిపిందని చూపాడు. 1938లో నిచిరెన్ అనే బౌద్ధ శాఖ సామ్రాజ్యవాద బౌద్ధానికి కట్టుబడినట్లు ప్రకటించింది. పద్మాసన సూత్రం ప్రకారం జపాన్ సామ్రాజ్యవాద బౌద్ధం, జాతీయ విధానాన్ని బయట పెడుతుందన్నారు. అటు సామ్రాజ్యం యిటు బౌద్ధం కలయిక అంటే, అదేనని నిచిరెన్ బౌద్ధ రుషి ఉద్దేశ్యం అన్నారు. జపాన్ సామ్రాజ్యవాద బౌద్ధం ఆరాధించేది. భారతదేశంలో బౌద్ధ శాక్యమునిని కాదనీ, జపాన్ ప్రభువును మాత్రమే అవుననీ అన్నారు. అతడి పారంపర్యత 10వేల తరాలవరకు విస్తరిస్తుందన్నారు. ఇటువంటి ప్రకటనలు విమర్శకు అతీతం. ఇది కేవలం విశ్వాసం. (దలైలామా కూడా సామ్రాజ్యవాద మూకుమ్మడి హత్యల్ని ఖండిస్తూనే, భారత ప్రభుత్వ అణ్వస్త్ర పరీక్షల్ని వెనకేసుకొచ్చాడు.)

బుద్ధుడి లోటస్ సూత్రాన్ని గురించి చేసే ప్రకటనలకు సాక్ష్యాలు, వివేచన వుండదు.

జపాన్ లో సైనికాధికారులు జెన్ బౌద్ధుల్ని పూర్తిగా లొంగదీసు కున్నారు, చైనా రణరంగంగా మార్చారు. జపాన్ బౌద్ధ శాఖలన్నీ సైనికుల చర్యల్ని సమర్థించాయి.

ఆసియా విమోచనకు జపాన్ సైనికులు కంకణం కట్టుకున్నారని,  షింటో మతం కూడా భావించింది. యాసుకుని ప్రాంతంలో భయానక హత్యాకాండ జరిగింది. అక్కడకు ఏటా వెళ్ళి జోహార్లు అర్పించే విషయమై వివాదం కొనసాగుతూనే వుంది. నాజీలతో, ఫాసిస్టులతో కలసి జపాన్ పోరాడడం, స్వేచ్ఛాపూరిత మత విధానంగా జపాన్ బౌద్ధులు భావించారు.

తూర్పు ఆసియాలో శాశ్వత శాంతి కోసం, బౌద్ధం రీత్యా, ఎక్కువమంది కోసం కొందరిని చంపడాన్ని అంగీకరిస్తున్నా మన్నారు. అదే మహాయాన బౌద్ధం అన్నారు.

రెండవ ప్రపంచ యుద్ధంలో బౌద్ధ, షింటో భిక్షువులు ఆత్మాహుతి దళాల్ని చేర్చి, శిక్షణ యిచ్చారు. బుద్ధుడి నాలుగు సూత్రాలు, తథాగతుడి విధానాలు జపాన్ చక్రవర్తి ఆచరిస్తున్నా డన్నారు. చావు బ్రతుకుల్ని జైన్ బౌద్ధం ఒకే తీరులో చూస్తుందన్నారు.

విశ్వాసం ఎంత భయంకరమైందో తెలుసుకోవచ్చు.

ఆనాడు బౌద్ధం పేరిట చెప్పిందంతా దోషమని ఎవరూ ముందుకొచ్చి అనలేదు. అదే బౌద్ధుల లోపం. స్వీయ విమర్శకు బౌద్ధం అనర్హం. జీవితానికి విలువ యివ్వని తత్వం అలాంటి పని చేబట్ట జాలదు. నిర్వాణం కోసం వువ్విళ్ళూరేవారు జాగ్రత్త వహించాలి. ఆలోచన స్తంభింపజేయమనే బౌద్ధం ప్రమాదకరం.

-----

## అధ్యాయం – 15

# పాపాలకు జన్మ యిచ్చిందెవరు ?

అబ్రహాం పాత్ర బైబుల్ లో సుప్రసిద్ధం. యూదులు, క్రైస్తవులు, ముస్లింలు అబ్రహాంను తమ వాడేనంటున్నారు.

అబ్రహాం ఏంచేశాడు? తన కుమారుడిని దేవునికి బలి ఇవ్వడానికి కొండపైకి తీసుకెళ్ళాడు. కత్తి తీసి తల నరకబోయేసరికి దైవదూత అడ్డొచ్చి నిలిపేశాడు. తన దోషాలకు ప్రాయశ్చిత్తంగా తన సొంత కొడుకునే బలియివ్వడానికి ముందుకొచ్చిన అబ్రహాంను దీర్ఘాయుష్షుతో, సంపదలతో వర్ధిల్లమని దేవుడు దీవించాడు. అలాగే అబ్రహాం 175 ఏళ్ళు బ్రతికాడు. అతడిని పాతిపెట్టిన చోటు కోసం ఇప్పటికీ కొట్టుకుంటున్నారు. కొండ గుహలో పాతేసినట్లు కథనం అల్లి వేర్వేరు ద్వారాలు ఏర్పరచి ఎవరికి వారే ప్రార్ధనలు చేస్తుంటారు.

అబ్రహాం నరబలిని గొప్ప త్యాగలక్షణంగా చెప్పడం మత అమానుష లక్షణం. మతాలు అలాంటి రక్తపూరిత త్యాగాల్ని ప్రోత్సహిస్తున్నాయి. అదే పెద్ద పాపం.

ఆత్మ త్యాగం, ప్రాణాన్ని అర్పించడం, అమర జీవుల లక్షణంగా మతాలు శ్లాఘించాయి. హిందువులలో భర్త చనిపోతే చితిపై భార్యను పెట్టి కాల్చడం గొప్ప త్యాగంగా ఆచరించారు. ఆత్మాహుతిని ఖండించిన ఇస్లాం మతం పేరిట అదే చర్యను ప్రోత్సహిస్తున్నది.

ఆదాం తప్పు చేస్తే అందుకు అతడే బాధ్యత వహించాలి. కాని అందరు మానవులూ ప్రాయశ్చిత్తం చేసుకోవాలనడం దారుణం. ఆదాం తప్పులు చేయడం ఏనాడో జరిగింది. జీసస్ సైతం అప్పుడు పుట్టలేదు. అయినా సరే నేను చేయని తప్పులకు నేనెందుకు శిక్ష అనుభవించాలి అంటే, క్రైస్తవులకు జవాబు దొరక లేదు.

బైబుల్ పాత నిబంధనలో కొందరు ప్రవక్తలు జోస్యం చెప్పారు. అది అమలు కావడానికి, జీసస్ జెరూసలేం వచ్చాడంటారు. అతడిని తృణీకరించిన యూదులు, అతని రక్తాన్ని కోరారు. జీసస్ ను చంపమని యూదులే ఉత్తరువులిచ్చారని పోప్ నిర్ధారించాడు. కనుక యూదు జాతి సామూహికంగా శిక్షను అనుభవించాలన్నమాట. మతం చేసిన పాపాలలో యిదొకటి. వ్యక్తి దోషాన్ని, అందరికీ అంటగట్టి, అందరినీ శిక్ష అనుభవించమనడం అవనీతికరం. మతం చేసిన మరోపాపం యిదే.

బైబుల్ లో నరకాన్ని వర్ణించారు. అది తెలిసిన పిల్లల మనస్సుపై హత్తుకపోయి, భయం తిష్ఠ వేసుకుంటుంది. కొన్ని ఆచారాల ప్రకారం మనుషుల పాపాల్ని జంతువులకు బదిలీ చేసి, వాటిని బలి యివ్వడం ఆచారమయింది. క్రైస్తవులు ఆ విధంగానే గొర్రెల్ని బలి యిస్తున్నారు, ఒకరి తప్పులు మరొకరు నెత్తిన వేసుకోవడం గొప్ప త్యాగం కాదు.

దేవుడిని నమ్మావనుకో, కాసేపు దేవుడు ఉన్నాడనుకో అప్పుడు ప్రార్ధనలకు ఫలితం వుండొచ్చు. దేవుడిని నమ్మవు, లేడనుకో. అయితే పోయిందేముంది? బెర్ట్రాండ్ రస్సెల్ యిలాంటి ప్రశ్నకు యిలా చెప్పాడు. ***నీవు చనిపోయినప్పుడు దేవుడి ఎదుట ప్రవేశ పెడితే, ఏమంటావంటే, నిన్ను గురించి నమ్మదగిన సాక్ష్యాధారాలు యివ్వలేకపోయావని.***

మతాలు తొలుత నుండీ సంభవమైన నిబంధనలు పెడుతూ వచ్చాయి. వాటి వలన మనుషులు దోషులుగా, పాపాత్ములుగా చూపడానికి చోటు చిక్కింది. ప్రాయశ్చిత్తంగా వసూళ్ళు చేస్తున్నారు.

వడ్డీకి అప్పు యివ్వరాదని ముస్లింలు అంటారు. లోగడ క్రైస్తవులూ అనేవారు. మనుషులు చొరవతో సాగిపోవడానికి యీ నిబంధనలే అడ్డం. అవి ఉల్లంఘించారంటూ శిక్షలు వేయడం.

మత రాజ్యాలన్నీ ఆధ్యాత్మిక వ్యాపారాలు చేస్తున్నాయి. ఒక వస్తువు పేరిట కొనుగోలు చేసి, కొంతకాలం తరువాత మరొక రూపంలో అది బదిలీ చేసి, వాడుకోడం ద్వారా, మతాలన్నీ చక్కని వ్యాపారం చేస్తున్నాయి. అలాంటప్పుడు వారు పెట్టిన నియమాలు వారికి అడ్డురావు. క్రైస్తవులు, ముస్లింలు యీ విషయంలో ఆధ్యాత్మిక పోలీస్ రాజ్యాలు నడిపిస్తున్నాయి. నీ వలె నీ

పొరుగు వారిని ప్రేమించు అనేది ఒక పట్టాన సాధ్యమయ్యేది కాదు. అలాగే చిత్రహింసలకు గురైనప్పుడు, మరణ దశలో మానవాతీతులుగా వుండమనడం జరిగేపని కాదు.

ఎవరికైనా అప్పిచ్చినప్పుడు అదే స్నేహితుడికో, తెలిసిన వారికో అయితే, వడ్డీ లేకుండా అసలు తిరిగి యిస్తే చాలు అనుకోవడం గొప్ప. తెలియనివారికి అప్పిచ్చి, వడ్డీ అడగొద్దనడం అర్థ చేసుకోలేదు. నిస్వార్థంగా వుండమనడం వేరు, బలవంతంగా నిస్వార్థం ఆచరించమనడం వేరు.

సెక్స్ విషయంలోనూ మతాలు విధించే నిషేధాలు అర్థం పర్థం లేనివి. పుట్టుకతో జన్యు శాస్త్ర రీత్యా కొందరిలో తీవ్ర స్వభావం, మరికొందరిలో సాధు స్వభావం వుండొచ్చు. వాటిని మలచుకోవడం కూడా జీవితంలో సాధ్యమే.

మొత్తం మీద చిన్నతనం నుండీ మనసుల్ని కలచి, మానవత్వాన్ని చెరచేదెవరు? అదీ అసలు ప్రశ్న.

అన్ని మతాలు ప్రపంచాన్ని గురించి తప్పుడు భావాన్ని అందించాయి. అన్ని మతాలు రక్తసిక్త త్యాగాల్ని కోరుతున్నాయి. ప్రాయశ్చిత్తం కావాలంటు న్నాయి. మానవులకు స్వర్గంలో శాశ్వత సుఖాలు, నరకంలోశాశ్వత శిక్షలు వున్నాయని భ్రమలు కల్పించి, భయపెడుతున్నాయి, ఆకర్షిస్తున్నాయి. అమలు పరచ వీల్లేని మనుషుల్ని వుక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అన్ని పాపాలకూ మూలం మతాలే.

-----

## అధ్యాయం – 16

# పిల్లల్ని చెడగొడుతున్న మతాలు

***పదేళ్ళ వరకూ పిల్లల్ని అప్పగించండి. ఎలా కావాలంటే అలా మలిచి యిస్తాను*** అని కేథలిక్ జెసూట్ ఫాదర్ అన్నాడు.

మతాలన్నీ యిదే ధోరణిలో ఉన్నాయి. మొక్కగానే వంచాలి. మాను అయిన తరువాత మార్చలేం అనేది సారాంశం. కనుక చిన్నప్పడే పిల్లలకు మత విషయాలు నూరి పోస్తున్నారు. అందులో భయంకర నరక దృశ్యాలు చెబుతారు. భూత ప్రేత పిశాచాల గురించి వర్ణిస్తారు. స్వర్గాన్ని వర్ణిస్తారు. అవన్నీ స్వయంగా చూచి వచ్చినట్లే చెబుతారు.

మతం మార్చుకుంటే ఎంత పాపమో, ఎన్ని విధాల దేవుడు నరకంలో శిక్షిస్తాడో కళ్ళకు గట్టినట్లు చెబుతారు. ఆ విధంగా ప్రపంచ వ్యాప్తంగా ఎందరు పిల్లలు మానసిక క్షోభకు గురైనారో లెక్కలేదు. ఎన్ని జీవితాలు దారుణంగా మారాయో చెప్పజాలం.

అన్ని మతాలు తమ పవిత్ర గ్రంథాల్ని అడ్డు పెట్టుకొని పిల్లల్ని మలచడం, చిత్రహింసలకు గురిచేయడం, భయభ్రాంతులను చేయడం సాగిస్తున్నాయి. వీటికి తల్లిదండ్రుల ఆమోద ముద్ర వున్నది. అదంతా తమ పిల్లల బాగుకోసం అనుకుంటారు. పైగా అందులో క్రమ శిక్షణ, నీతి వున్నదని భ్రమపడతారు.

పిల్లల్ని స్వేచ్ఛగా వదిలేస్తే 18 ఏళ్ళ వరకూ మూఢ నమ్మకాలకు అతీతంగా వుంచితే, తమకు దక్కకుండా పోతారనుకుంటారు. ఆ విధంగా మత మూఢనమ్మకాల్ని వంశపారంపర్యం చేస్తున్నారు.

యూరోప్ లో మధ్య యుగాల్లో మతాల చిత్రహింసలు ఎలా జరిగాయో, మ్యూజియంలు చూస్తే తేటతెల్లమౌతుంది. హాలండ్ నుండి టస్కనీ వరకూ యీ మ్యూజియంలో పవిత్ర పురోహిత వర్గాలు వాడిన క్రూర సాధనాలు తిలకించవచ్చు. నిప్పుల్లో తగులబెడుతూ, ఎంతసేపు తట్టుకొని బ్రతుకుతాడో గమనించారు. వీటి గురించి రాసిన పుస్తకాలు కూడా మ్యూజియంలో వుంచారు. మానవుడు మతాన్ని సృష్టించడమే గాక రకరకాలుగా వర్ణన యిస్తారు. హిందువుల నరకాలు వేరు. క్రైస్తవ నరకాలలో అప్పీలు లేనివి కూడా ఉన్నాయి. యూదులు నరక కూపంలో మంటల మధ్య శాశ్వతంగా కాలుతుంటారని ఒక ముస్లిం నాయకుడు అమెరికాలో అన్నాడు. అతని పేరు లూయీ ఫారఖాన్.

ఇలాంటి చిత్రవిచిత్రాల మధ్య పిల్లల్ని పెంచుతున్నారు.

స్త్రీలు ప్రాణం మీదకు తెచ్చుకున్నాసరే. ఎట్టి పరిస్థితులలోనూ గర్భస్రావం కుదరదని మతాలంటున్నాయి. వికలాంగులుగా, మెదడు పెరగకుండా, ఎక్కువ కాలం బ్రతకలేరని తెలిస్తే, అలాంటి పిండాలను తొలగించడం తల్లికీ సమాజానికీ మంచిది. లేకుంటే తల్లి బాధలు పడడం, పుట్టిన వారు మనుషులుగా ఎదగలేక పోవడం కద్దు. అయినా సరే మదర్ థెరీసా వంటివారు గర్భస్రావం వద్దంటున్నారు. గర్భనిరోధక తొడుగులు వాడరాదనీ, మాత్రలు తీసుకోకూడదనీ వాదిస్తున్నారు. అండం, రేతస్సు కలిస్తే పిల్లలు పుడతారు. గనుక, కలయికను ఆపరాదంటున్నారు. కానీ ప్రతి అండం, రేతస్సు పిల్లలకు దారితీయదు. ఎంతో రేతస్సు, ఎన్నో అండాలు వృధా అవుతుంటాయి. అదంతా పిండాల హత్యగా భావించరాదు. పిండశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందిన దశలో మతాలు గుడ్డి నమ్మకాల్ని అడ్డం పెట్టడం దారుణం.

ఇంకో రంగంలోనూ పిల్లల్ని తీవ్ర సంక్షోభానికి, బాధకు గురిచేస్తున్నారు. మగ పిల్లలకు మతపరంగా సుంతీ చేస్తున్నారు. దేవుడు సృష్టించిన అంగం కోయడానికి మతం ఒప్పుకుంటున్నది. ఇందుకు సెక్స్ వాదనలు తెచ్చారు. పిల్లవాడుగా ఉండగానే సుంతీ చేస్తే, బాధ తెలియదని, కనుక, బాల్యావస్థలోనే చేయాలంటున్నారు.

మతపరంగా కొన్ని దేశాలలో ముస్లిం బాలికలకు సుంతీ చేస్తున్నారు. దీని వలన జబ్బులు రావడం, చీము పట్టడం, చనిపోవడం కూడా జరుగుతున్నది. అయినాసరే కామప్రకోపం తగ్గిపోతుందని యిది అవసరమని వాదిస్తున్నారు.

పెద్ద వారికి సుంతీ చేస్తే అందులో బాధ ఏమిటో అర్థమవుతుంది. ఏమీ చేయలేని పిల్లలపై యిలాంటి అత్యాచారం అమానుషమే.

పిల్లలు హస్త ప్రయోగం చేసుకుంటారు. అది సహజమే గాని విడ్డూరం కాదు. కాని దీని చుట్టూ భయంకర వదంతులు వ్యాపింప చేసిన ఖ్యాతి మతాలదే. ముఖ్యంగా పురోహిత వర్గాలు కావలసినన్ని అజ్ఞాన సెక్స్ భయాందోళనలు ప్రచారంలోకి తెచ్చారు. పుస్తకాలు రాశారు. క్రైస్తవులు, ముస్లింలు మత పరంగా హస్త ప్రయోగం గురించి చెబుతున్న విషయాలు అశాస్త్రీయం,

అబద్ధాల మయం. హస్త ప్రయోగం వలన గుడ్డితనం వస్తుందని, వెన్నెముక అరిగి పోతుందని చెప్పారు. సౌదీ అరేబియాలో ముఫ్తి కురు వృద్ధుడు అబ్ద్ అల్ అజిజ్ బన్ బాజ్ యిలాంటి తప్పుడు హెచ్చరికలు చేశాడు. దీనిని యితరులు అందుకున్నారు. చివరకు వెబ్ సైట్లు పెట్టి తప్పుడు భయాందోళనలు వ్యాప్తిలోకి తెచ్చారు.

స్త్రీలను పురుషులను వేరుగా వుంచడం మత ధర్మంగా ముస్లిం దేశాలు ఆచరిస్తున్నాయి. స్వర్గంలో కన్యలతో సంభోగం ఆహ్వానించిన మతం, యీ లోకంలో మాత్రం సెక్స్ పట్ల అజ్ఞానంతో, అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నది.

కేథలిక్కులు మతపరంగా పురోహితులకు, అమ్మగార్లకు (నన్స్ కు) విధిగా బ్రహ్మచర్యం కావాలంటున్నారు. దీని వలన లైంగిక దురాచారాలు వారిలో ప్రబలి కేసుల్లో పట్టుబడు తున్నారు. చర్చిలో పూజాసేవలు అందించే పిల్లల్ని చెరుస్తున్నారు.

హస్త ప్రయోగం (మాస్టర్ బేషన్) వలన ఎలాంటి చెడు లేదు. ఎటువంటి జబ్బులూ రావు, సెక్స్ జీవితానికి ఏ హానీ జరగదు. ఇది శాస్త్రీయంగా రుజువుపైన అంశం. మతాలు తెలుసుకోవాల్సిన సత్యం.

-----

# అధ్యాయం – 17

# ఫాసిజం, నాజీలకు మద్దతుదారులుగా మతాలు

దేవుడు లేకుంటే విచ్చలవిడితనం పెరిగి పోతుందని, నాస్తికత్వంలో నీతి లేదని మతాలు ప్రచారం చేశాయి. అందుకు ఉదాహరణగా ఫాసిజాన్ని, నాజీయిజాన్ని చూపాయి. అంటే ఇటలీలో ముసోలినీ నాయకత్వాన తలెత్తిన ఫాసిజం నాయకత్వం అని చాటారన్నమాట. అలాగే జర్మనీలో వచ్చిన హిట్లర్ నాజీ నియంతృత్వానికి నాస్తికత్వ ముద్ర వేశారు. మతాలు పచ్చి అబద్ధాలు ఎలా ప్రచారంలోకి పెట్టగలవో యివి మచ్చుతునకలు.

ప్రాచీన రోమ్ లో పెత్తనం సాగించిన పద్ధతులకు చిహ్నంగా కట్టెలను కట్టి గొడ్డలికి చుడతారు. అది ఐక్యతకు, ఆధికారతకు చిహ్నం అంటారు.

మొదటి ప్రపంచ యుద్ధంలో ఓడిపోయి, అవమానాలకు గురైన వుద్యమాలు, సంప్రదాయ విలువల్ని, జాతీయ వాదాన్ని నిలబెట్టుకోవాలని ప్రయత్నించాయి.

అలాంటి ఫాసిస్టు ఉద్యమాలన్నీ కేథలిక్కుల దేశాలలోనే వచ్చాయి. కేథలిక్ మతం ఫాసిజానికి సానుకూలంగా వుంది. ముసోలినీ ఇటలీలో అధికారానికి రాగానే పోప్ వారితో అధికారికంగా ఒడంబడికలు చేసుకున్నాడు. 1929లో దీనిని లాటరన్ ఒడంబడిక అన్నారు. దీని ప్రకారం ఇటలీలో కేథలిక్ మతం ఒక్కటే గుర్తింపు తెచ్చుకున్నది. పుట్టుక, వివాహం, మరణం, చదువుపై పూర్తి అజమాయిషీ కేథలిక్ మతానిదే. ముసోలినీ పార్టీకి ఓటు వేయమని పోప్ సందేశం యిచ్చాడు. ముసోలినీ దైవం పంపగా వచ్చిన నాయకుడని పోప్ 11వ పయస్ ప్రకటించాడు. చాలా కాలంగా ఇటలీలో ఎన్నికలే లేవు. కేథలిక్ పార్టీలన్నీ రద్దు గావించి కొత్తగా కేథలిక్ కార్యాచరణ పార్టీని పెట్టారు. అనేక దేశాలలో దీనిని అనుకరించారు. స్పెయిన్, పోర్చుగల్ క్రొయేషియాలలో ఫాసిజంతో కేథలిక్ లు చేతులు కలిపారు.

స్పెయిన్ లో జనరల్ ఫ్రాంకో ఆక్రమణనను కేథలిక్ మతం దీవించింది. ముసోలినీ లిబియా, అబిసీనియా (ఇథియోపియా) అల్బేనియాలను ఆక్రమిస్తే, కేథలిక్ పోప్ సమర్థించాడు.

మధ్య యూరోప్ లో హంగరీ సైనిక కుట్రను, స్లొవేకియా, ఆస్ట్రేలియాలో ఫాసిస్టు నియంతలను పోప్ వెనకేసుకొచ్చాడు.

ఫ్రాన్స్ లో సోషలిస్టు యూదు స్థానే జర్మన్ నియంత మేలు అని నినదించారు. ఫ్రెంచి ప్రజాస్వామ్యాన్ని కేథలిక్ లు ఎదిరించారు. ఫ్రాన్స్ ను జర్మనీ ఆక్రమించుకుంటుంటే ఫ్రెంచి యూదుల్ని హతమార్చడంలో కేథలిక్కులు తోడ్పడ్డారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కావాలనే ఫ్రెంచి నినాదాన్ని కేథలిక్కులు తుడిచిపెట్టారు. ఇంగ్లండ్ లో సైతం కేథలిక్ రచయితలు టి.ఎస్. ఇలియట్, ఎవిలిన్ వా ద్వారా ఫాసిస్టు ధోరణులు వినిపించారు.

ఐర్లండ్ లో కేథలిక్కులు జనరల్ డఫీ ఆధ్వర్యాన స్పెయిన్ కు వాలంటీర్లను పంపి, నియంత ఫ్రాంకోకు వత్తాసు పలికారు. హిట్లర్ చనిపోతే, ఐర్లండ్ అధ్యక్షుడు డివాలెరా జోహార్లు అర్పించాడు.

కేథలిక్ దేశాలు చేసిన పనుల దృష్ట్యా, వారంతా ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వానికి అనర్హులు. ఫాసిస్టు నియంతృత్వం కనిపించకుండా పోయేంతవరకూ, కేథలిక్కులు కాపు కాసారు.

ఫాసిజంలో ఏకోశాన నాస్తికత్వం లేదు.

**హిట్లర్ రాజ్యంలో** - జర్మనీలో హిట్లర్ నాజీ రాజ్యం మొదలు కాగానే, ఆర్యులుగా జాతి ఔన్నత్యాన్ని ప్రదర్శించారు. యూదుల్ని, జర్మనీలో ఆర్యేతరుల్ని ఏరిపారేసే కార్యక్రమం చేబట్టారు. తొలుత కేథలిక్కులు దీనిని అభ్యంతర పెట్టారు. క్రమంగా కేథలిక్కులు నాజీల పట్ల తొలుత ఉదాశీనంగా వుంటూ, రాను రాను వెనకేసుకొచ్చారు.

హిట్లర్ అధికార పగ్గాలు చేబట్టిన తొలిరోజులలోనే (1933 జులై 8) పోప్ సంధి చేసుకున్నాడు. కేథలిక్ పార్టీని రద్దు చేసుకున్నారు. కేథలిక్కులు రాజకీయ కార్యకలాపాలలో జోక్యం చేసుకోవద్దన్నారు. కేథలిక్కులపై వ్యతిరేకతను నాజీలు

మానేశారు. జర్మనీలో రెండున్నర కోట్ల కేథలిక్కులు సానుకూలంగావడంతో, హిట్లర్ యూదు వ్యతిరేక చర్యలకు సౌకర్యం కలిగింది. న్యూరెంబర్గ్ శిక్షలకు తోడ్పడే నిమిత్తం, ఆర్యులు కానివారి జాబితాలను కేథలిక్ మతం అందించింది.

మరో పక్క ప్రొటెస్టంట్లు హిట్లర్ కు సాష్టాంగ పడ్డారు.

హిట్లర్ జన్మ దినాన్ని కేథలిక్ లు తమ చర్చిలలో జరిపారు. 1939 ఫిబ్రవరిలో పాసెలి పోప్ 12వ పయిస్ పెత్తనంలోకి వచ్చి, హిట్లర్ ను బాగా కోపు వేసుకున్నాడు. అప్పటి నుంచీ కేథలిక్కుల మద్దతు, యుద్ధం ముగిసేవరకూ, హిట్లర్ కు లభించింది. దైవ ప్రతినిధిగా వున్న పోప్ ఆవిధంగా  నాజీనియంత హిట్లర్ కు దాసోహం అని, సమర్ధించాడు. రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీలను మట్టి గరిపించారు. పాపం దైవ ప్రతినిధి పోప్ మద్దత్తు వుండి కూడా అలా జరిగింది.

కాని కేథలిక్కులు ఏం చేశారు? నాజీ నేరస్తులకు సహాయ పడుతూనే పోయారు. పాస్ పోర్టులు, డాక్యుమెంట్లు, డబ్బు, యిచ్చి, దక్షిణ అమెరికాలో తమ వారి వద్ద ఆశ్రయం పొందేటట్లు చేశారు. దక్షిణ అమెరికాలో ఫాసిస్టు, నాజీ రాజ్యాలను కేథలిక్కులు సమర్ధించారు.

జర్మనీ, ఇటలీ నియంతలకు తోడుగా జపాన్ రాజు, దైవాంశ సంభూతుడు  నిలిచాడు. అతడిని క్రైస్తవులు ఖడించకపోగా, సమర్ధించారు. ఇండొనేషియా, చైనాలపై దండెత్తి దారుణాలు చేశారు. ఇదంతా దైవ ప్రతినిధిగా జపాన్ చక్రవర్తి ఆధ్వర్యాన జరిగినదే.

నాజీయిజం, ఫాసిజం, జపనీయులలో ఎక్కడా నాస్తికత్వం లేదని గ్రహించాలి.

ఐన్ స్టీన్ పై కూడా మతవాదులు దుష్ప్రచారం చేశారు. జర్మనీలో నాజీలకు ప్రతిఘటనగా మతం నిలిచినందుకు, ఐన్ స్టీన్ మెచ్చుకున్నట్లు ఆయన పేరిట ఆధారాలు లేని ప్రకటనలు సృష్టించారు. వికాసానికి నిలిచిన ఐన్ స్టీన్ యిలాంటి మతాలకు అతీతంగానే నిలిచాడు.

సోవియట్ యూనియన్ లో స్టాలిన్ ను దేవుడు పంపించాడని, ఆయన ద్వారా గొప్ప పరిపాలన అందిస్తున్నాడని క్రైస్తవ మతస్తులు ప్రకటించే స్థాయికి దిగజారారు. రష్యాలో బానిస రైతు విధానాన్ని సనాతన క్రైస్తవ మతం వెనకేసుకొచ్చింది.

దక్షిణ కొరియాలో దైవదూతగా ప్రచారం చేసుకున్న సున్ మయుంగ్ మూన్ యూనిఫికేషన్ చర్చి పేరిట పరిణామ వాదాన్ని, డార్విన్ ను వ్యతిరేకించాడు.

దక్షిణ అమెరికాలో జాత్యహంకార విధానాలన్నీ మతపరంగా సాగినవే.

మతం నాడూ నేడూ సైన్స్ అన్వేషణకు విరోధిగా నిలచింది. అబద్ధాలు, భయాలలోకి జనాన్ని తోలింది. బానిసత్వాన్ని, సామూహిక హత్యల్ని, జాతి విచక్షణను, రంగు భేదాన్ని, నిరంకుశత్వాన్ని మతం పాటించింది. అజ్ఞానాన్ని ఒక పద్ధతిగా ప్రచారం చేసింది. ఏ మతమూ వీటికి మినహాయింపు కాదు. అన్ని నియంతృత్వ పాలనలూ మత ప్రోత్సాహంతో సాగాయి.

మానవుడు పుట్టక పూర్వమే అతనికి శిక్షలు ఎదురు చూస్తున్నాయని మతం అమానుష ప్రచారం చేసింది.

మతం మానవుల అభివృద్ధికి ఉపయోగపడిన దాఖలాలు లేవు.

నాస్తికుల్ని విమర్శించే తాహతు, అర్హత మతాలకు లేదు. నాస్తికులు అవినీతిపరులని, విలువలు లేనివారని చూపడం అసంభవమని వారు గ్రహించక తప్పదు.

-----

## అధ్యాయం – 18

# అణచివేతకు గురయిన స్వేచ్ఛాలోచన

ఆదిమ మానవుడి దశలోనే సందేహం, ప్రశ్న, విచక్షణ మొదలైనాయి. గుడ్డిగా నమ్మని వారిని మతాలు హింసిస్తూనే వున్నాయి. దేవుడు లేడనే మూర్ఖులుగా దూషిస్తూనే వున్నారు.

దేవుడ్ని నమ్మేవారు, ఎదురు చూస్తూనే వున్నారు. ప్రార్థనలు, పూజలు, యజ్ఞాలు యాగాలు క్రతువులు, వ్రతాలతో కాలం గడుపుతూనే వున్నారు.

ప్రాచీన గ్రీకుల కాలంలో సోక్రటీస్ స్వేచ్ఛాలోచనకు, అన్వేషణకు నాంది పలికాడు. మొండిగా అర్థం లేని వాదనల్ని ఖండించాడు. జీవితానంతరం ఏమీ లేదని స్పష్టం చేశాడు. పిడి వాదనలు వివేచన ముందు నిలబడవన్నాడు. చిత్త శుద్ధితో ఆలోచిస్తూ పోవాలన్నాడు.

సోక్రటీస్ సందేహ వాదనల్ని, కార్యకారణతను, తట్టుకోలేక, సోక్రటీస్ స్కూలును తగులబెట్టారు.

ఒకసారి ఒక రైతు వచ్చి సోక్రటీస్ ను అడుగుతూ, దేవుడు లేకపోతే పంటలకు నీళ్ళిచ్చే వర్షాలను ఎవరు కురిపిస్తారు అన్నాడు. సోక్రటీస్ దేవుడే వర్షం కురిపిస్తే, మేఘాలు లేకుండా కూడా ఆకాశం నుండి వాన రప్పించవచ్చుగదా. అలా జరగడం లేదు. కనుక, వర్షాలకు మూలం మేఘాలన్నాడు.

సరే, మేఘాలను ఆకాశంలోకి ఎవరు తెప్పిస్తున్నారని రైతు అడిగాడు.  దేవుడు కాదా అని అన్నాడు. మళ్ళీ సోక్రటీస్ వివరిస్తూ, గాలి, వేడిమి కారణాలన్నాడు. సరే, ఒప్పుకుందాం. మెరుపులు ఎక్కడ నుండి వస్తున్నాయి అని రైతు ప్రశ్నించాడు.

సోక్రటీస్ నెమ్మదిగా చెబుతూ, దేవుడు మెరుపులు తెప్పించడం లేదని, అవి విచక్షణా రహితంగా వస్తున్నాయని, ఒక్కోసారి దేవాలయాలను తాకితే, అవి తగలబడుతున్నాయనీ చెప్పాడు. రైతుకు నచ్చింది. అయినా సోక్రటీస్ దెబ్బకు దిమ్మ తిరిగి చేసేది లేక, తన గుడ్డి నమ్మకాన్ని చూపుతూ, సోక్రటీస్ స్కూలు తగలబెట్టి తృప్తి పడ్డాడు. అదీ మూఢ విశ్వాసం అంటే. దేవుడు లేడని ఘంటాపథంగా ధైర్యంగా చాటిన వ్యక్తి గ్రీక్ తాత్వికుడు ఎపిక్యురస్. అతని రచనలు లూక్రిటస్ అనే కవిని ప్రేరేపించగా రచనలు చేశాడు. ఇతడు క్రీ.పూ. ఒకటో శతాబ్దంలో ఉన్నాడు. క్రైస్తవులు ఉత్తరోత్తరా అతని కవితలు ధ్వంసం చేశారు. కొద్దిగా ఎలాగో మిగిలాయి. అన్ ది నేచర్ ఆఫ్ థింగ్స్ అనే కవిత సుప్రసిద్ధ సైంటిస్టు ఐజక్ న్యూటన్ ను సైతం ఉత్తేజ పరచింది. తన ప్రిన్సిపియాలో ఆ కవితను ఉదహరించాడు.

మధ్య శతాబ్దాలలో మతాల చిత్ర హింసలు దారుణంగా వుండగా హాలండ్ మాత్రం స్వేచ్ఛా పరులకు చక్కని ఆశ్రయం యిచ్చింది. బెయిల్, రేనీ డే కార్ట్, గెలీలియో, స్పినోజా వంటి వారు తమ రచనలు అక్కడ చేయగలిగారు.

స్పినోజా గొప్ప తాత్వికుడు. యూదు. కాని యూదులు అతడిని వెలివేశారు. అతడితో ఎలాంటి సంబంధాలు పెట్టుకోరాదన్నారు. స్పినోజా గ్లాస్ ను పరిశుభ్రం గావించి, పాలిష్ చేశాడు. మనం వాడే కళ్ళ జోళ్ళ అద్దాలకు అతడే ఆద్యుడు. గెలీలియో అవి తొలిసారి ప్రయోగించి, గొప్ప విషయాలు చెప్పగలిగాడు.

స్పినోజా యూదుల దేవుళ్ళను తృణీకరించాడు. మూఢ నమ్మకాలకు అతీతంగా ప్రకృతి మనస్సు గురించి రాశాడు. అందుకే అతడిని దూరం పెట్టారు. ఐన్‌స్టీన్ సైతం స్పినోజా తత్వంతో ఉత్తేజితుడైనాడు. యూదులకు వత్తాసు పలుకుతూ ఆనాడు కేథలిక్కులు స్పినోజాను దూరంగా వుంచారు.

ఫ్రాన్స్‌లో వచ్చిన డిడొరో కూడా ఎన్ సైక్లోపెడియాలో స్పినోజాకు చాలా ప్రాధాన్యత యిచ్చాడు. ప్రకృతి అంతా దేవుడే అనే రీతిలో స్పినోజా రాశాడు.

తాత్వికులు ఇమాన్యుయేల్ కాంట్, డేవిడ్ హ్యూమ్ మొదలైనవారు స్వేచ్ఛాలోచన బాగా పెంచారు. యూరోప్ లో ఫ్రెంచి విజ్ఞాన సర్వస్వం భావ విప్లవాలు తెచ్చింది. ఎప్పటికప్పుడు క్రైస్తవం, యూదు, ఇస్లాంలు భావ స్వేచ్ఛను అడ్డుకుంటూ పోయాయి.

థామస్ పెయిన్ తన రచనల ద్వారా క్రైస్తవాన్ని, బైబుల్ ను విమర్శించి, చాలామంది కళ్ళు తెరపించాడు. అతడి ఏజ్ ఆఫ్ రీజన్ నేటికీ ఉత్తమ రచనగా నిలచింది. అమెరికా తొలి అధ్యక్షులు థామస్ పెయిన్ రచనలతో ప్రభావితులయ్యారు. జఫర్సన్ అందులో ఒకరు. ఛార్లస్ డార్విన్ కూడా పెయిన్ రచనలు చదివాడు. ఎలాగైనా చివరి దశలో  అతడికి క్రైస్తవ ముద్రవేయాలని చూశారు. కాని అతను లొంగ లేదు.

శతాబ్దాలుగా ఎందరో నాస్తికులు మూఢనమ్మకాలను వ్యతిరేకించారు. కొందరు బయట పడలేక దాచుకున్నారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్ వంటివారు ఆకోవలోకి వస్తారు.

-----

## అధ్యాయం – 19

# కొత్త వికాసం నేటి అవసరం

దేవుడు తమకు దివ్యవాణి సందేశం వెల్లడించాడని చెప్పేవాళ్ళంతా తమను తాము వంచించుకుంటున్నారు. ఇతరులను మోసగించి వత్తిడికి గురిచేస్తున్నారు.

మనకు కావలసింది అన్వేషణ. మానవశక్తి సంపదను నిరంతరం సద్వినియోగం చేస్తేనే, ఏదైనా సాధించగలరు.

మతాలన్నీ కరడుగట్టిన తత్వాలే. అవి ఎలాంటి ప్రశ్నలకూ జవాబివ్వ జాలవు.

సందేహం, పరిశోధనలకు బదులు, అంధ విశ్వాసాన్ని, మొండి వాదనను స్వీకరిస్తే, జీవితాన్ని వృధా చేస్తున్నట్లే.

సుప్రసిద్ధ క్రైస్తవమత గురువు థామస్ అక్వినాస్ దైవ త్రిమూర్తులపై సిద్ధాంత గ్రంథం రాశాడు. దానిని క్రైస్తవ దేవాలయ పీఠం వద్ద పెట్టి, దేవుడి అభిప్రాయం కోరాడు.

కొన్నాళ్ళకు తన గ్రంథాన్ని దేవుడు సమీక్షించి, దీవించాడని నమ్మాడు. ఆ గ్రంథం పీఠం చుట్టూ తిరుగాడిందని, క్రైస్తవ సన్యాసులు చెప్పి, అదే సాక్ష్యం అన్నారు. అదీ నమ్మకం అంటే.

అంధ విశ్వాసాలు పాలకులలో వుంటే, ఏ స్థాయికి పోతాయో చూడండి.

ఇరాన్ అధ్యక్షుడు అహమ్మద్ నెజాద్ ఐక్యరాజ్య సమితిని ఉద్దేశించి మాట్లాడాడు. మాట్లాడుతున్నంత సేపూ అతడికి ఒక గ్రీన్ లైట్ (ఆకుపచ్చ వెలుగు) కనిపించిందట. అది ముస్లింలకు యిష్టమైన పవిత్ర రంగుగదా. అది దివ్యకాంతి గనుక, అందరూ నిశ్శబ్దంగా అతడి ఉపన్యాసం విన్నారట. ఇరాన్ కు తిరిగి రాగానే తన ఉపన్యాస ప్రతి నుండి కాగితాలు పుచ్చుకొని, ఊరేగింపుగా టెహ్రాన్ – కోం నగరాల మధ్య ఉన్న ఒక బావి దగ్గరకు వెళ్ళాడు. కాగితాలు అందులో పడేశాడు. 873లో 5 ఏళ్ళ వయస్సుగల ముస్లిం ఇమామ్ ఆ బావిలో ప్రవేశించి తిరిగి కనిపించలేదట. అతడు తిరిగి వస్తే ప్రపంచానికి విమోచన వస్తుందట.

అణ్వస్త్ర విషయాలలో ఇరాన్ ప్రగతికి చిహ్నంగా ఇమాం అలా చేశాడు. ఇరాన్ ఒక పక్క బాధల్లో వుంది. ప్రజలు పేదరికంలో కుమిలిపోతున్నారు. అణచివేతకు గురౌతున్నారు. అవినీతి విపరీతంగా ఉంది. అలాంటి దేశానికి అణుశక్తి అత్యవసరమైనట్లు పాలకులు భావిస్తున్నారు. కనుక అందుకు సంబంధించిన కాగితాలు, 12వ ఇమాం దీవెనల నిమిత్తం బావిలో పెట్టారు.

షియాల వూరేగింపులు, క్రతువులు గమనిస్తే, కొన్ని కేథలక్కుల నుండి అనుకరించినట్లున్నవి. వారి 12 ఇమాంలలో ఒకరి తిరిగి రాకపై నమ్మకం పెట్టుకున్నారు. అందులో హుస్సేన్ మరణం పట్ల ఒక క్రతువు పెంపొందించారు. అతడు కర్బలాలో ద్రోహానికి గురైనట్లు కథనం ఉంది. షియాల వూరేగింపులో గుండెలు బాదుకోవడం తమ నాయకుడికి గుర్తుగా స్వీయ బాధలు పడడం గమనిస్తాం. షియాల సెలవు దినం అషురా అలాంటి క్రతువులకు చిహ్నం.

ఏకేశ్వరారాధన మతాలన్నీ పుక్కిటి పురాణాలపై, గాధలపై నడుస్తున్నాయి.

పర్ష్యాకు గొప్ప నాగరికత వుండేది. అది నేడు గిడసబారింది. అక్కడి రచయితలు, మేధావులు, కళాకారులు ప్రవాసం పోయారు. సెన్సార్ కు గురైనారు. వారి స్త్రీలు వంటింటికి పరిమితం గావించబడ్డారు. పాతికేళ్ళు మతపాలన ఫలితంగా రగ్గులు తయారు చేయడం, పిస్తా పప్పులు ఎగుమతి చేయడం మినహా, ఇరాన్ ముందుకు సాగలేదు. అణ్వస్త్రం పెంపొందించడం మినహాయిస్తే, ఇరాక్ లో ఆధునికత, సాంకేతిక పురోగమనం లేదు.

అంధ విశ్వానికీ నాగరితలకూ సంఘర్షణ వాటిల్లితే, పోరాట దశ మారుతుంది. మత పురోహితుల పెత్తనం క్రింద వున్న రాజ్యాలు అధోగతికి దిగజారుతున్నాయి. వారి ఆర్థికత అధమస్థాయికి పోతున్నది. ఆలోచనాపరులు నిర్వీర్యు లవుతున్నారు. ఆఫ్ఘనిస్తాన్లో తాలిబన్ రాజ్యం అందుకుదాహరణ. 2001 సెప్టెంబరు 11న అత్యంత ఆధునిక కట్టడాలను అమెరికాలోని న్యూయార్క్ లో కూలగొట్టమని, అఫ్ఘనిస్తాన్ నుండి ఛాందసులను పంపారు. ఆత్మాహుతి పేరిట, త్యాగం పేరిట మత ఛాందసానికి గురి చేశారు. వెర్రి ఆవేశంతో కేరింతలు కొట్టారు. విశ్వాసాన్ని నమ్ముకున్నవారు కనీసం మానవులకు ప్రయోజనకరమైన కట్టడాలను నిర్మించలేక పోయారు. విధ్వంసానికి తప్ప, పునర్నిర్మాణానికి మతం తోడ్పడలేక పోయింది.

యూరప్ లో డెన్మార్క్ చిన్న ప్రజాస్వామిక దేశం. అక్కడి కోపెన్ హేగన్ నగరంలో ఒక పత్రిక ఇస్లాం ప్రవక్తపై కొన్ని వ్యంగ్య చిత్రాలు ప్రచురించింది. అదిసాకుగా తీసుకొని, చంపేస్తామని బెదిరిస్తూ, విధ్వంసక చర్యలకు దిగారు. అశ్చర్యమేమంటే, కేథలిక్ పోప్ సైతం ఆ కార్టూన్లను ఖండించారు. ఇంగ్లండ్ లో కాంటర్ బరీ బిషప్ కూడా తందానా అన్నాడు. జర్నలిస్టులు అసలు విషయాల్ని దాచి, వార్తల్ని ప్రచురించారు. ఇస్లాం పట్ల గౌరవం చూపాలంటూ ధర్మోపన్యాసాలు చేశారు. ఇదంతా భయపడి చేసినట్లు కొందరు ఎడిటర్లు అన్నారు. స్వేచ్ఛను అడ్డుకోవడానికి పాశ్చాత్యలోకంలో సైతం కొందరు మతపరంగా పూనుకున్నారు. కాని యిలాంటిదే మతేతర ప్రజలకు జరిగితే, ఆదుకోవడానికి ఎవరూ ముందుకు వచ్చేవారు కాదు.

ప్రార్థన చేస్తే రోగాలు తగ్గుతాయనేది ఎక్కడా రుజువు కాలేదు. మరోపక్క యీ ప్రకృతి అంతా దైవ పథకం ప్రకారం వున్నదని పిల్లలకు పాఠాలు చెప్పమని మత ఛాందసులు అంటున్నారు. మరోవైపు ప్రపంచం అంతమైన తరువాత సంగతులు చర్చించే మత ఛాందసులు బయలుదేరారు.

విశ్వాన్ని నిరంతరం అధ్యయనం చేస్తూ, కొత్తవి కనుగొంటూ శాస్త్రీయంగా ముందుకు పోతున్నాం. డార్విన్, ఐనస్టీన్ వంటి వారి తోడ్పాటుతో ప్రకృతి రహస్యాలను కనుగొంటున్నాం. శాంతియుతంగా భిన్న సంస్కృతుల మధ్య సాన్నిహిత్యం పెంపొందించే రీతులు తలెత్తుతున్నాయి.

సైన్స్ – మతం పరస్పర విరుద్ధాలు. నేటికీ రక్త బలులు, హింస, త్యాగం పేరిట విధ్వంసాన్ని మతాలు ఆచరిస్తున్నాయి. మతం మనుగడకు ఎలాంటి సమర్థనా చేయజాలం. అభివృద్ధిని అడ్డుకోవడం తప్ప, మతం చేయగలిగిందేమీ లేదు.

నేడు మానవులకు వికాసం కావాలి. మానవులను అధ్యయనం చేయడానికి తోడ్పడేది మానవులే. ఇందుకు ప్రతి వ్యక్తి తోడ్పడగలగడం గమనార్హం. పవిత్ర మూల గ్రంథాన్ని కూలంకషంగా చదివి, వాటి విషయాల్ని విప్పి, వాటిలో పవిత్రత ఏదీ లేదని చూపే సమయం వచ్చింది. బంధాలు లేని శాస్త్రీయ అన్వేషణ సాగాలి. ప్రతి ఫలితాన్ని మానవులందరూ అనుభవించేట్లు చూడాలి. మతాన్ని దూరంగా పెడితే, జీవితం ఆనందమయం చేసుకోవచ్చు. నేడు అలాంటి అవకాశం వుంది. అయితే అంతసులభంగా యిది సాగదు. బంధాల నుండి విమోచన గావించుకుంటూ పోవాలి. మానవాళి శత్రువు మతం అని గ్రహించి దానిపై పోరాడి స్వేచ్ఛను స్థాపించుకోవాలి.

-----